ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ప్రకాశం

జిల్లా వార్తలు

3

ఆదివారం 11, ఫిబ్రవరి 2024



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

మెప్మాలో రుణ దోపిడీపై విచారణ చేయించాలి

● కలెక్టర్‌కు టీడీపీ నాయకుల వినతి

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 10 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో జరిగిన రుణ దోపిడీపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కలెక్టర్ దినేష్ కుమార్‌ను కోరారు. ఈమేరకు ఆయనకు శనివారం వినతిపత్రం సమర్పించారు. కొందరు వైసీపీ నాయకులు మెప్మాలో బోగస్ గ్రూపులను సృష్టించి బ్యాంకులను బురిడీ కొట్టించి రూ.కోట్లు బొక్కేశారని వారు ఆరోపించారు. అధికార పెత్తనంతో మెప్మా ఉద్యోగులపై ఒత్తిడి పెంచి ఈ వ్యవహారానికి పాల్పడినట్లు తెలుస్తున్నదన్నారు. అవినీతి జరిగినట్లు మేయర్ గంగాడ సుజాత కూడా మీడియా ముందే ఒప్పుకున్నారని వారు వివరించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిధులను స్వాహా చేసిన వైసీపీ నాయకులతోపాటు వారికి సహకరించిన ఆర్పీలు, సీవోలు, ఇతర ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ పరిశీలించి విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎద్దు శశికాంత్ భూషణ్, మదన్, పెళ్లూరు చినవెంకటేశ్వర్లు, రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

అనిశ్చితికి తెర!



ఎస్పీగా రేపు బాధ్యతలు స్వీకరించనున్న పరమేశ్వరరెడ్డి

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 10 : జిల్లా ఎస్పీ ఎవరు అన్న విషయంలో పదిరోజులుగా నెలకొన్న అనిశ్చితికి తెరపడింది. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పరమేశ్వరరెడ్డి ఎస్పీగా సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ పనిచేస్తున్న మలికగర్గ్‌ను తిరుపతికి, అక్కడ పనిచేస్తున్న పరమేశ్వరరెడ్డిని మన జిల్లాకు బదిలీ చేస్తూ కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే అధికార పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తంచేయడం, ఇతరత్రా కారణాలతో వీరి బదిలీ తాత్కాలికంగా నిలిచిపోయింది. అదే సమయంలో వారం క్రితం ఎస్పీ మలికగర్గ్‌కు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమం కూడా వాయిదా పడింది. అంతలోనే శాసనసభ సమావేశాలు ప్రారంభం కావడంతో ఎవరి స్థానాల్లో వారు ఉండిపోయారు. అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం ఎస్పీలను మరోచోటకు బదిలీ చేయాలంటే ఈసీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. దీంతో ముందుగా ఇచ్చిన ఉత్తర్వులనే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఇక్కడ ఎస్పీగా పరమేశ్వరరెడ్డి, తిరుపతి ఎస్పీగా మలికగర్గ్ సోమవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

పది మంది ఎస్సైలకు అటాచ్‌మెంట్

ఎస్పీ మలికగర్గ్ ఉత్తర్వులు

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 10 : జిల్లాలో ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న పది మంది ఎస్సైలకు అటాచ్‌మెంట్ ఇస్తూ ఎస్పీ మలికగర్గ్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎం.దేవకుమార్‌ను సంతనూతలపాడు, ఎం.అనితను అర్ధవీడు, జి.కోటయ్యను పొదిలి, బి.ప్రేమకుమార్‌ను సి.ఎస్.పురం ఎస్సైలుగా నియమించారు. పి.నాగేశ్వరరావు, బి.బాలూనాయక్, టి.వెంకటేశ్వరరావులను సీసీఎస్, ఆర్.ఎం.విజయకుమార్‌ను ఒంగోలు ట్రాఫిక్, సీహెచ్.రాజ్యలక్ష్మి, పి.వెంకటేశ్వర్లులను దిశ పోలీసు స్టేషన్‌లకు బదిలీ చేశారు.

ఒంగోలులో పేదలకు ఇళ్ల పట్టాల కోసం కేటాయించిన భూముల అభివృద్ధి పేరుతో భారీగా నిధులు బొక్కేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. రూ.కోట్లు కొల్లగొట్టేందుకు పావులు కదుపుతున్నారు. అర్హత లేని కంపెనీలతో టెండర్లు వేయించి మొక్కుబడిగా పనులు పూర్తి చేయించే పనిలో నిమగ్నమయ్యారు. నిబంధనల మేరకు టెండర్లు ఖరారైన తర్వాతనే పనులు చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ పూర్తికాకుండానే ఆగమేఘాల మీద ప్రారంభించడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు కొందరు అభ్యంతరం తెలిపినా వైసీపీ నాయకులు పట్టించుకోకుండా 'చెప్పింది చేయండి' అంటూ హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఓ అధికారిని బదిలీ చేయించేందుకు కూడా రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. మొత్తం మీద ఈ వ్యవహారంపై అధికారులు నోరుమెదపలేకపోతుండగా, తమకు తలా ఒకపని అయినా కేటాయిస్తారని భావించిన వైసీపీ కార్పొరేటర్లకు ఆశాభంగం ఎదురైంది.



రూ.కోట్లకు 'టెండర్'



భూములు చదును చేస్తున్న ట్రాక్టర్లు (ఇన్‌సెట్లో) ఇళ్ల స్థలాల కోసం ఎంపిక చేసిన భూముల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ (ఫైల్)

ఒంగోలులో వైసీపీ నేతల పన్నాగం

ఇళ్ల పట్టాలు ఇచ్చే భూముల అభివృద్ధి పేరుతో భారీగా స్వాహాకు ప్రయత్నం

టెండర్లు ఖరారు కాకుండానే పనులు వేగవంతం

ఇక్కడి వారిని కాదని తెలంగాణ కంపెనీకి కట్టబెట్టేందుకు ఉత్సాహం

అప్పులతో చేసే పనులకు తాము, ఆదాయం వచ్చే వాటికి వేరొకరా.. అంటున్న స్థానిక కాంట్రాక్టర్లు

పనులు దక్కుతాయని ఆశించి భంగపడిన అధికార పార్టీ కార్పొరేటర్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 10 : ఒంగోలులో 25వేల మందికి నివేశన స్థల పట్టాలు ఇచ్చేందుకు ఎస్.అగ్రహారం, చినమల్లేశ్వరపురం, వెంగముక్కపాలెం వద్ద 435 ఎకరాల భూమిని ఇటీవల ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందుకోసం రూ.126.34 కోట్లు వెచ్చించింది. ఆ భూముల్లో హద్దురాళ్లు, రోడ్ల ఏర్పాటు, క్వారీ రబ్బిష్‌తో చదును, జంగిల్ క్లియరెన్స్ తదితరాలకు సంబంధించి 12 పనులకు సుమారు రూ.21.33 కోట్లు మంజూరు చేసింది. వీటికి వారం క్రితం టెండర్లు పిలిచింది. అయితే జంగిల్ క్లియరెన్స్, హద్దురాళ్ల ఏర్పాటు పనులకు ఇంతవరకూ ఒక్క టెండర్ కూడా దాఖలు కాలేదు. క్వారీ రబ్బిష్ తోలకం, రోడ్ల ఏర్పాటు, కల్వర్టులు తదితరాలకు సంబంధించిన పది పనులకు మూడు కంపెనీలతో వైసీపీ నాయకులు టెండర్లు వేయించినట్లు సమాచారం. అందులో తెలంగాణకు చెందిన ఒక కంపెనీకి పనులు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. మిగిలిన రెండు కంపెనీలతో డమ్మీలుగా వేయించినట్లు తెలుస్తోంది. అయితే రివర్స్ టెండర్ ప్రకారం ఒకరికి పనులు కేటాయించడానికి వీలు లేదు. కనీసం ఇద్దరికి అర్హత ఉండాలి. అయితే ఇక్కడ వైసీపీ పెద్దలు వారికి కూడా అర్హత ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. దీంతో చేసేదేమీ లేక ఇక్కడి అధికారులు ఆ ఫైల్‌ను ఎస్ఈ ఆమోదం కోసం పంపగా తిరస్కరించినట్లు తెలిసింది. దీంతో కొద్దిరోజుల క్రితం రెండోసారి టెండర్లు ఆహ్వానించారు. ఇప్పటి వరకూ అవి ఖరారు కాలేదు.

తెలంగాణ కంపెనీతో లోపాయికారీ ఒప్పందం

నేరుగా పనులు చేపడితే ప్రజల్లో విమర్శలు వచ్చే అవకాశం ఉన్నందున, తమకు అనుకూలమైన తెలంగాణ కంపెనీతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్న వైసీపీ నేతలు వారిచేత ఇక్కడ టెండర్ వేయించారు. దీంతోపాటు మరో రెండు డమ్మీ కంపెనీలను కూడా రంగంలోకి దించి ఎలాగైనా పనులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. క్వాలిటీ కంట్రోల్‌తో సంబంధం లేని క్వారీ రబ్బిష్ తోలకం, రోడ్ల ఏర్పాటు, జంగిల్ క్లియరెన్స్, హద్దురాళ్లు వేయడం వంటి పనులన్నీ కూడా లాభం వచ్చేవే. వాస్తవానికి క్వారీ రబ్బిష్ క్యూబిక్ మీటర్‌కు కాంట్రాక్టర్‌కు రూ.400 ఖర్చు అవుతుండగా, ఇక్కడ మాత్రం క్యూబిక్ మీటర్‌కు వెయ్యి రూపాయలకు పైనే కోడ్ చేసినట్లు సమాచారం. పనులన్నీ ఒకటిన్నర నెలలోనే పూర్తి చేసి బిల్లులు దక్కించుకోవాలన్న వ్యూహంతో వైసీపీ నేతలు ముందుకు సాగుతున్నారు.

అధికారులపైన ఒత్తిడి

అందిన సమాచారం మేరకు రూ.22 కోట్లకు పనులు ప్రతిపాదించగా అందులో సగం వరకూ లాభం చేకూరుతుంది. దీంతో టెండర్లు ఖరారు కాకుండానే పనులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీనిపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల ఉల్లంఘనపై అభ్యంతరం తెలిపిన అధికారులపైనా ఒత్తిడి పెరగడమేకాకుండా వారిని మార్చేసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్లు సమాచారం.

ఇక్కడి కాంట్రాక్టర్‌లను కాదని పొరుగు రాష్ట్రం వారికి!

గతంలో కార్పొరేషన్ పరిధిలో ఏఅభివృద్ధి పనిచేసినా ఇక్కడి కాంట్రాక్టర్లను అవకాశం ఉండేది. కొద్ది నెలల క్రితం బిల్లులు పెండింగ్ ఉండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ససేమిరా అన్నారు. దీంతో అటు అధికారులు, ఇటు పాలకులు వారితో సమావేశం ఏర్పాటు చేసి మరీ పనులు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే చేపట్టిన పనులకు సుమారు రూ.25 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్ ఉన్నాయి. అయితే జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ పనులకు సంబంధించి మాత్రం ప్రభుత్వం ముందుగానే నిధులు విడుదల చేసింది. అవి పూర్తిచేసిన వెంటనే డబ్బులు వస్తాయి. దీంతో ఒంగోలుకు చెందిన కాంట్రాక్టర్లను కాదని, తెలంగాణలోని తమకు అనుకూలమైన వారికి టెండరు దక్కించేందుకు పాలకులు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్థానిక కాంట్రాక్టర్లలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. అప్పులతో చేసే పనులకు తమను ఉపయోగించుకుని, లాభాలు వచ్చే వాటికి నేరుగా అధికార పార్టీ నాయకులే బినామీలతో చేయడం ఎంతవరకు సబబు అని వాపోతున్నారు.

గుర్రుగా ఉన్న వైసీపీ కార్పొరేటర్లు

పేదలకు పట్టాల పంపిణీ కోసం ప్రతిపాదించిన భూముల అభివృద్ధి పనుల్లో తమకి ఎంతోకొంత న్యాయం జరుగుతుందని అధికార పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు ఆశించారు. తలా ఒక పని కేటాయిస్తారు. నిధులకు దిగుల్లేదు. ఒక్కొక్కరికి లక్షల్లోనే లాభాలు వస్తాయని సంతోషించారు. అయితే ఆపనులు ఇక్కడ ఎవరికీ కాకుండా పొరుగు రాష్ట్రానికి చెందిన కంపెనీకి కట్టబెట్టేలా పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకోవడంపై పలువురు గుర్రుగా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల విజయవంతం కోసం అన్నీ తామే భుజాన వేసుకుని చేస్తుంటే పేదల పట్టాల పనుల్లో తమకు తీవ్ర అన్యాయం చేశారని కొంత మంది కార్పొరేటర్లు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులను వివరణ కోరగా వారెవ్వరూ సమాధానం ఇవ్వలేదు.



బాలోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ప్రదర్శనలు అదుర్స్

ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న బాలోత్సవంలో రెండో రోజైన శనివారం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వారు అటు సృజనాత్మకత, ఇటు వివిధ కళల్లో ప్రతిభ చూపి అబ్బురపరిచారు. బ్రేక్ ఫ్రం వేస్ట్, మట్టితో బొమ్మలు చేయడం, జానపద నృత్యం, లఘునాటిక, దేశభక్తి గీతాలాపన, కోలాటం, వక్తృత్వ పోటీలు, పద్యభావం మొదలైన వాటిలో విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండు రోజులపాటు వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి ముగింపు సభలో అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.

- ఒంగోలు కల్చరల్

ఎన్నికల ప్రచారంలా ఆసరా చెక్కుల పంపిణీ



జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

కచ్చితంగా హాజరు కావాలని డ్వాక్రా సభ్యులపై ఒత్తిడి

లేకుంటే ఖాతాల్లో నగదు పడదని బెదిరింపు

నేతలు ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన మహిళలు

పీసీపల్లి, ఫిబ్రవరి 10 : పీసీపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీ వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలా సాగింది. ఏపీఎం సత్యానందం ఆధ్వర్యంలో 4వ విడత కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా మహిళలు భారీగా తరలిరావాలంటూ రెండు రోజులుగా వీవోఏల ద్వారా ఇంటింటికీ తిరిగి చెప్పించారు. అయినా పలుగ్రామాల్లోని మహిళలు ఆసక్తి చూపలేదు. దీంతో కార్యక్రమానికి రాని వారి ఖాతాల్లో ఆసరా నగదు జమకాదంటూ ప్రచారం చేయించారు. శనివారం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అధికారులతోపాటు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ, ఆపార్టీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం కొనసాగినంతసేపు వైసీపీ పార్టీని, ముఖ్యమంత్రిని పొగడ్తలతో ముంచెత్తారు. వారి మాటలు విని విసిగిపోయిన మహిళలు ఇది ప్రభుత్వ కార్యక్రమమా లేక పార్టీ కార్యక్రమమా అంటూ చర్చించుకున్నారు. కొంతమంది మహిళలు సభ పూర్తికాకముందే వెనుదిరిగి వెళ్లడం ప్రారంభించడంతో సీసీలు, వీవోఏలు బతిమలాడి వారిని కూర్చోబెట్టారు. కొందరు మాత్రం వెళ్లిపోయారు. వీవోఏలు ఒత్తిడి తెచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో మహిళలు రాకపోవడంతో టెంట్‌కింద వేసిన కుర్చీలు ఖాళీగా కనిపించాయి.

బుర్రా వర్గీయులు దూరం

కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే బుర్రాను తప్పించి దద్దాలకు బాధ్యతలు అప్పగించడంపై అసంతృప్తితో ఉన్న మధుసూదన్ వర్గీయులు పలువురు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరుకాలేదు. మురుగుమ్మి, అలవలపాడు, గుదేవారిపాలెం ఎంపీటీసీ సభ్యులతోపాటు మండల సచివాలయ కన్వీనర్, వ్యవసాయ సలహా సంఘం సభ్యులు, పలు గ్రామాలకు చెందిన మరికొంతమంది వైసీపీ నాయకులు గైర్హాజరయ్యారు. వైసీపీ మండల అధ్యక్షుడు వీరికి ఫోన్లు చేసి ఆహ్వానించినా వేరే పనులు ఉన్న కారణంగా కార్యక్రమానికి రాలేకపోతున్నామని చెప్పినట్లు తెలిసింది.

కనిగిరిలో డ్వాక్రా మహిళల అవస్థలు

కనిగిరి : ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం డ్వాక్రా మహిళలను అవస్థలకు గురి చేసింది. ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో శనివారం. ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గ్రూపుల సభ్యులు రావాల్సిందేనని మెప్మా, వైకేపీ అధికారులు హుకుం జారీ చేశారు. చేసేది లేక కనిగిరి మండలంలోని వివిధ గ్రామాల నుంచి, పట్టణంలోని 20 వార్డుల నుంచి మహిళలు హాజరయ్యారు. అయితే అధికారులు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవడంతో చంటి పిల్లలతో సహా వచ్చిన మహిళలు ఇబ్బందులు పడ్డారు. కాగా ప్రొటోకాల్ ప్రకారం కార్యక్రమంలో పాల్గొనాల్సిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ హాజరుకాలేదు. పార్టీ ఇన్‌చార్జిగా దద్దాల నియామకంతో అసంతృప్తిగా ఉన్న ఆయన ముఖం చాటేశారు.



కూర్చునే అవకాశం లేక చెట్ల కింద నిల్చున్న వృద్ధులు, మహిళలు



ఆర్థిక సంఘం నిధులపై ఆంక్షలు

● పంచాయతీల ఖాతాల్లో డబ్బులున్నా డ్రా చేసుకోలేని పరిస్థితి

● బిల్లులకు ట్రెజరీల్లో లభించని ఆమోదం

● పాలకవర్గాల్లో ఆందోళన

● రాష్ట్ర ప్రభుత్వ తీరుపై సర్పంచ్‌ల ఆగ్రహం

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 10 : గ్రామ పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధుల వినియోగంపైనా ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీంతో పాలకవర్గాలు పనులు చేయలేని దుస్థితి ఏర్పడింది. మందస్తుగా ఫిబ్రవరిలోనే ట్రెజరీల్లో బిల్లులపై ఫ్రీజింగ్ విధించడంతో ఈపరిస్థితి నెలకొంది. ఇప్పటికే అనేక గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు వివిధ రకాల అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాయి. ఈనేపథ్యంలో ఆర్థిక సంఘం నిధులపైనా ఆంక్షలు విధించడంపై సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత నెలలో రూ.38కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల

కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని గ్రామ పంచాయతీలకు గత నెలలో సుమారు రూ.38 కోట్లకుపైగా ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. వాటితో ఇప్పటి వరకూ జరిగిన పనులకు బిల్లులు మంజూరు చేయడంతోపాటు అత్యవసర పనులు చేపట్టే అవకాశం ఉంది. అయితే ఈఏడాది మార్చి ఆఖరుతో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆర్థిక సంవత్సరం ముగింపులో ప్రభుత్వం అన్ని రకాల బిల్లులపై ఆంక్షలు విధించడం సర్వసాధారణం. కానీ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుంచే ఉద్యోగుల జీతాల బిల్లులు మినహా ఇతర అన్నింటిపై ఆంక్షలు విధించింది. పంచాయతీ సమావేశంలో తీర్మానం చేసిన బిల్లులకు కూడా ట్రెజరీల్లో ఆమోదం లభించకపోవడంతో పాలకవర్గాల్లో ఆందోళన నెలకొంది.

అత్యవసర పనులూ చేయలేని పరిస్థితి

సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తుండటం, వేసవి తరుముకొస్తుండటంతో ఏదైనా అత్యవసర పనులు చేసుకొనేందుకు కూడా అవకాశం లేకుండాపోయిందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు సమాంతరంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి పాలకవర్గాలను నిర్వీర్యం చేసింది. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను కూడా లాగేసుకుంటోంది. దీన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు ఆందోళలు చేపట్టినా పట్టించుకోలేదు. ఇదే సమయంలో పంచాయతీలకు వచ్చిన నిధులను కూడా డ్రా చేసుకోకుండా ఆంక్షలు విధించడంపై పాలకవర్గాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రానున్న రోజుల్లో మరోసారి ఉద్యమించేందుకు సర్పంచ్‌లు సిద్ధమవుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అధికారులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 10: రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఒంగోలు ఆర్టీసీ డిపో ఆవరణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఐదు డిపోల పరిధిలోని సుమారు 30మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం డీపీటీవో సుధాకర్ మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మరోవ్యక్తి ప్రాణాలు నిలబెట్టవచ్చని చెప్పారు. ఉద్యోగులు, కార్మికులు మంచి మనసుతో రక్తదానం చేయడం అభినందనీయమని చెప్పారు. అనంతరం వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజరు శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ కుమారి, జీజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్య ఆరామక్షేత్రం ప్రారంభం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 10: ఒంగోలులోని గోరంట్ల మల్టీప్లెక్స్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆర్యవైశ్య ఆరామక్షేత్రాన్ని ఆదివారం ఉదయం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారని ఆరామక్షేత్ర కార్యవర్గ సభ్యులు తెలిపారు. శనివారం స్థానిక ఆరామక్షేత్ర ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆరామక్షేత్ర ప్రెసిడెంట్ మునగా వెంకటకృష్ణారావు మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన ఆరు నెలల్లో ఆరామక్షేత్ర నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. అన్ని వసతులతో పేద ఆర్యవైశ్యులకు అందుబాటులో ఉండేలా నిర్మించామని చెప్పారు. సమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, తడవర్తి వాసు, రామస్వామి, దేవతు వినోద్, తాతా మధు తదితరులు పాల్గొన్నారు.

క్విస్‌లో ముగిసిన ఫెస్ట్



వేడుకల్లో పాల్గొన్న అతిథులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 10 : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న అంతర్రాష్ట్ర స్థాయి టెక్నో-కల్చరల్ ఫెస్టివల్ క్విస్‌ఫెస్ట్-24 శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె. హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా ఇటువంటి ఫెస్ట్‌లలో ఉత్సాహంగా పాల్గొనాలని, జీవితాన్ని యాంత్రికంగా కాకుండా ఆనందంగా గడపాలని సూచించారు. చదువులోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ఎం. అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన కొన్ని ప్రాజెక్టులు సమాజాభివృద్ధికి తోడ్పడతాయన్నారు. క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ క్విస్ కళాశాల డీమ్ యూనివర్శిటీ స్థాయి అందుకునేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ ఫెస్ట్‌లో రాష్ట్రంలోని 68 కళాశాలలకు చెందిన విద్యార్థులు వివిధ విభాగాల్లో పాల్గొనగా ప్రతిభ చూపిన వారికి రూ.3.50 లక్షల విలువైన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గాయత్రి, ఇస్రో రిటైర్డ్ డైరెక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ వై.హనుమంతరావు, డి.దక్షిణామూర్తి, ఫెస్ట్ కన్వీనర్ ఎల్.భారతి పాల్గొన్నారు. కాగా సూర్యకళ్యాణచక్రవర్తి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అతిథులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

భారతరత్న అవార్డుల ప్రకటనపై హర్షం



నివాళులర్పిస్తున్న రైతు సంఘాల నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 10 : దేశానికి, వ్యవసాయరంగానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, వివిధ రంగాలకు చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం మాజీ ప్రధానులు చరణ్‌సింగ్, పీవీ.నరసింహారావు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్‌లకు భారతరత్న అవార్డులను ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని రంగాభవన్‌లో భారతరత్న అవార్డు గ్రహీతల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కిసాన్ సంస్థ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చుండూరి రంగారావు, చుంచు శేషయ్య, ఎంసీ.వెంకటేశ్వర్లు, నాగినేని అవనీంద్రప్రసాద్, దూళిపాళ్ళ వీరనారాయణ, నాదెండ్ల చంద్రశేఖరరావు, ఎం.కోటేశ్వరరావు, మండవ శ్రీనివాసరావు, నన్నూరి నాగేశ్వరరావు, మోపర్తి సాంబశివరావు, కాట్రగడ్డ వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు తహసీల్దార్‌గా సుజన్‌కుమార్



బాధ్యతలు చేపడుతున్న సుజన్‌కుమార్

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 10: ఒంగోలు మండల తహసీల్దార్‌గా సుజన్‌కుమార్ శనివారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుజన్‌కుమార్‌ను కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు కలిసి బొకేలు అందజేసి అభినందించారు.

అలరించిన హాస్యవల్లరి



నాటికను ప్రదర్శిస్తున్న గాయనీమణులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 10: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో మహిళలు ప్రదర్శించిన దొంగను మించిన దొంగ హాస్యవల్లరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. నగరంలో పేరొందిన గాయనీమణులు తొలిసారిగా నాటికను ప్రదర్శించి మెప్పించారు. యశోద, తాళ్లూరి శ్రీదేవి, షేక్ సిద్దాంబి, శిరీష, సర్వేపల్లి ఇంద్రజ్యోతి, డి.ఉషారాణిలు ఎంతో హుషారుగా డైలాగులు చెబుతూ ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. అంతకుముందు సంఘ అధ్యక్షుడు బేతంశెట్టి హరిబాబు అధ్యక్షతన జరిగిన సభకు ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, సిద్ధాంతి గొట్టిముక్కల శివప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొని రంగభూమి సంఘ కార్యవర్గాన్ని అభినందించారు. ఇకదడిగే రామయ్య ప్రదర్శించిన హరిశ్చంద్ర కాటిసీను, ఆలిండియా కళారంగం గాయకుల సినీ సంగీత విభావరిలు సైతం అలరించాయి. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాదు, కోశాధికారి దేనువకొండ వెంకటసుబ్బయ్య, అనంతలక్ష్మి, జాలాది మోహన్, మాకా ఆంజనేయులు, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పొలాల్లో సోలార్ ప్లేట్లు చోరీ

టంగుటూరు, ఫిబ్రవరి 10 : కందులూరు పొలాల్లోని సోలార్ ప్లేట్లు శనివారం చోరీకి గురయ్యాయి. దీంతో బాధిత రైతు శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగేశ్వరరావు పరిశీలించారు. ప్రస్తుతం మిరప వేసిఉన్న పొలంలోని సోలార్ ప్లేట్లు చోరీ అయినట్లు నిర్ధారించుకుని కేసు నమోదు చేశారు.

ఆదమరిస్తే అంతే..!

మేయర్ ఇంటికెళ్లే దారిలో దెబ్బతిన్న కల్వర్టు

తరచూ ప్రమాదాలు

"వైసీపీ పాలనలో ఒంగోలు నగరంలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతోంది. రూ.కోట్లతో రోడ్లు, కాలువలు, ఇతర పనులు చేపట్టాం" అంటూ పదేపదే నగర మేయర్ గంగాడ సుజాత చెబుతుంటారు. అయితే ఆమె ఇంటి పరిసరాల్లో ప్రమాదకరంగా మారిన పెద్ద కల్వర్టు మాత్రం కనిపించలేదా లేదా అని స్థానికులు మండిపడుతున్నారు. స్థానిక సంతపేటలోని మేయర్ నివాసానికి వెళ్ళేమార్గంలో సైడు కాలువ మీద కల్వర్టు పాడైపోయి కొన్నేళ్ళు అయింది. దీంతో ఈ మార్గంలో రాత్రి వేళల్లో వాహన ప్రమాదాలు సర్వసాధారణం అయ్యాయి. అలాగే వీధుల్లో సంచరించే పశువులు, ద్విచక్రవాహనాలు కల్వర్టు గోతిలో పడుతున్నాయి. ఈక్రమంలో శనివారం ఏకంగా ఓ కారు అందులో ఇరుక్కుపోయింది. దీంతో దానిని తీసేందుకు యజమానులు నానా తంటాలు పడ్డారు. ఇప్పటికైనా మేయర్ నగర అభివృద్ధిపై గొప్పలు పోవడం కన్నా, తన నివాస పరిధిలో ఉన్న మెయిన్ డ్రైన్ కల్వర్టు సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

- ఒంగోలు (కార్పొరేషన్)



డ్రైనేజీ కాలువపైనున్న కల్వర్టుకు రంధ్రం పడడంతో ఇరుక్కుపోయిన కారు



పగిలిపోయిన ఉన్న కల్వర్టు (ఇన్‌సెట్లో)

ఆపరేటర్లతో బియ్యం పంపిణీ రాజ్యాంగ విరుద్ధం

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లీలామాధవరావు ధ్వజం • వైసీపీ ప్రభుత్వ విధానాలపై మండిపాటు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 10 : రాజ్యాంగానికి విరుద్ధంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా డీలర్లు పంపిణీ చేయాల్సిన రేషన్ సరుకులకు ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పంపిణీ చేయిస్తుందని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు ఆరోపించారు. ఒంగోలులోని ఆర్యవైశ్య భవన్‌లో శనివారం జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో డీలర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రేషన్ డీలర్ల వ్యవస్థకు సమాంతరంగా ఎండీయూ వ్యవస్థను ఏర్పాటు చేసి వారి ద్వారా రేషన్ పంపిణీ చేయించడం దుర్మార్గంగా ఉందన్నారు. డీలర్లకు తెలంగాణలో ఉన్న విధానంగా రాష్ట్రంలోని డీలర్లందరికి గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతంలో రూ.7500, పట్టణ ప్రాంతాల్లో రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు క్వింటా బియ్యానికి రూ.150 కమీషన్ ఇవ్వాలన్నారు. గత టీడీపీ పాలనలో కల్పించిన విధంగా డీలర్లకు బీమా సౌకర్యం, హెల్త్ కార్డులు, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడంతో పాటు చనిపోయిన డీలర్లకు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

మట్టిఖర్చుల కింద రూ.15వేలు ఇవ్వాలన్నారు. జీవో నెంబరు 20 ప్రకారం డీలర్లను బ్యాంకు కరస్పాండెంట్‌గా నియమించి సామాజిక పెన్షన్లను డీలర్ల ద్వారా పంపిణీ చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పొదిలి రత్నం, చింపిరయ్య, వెంగళరెడ్డి, బాషా, దర్శి సుబ్బారావు, రాజమోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

జిల్లా నూతన కార్యవర్గాన్ని సమావేశం అనంతరం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మోదుకూరి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉడుముల వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.రాజమోహనరెడ్డి, ప్రధానకార్యదర్శిగా కొత్త సుమన్, కార్యదర్శులుగా వెంకటాద్రి, ఖాజా మొహిద్దీన్, జాయింట్ సెక్రటరీగా సీహెచ్.మల్లికార్జునరావు, కోశాధికారిగా సోమిశెట్టి శ్రీనివాసులును ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు.

నేటి 'జయహో బీసీ' సభను జయప్రదం చేయండి

టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణస్వామి

కొండపి, ఫిబ్రవరి10: కొండపి ఆర్టీసీ బస్టాండ్ వద్ద దివంగత ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాల సెంటర్‌లో ఆదివారం సాయంత్రం టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో జరిగే 'జయహో బీసీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆపార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బత్తుల నారాయణస్వామి విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం ఆయన నాయకులతో కలిసి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల సంక్షేమం కోసం టీడీపీ అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాబోయే రోజుల్లో కూడా బీసీ రక్షణకు చట్టం చేయనున్న నేపథ్యంలో బీసీల చైతన్యం కోసం జరిగే జయహో బీసీ సభను మండలంలోని బీసీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం సాయంత్రం 5గంటలకు కొండపిలోని మండల కార్యాలయాల నుంచి ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యతోపాటు పార్టీ మండల నాయకులు పాల్గొంటారన్నారు. సమావేశంలో పార్టీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడు, నాయకులు చాగంరెడ్డి నరసారెడ్డి, గుండపనేని రామ్మూర్తినాయుడు, బూదవాటి సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య బీసీసెల్ మండల అధ్యక్షుడు మార్బూరి వెంకటేశ్వరరావు, తెలుగు యువత ఒంగోలు పార్లమెంటు కార్యదర్శి దేపూరి మస్తాన్, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ ఖాజాషా, బీసీసెల్ నాయకులు బండ్ల శ్రీనివాసరావు, బాలచెన్నయ్య, రాజారపు బ్రహ్మానందం, ఆముదాలపల్లి గంగాధర్, దేపూరి సుబ్బారావు, ఇజ్జిగిరి కాశయ్య, మునగాల జాన్, రమేష్, దేవరాల బ్రహ్మయ్య, గుగ్గిళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గ్రామ సచివాలయాలు అభివృద్ధికి ప్రతీకలు

• మంత్రి నాగార్జున

చీమకుర్తి, ఫిబ్రవరి 10: గ్రామ సచివాలయాలు అభివృద్ధికి ప్రతీకలని మంత్రి మేరుగ నాగార్జున, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. చీమకుర్తి మండల పరిధిలోని తొర్రగుడిపాడు, పి.నాయుడుపాలెం, బండ్లమూడి, పల్లామల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రి నాగార్జున, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావుల చేతుల మీదుగా భవనాలను ప్రారంభించారు. తదుపరి జరిగిన సభల్లో వారు ప్రసంగించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయాలు మార్గం చూపుతున్నాయన్నారు. సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ సందర్భంగా సభలకు హాజరైనవారు మంత్రి దృష్టికి పలు సమస్యలను పరిష్కరించాలని వినతులు అందజేశారు. మొగిలిగుండాల రిజర్వాయర్‌కు మోక్షం కల్పించాలని, శ్మశాన సమస్య, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని పల్లామల్లిలో కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ యద్దనపూడి అంజని, వైసీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, శేషిరెడ్డి, రామసాని సూర్యచంద్రరావు, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ప్రొటోకాల్ పాటించలేదు : సర్పంచ్

తొర్రగుడిపాడు సచివాలయ భవనాల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించకపోవటం ద్వారా తనని అవమానానికి గురి చేశారని యర్రగుడిపాడు సర్పంచ్ రామిశెట్టి హేమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొర్రగుడిపాడు గ్రామ సచివాలయ పరిధిలో తొర్రగుడిపాడు, ఎర్రగుడిపాడు రెండు పంచాయతీలుండగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందలేదన్నారు. నిబంధనల మేరకు శిలాఫలకంపై ఎర్రగుడిపాడు సర్పంచ్‌నైన తన పేరు పేర్కొనకపోవటం తనను తీవ్రంగా అవమానించటంగా భావిస్తున్నానన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదునిచ్చి, ప్రజాపోరాటం చేస్తానని ప్రకటనలో తెలిపారు.

పెట్లూరు- ధర్మవరం రోడ్డును బాగుచేయాలి

• జనసేన పార్టీ నాయకుల డిమాండ్

• రోడ్డుపై బైటాయించి నిరసన

కొండపి, ఫిబ్రవరి 10: పెట్లూరు నుంచి ధర్మవరం వరకు అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం రోడ్డుపై కూర్చుని జనసేన కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని వారు విమర్శించారు. గోతుల రోడ్లు కారణంగా వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన అన్నారు. వెంటనే ఆర్అండ్‌బీ అధికారులు గోతులు పూడ్చి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

నడిరోడ్డులోని గోతిని పూడ్చండి..

పొన్నలూరులో నడిరోడ్డులో ఏర్పడ్డ గోతిని వెంటనే పూడ్చాలని పొన్నలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి హరినారాయణకి జనసేన నాయకుడు మనోజ్‌కుమార్ శనివారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన కార్యదర్శి పది రోజుల్లో గోతిని పూడ్చిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమాల్లో జనసేన నాయకులు రాజారపు గోపికృష్ణ, పంబా వీరబ్రహ్మయ్య, మూరబోయిన మాధవ, పోకూరి శివరామయ్య, కట్టా రాము, కిషోర్, మహేష్, హరికృష్ణ, హనుమంతరావు, కోటేశ్వరరావు, శంకర్, సాయికృష్ణ, అంబేడ్కర్, సురేష్ పాల్గొన్నారు.



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తహసీల్దార్ మురళికి సత్కారం

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి10: ఒంగోలు మండల తహసీల్దార్ పి.మురళి వీడ్కోలు కార్యక్రమంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయనను బదిలీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీలు అజైకుమార్‌రెడ్డి, ఫిరోజ్, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, సర్వేయర్ బాలవెంకటరెడ్డి, వీఆర్వోలు వెన్నపూస శ్రీనివాసరెడ్డి, అంకిరెడ్డి, ఎం.సురష్‌బాబు, పి.కృష్ణారావు, యజ్ఞాని, శ్రీనివాసమూర్తి, జగదీష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు



మురళిని సన్మానిస్తున్న ఉద్యోగులు, వీఆర్వోలు

అవీ..ఇవీ..

నేడు పెదకొత్తపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న జయంత్‌బాబు

మద్దిపాడు, ఫిబ్రవరి 10: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం పెద కొత్తపల్లిలో నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు తెలిపారు. శనివారం మద్దిపాడులో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, స్వామి, మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, దామచర్ల సత్య, మండవ రంగారావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పెదకొత్తపల్లి టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలియజేశారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

మద్దిపాడు, ఫిబ్రవరి 10: బైక్ ఢీకొని యువకుడికి గాయాలైన సంఘటన శనివారం గుండ్లాపల్లి పరిశ్రమం కేంద్రం వద్ద జరిగింది. స్థానికుల సమాచారం మేరకు, మద్దిపాడు వైపు నుంచి మేదరమెట్ల వెళ్లే మోటారుసైకిల్ కారును అధిగమించబోయి అదుపుతప్పింది. ఈక్రమంలో రోడ్డు దాటుతున్న గ్రానైట్ కార్మికుడు రంజిత్ సింగ్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

జనసేన పాదయాత్రను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

మద్దిపాడు, ఫిబ్రవరి 10: జనసేన పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు కందుకూరి వెంకటేశ్వర్లు (బాబు), మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు మండల కమిటీ తెలిపింది. శనివారం మద్దిపాడులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం లింగంగుంట గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఉదయమం 8గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పాదయాత్ర లింగంగుంట నుంచి మారెళ్లగుంటపాలెం, నర్సాయపాలెం, అంజయ్యనగర్, పెదకొత్తపల్లి, కొష్టాలు, మద్దిపాడు, వెల్లంపల్లి, కొలచనకోట, మల్లవరం, గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు.

20లోపు ఫీజు చెల్లించాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 10: జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 20వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి ఉత్తీర్ణులైన వారు డ్రాయింగ్, టైలరింగ్, హ్యాండ్‌లూమ్ లోయర్ గ్రేడ్ పరీక్షలకు అర్హులు, లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణులైన వారు హయ్యర్ గ్రేడ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అర్హులు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్‌కు రూ.100, హయ్యర్ గ్రేడ్‌కు రూ.150, హ్యాండ్‌లూమ్, వీవింగ్ లోయర్‌కు రూ.150, హయ్యర్‌కు రూ.200, టైలరింగ్ ఎంబ్రాయిడరీ లోయర్‌కు రూ.150, హయ్యర్‌కు రూ.200 పరీక్షల ఫీజు చెల్లించాలి. రూ.50 రుసుంతో ఈ నెల 29 వరకు, రూ.75 రుసుంతో మార్చి 6వతేదీ వరకు చెల్లించవచ్చు. మార్చి 7న నామినల్ రూల్స్‌ను డీఈవో కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాల కోసం ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 10: ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 9,11 తేదీల్లో ఖాళీ సీట్లు, భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు నిర్వహించారు. డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలు, రామనగర్ మునిసిపిపల్ హైస్కూలు, పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతికి, స్థానిక నవోదయలో 11వ తరగతికి పరీక్ష జరిగింది. 9వ తరగతికి 727 మంది దరఖాస్తు చేయగా 498 మంది, 11వ తరగతికి 604 మంది దరఖాస్తు చేయగా 409 మంది హాజరయ్యారని నవోదయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు.

పేస్‌లో వర్మికంపోస్టుపై అవగాహన

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 10 : ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ స్పెషల్ క్యాంపులో భాగంగా శనివారం విద్యార్థులు, యువతకు వర్మికంపోస్టుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కారుమంచి, మల్లవరప్పాడుకు చెందిన యువత, విద్యార్థులు పేస్ ఇంజనీరింగ్ కళాశాలలోని వర్మికంపోస్టు ప్లాంట్‌ను సందర్శించారు ఈ సందర్భంగా కళాశాల సివిల్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు రామప్రసాద్‌రెడ్డి వర్మికంపోస్టు తయారీ విధానాన్ని, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, ఏవో రమణబాబు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ డిగ్రీ ఫలితాలు విడుదల

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 10 : ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డిగ్రీ మూడవ సెమిస్టర్ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఎం, బీఏహెచ్ఎల్, బీహెచ్ఎం పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఫలితాలను యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య రాజశేఖర్ విడుదల చేసి వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈనెల 26 లోపు రీ వాల్యువేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి తెలిపారు. ఒక్కొక్క సబ్జెక్టు జవాబుపత్రం రివాల్యువేషన్‌కు రూ.1240, పర్సనల్ వెరిఫికేషన్ జవాబుపత్రం కోసం రూ.1700 ఫీజు చెల్లించాలని సూచించారు.

రైళ్లలో పటిష్టమైన భద్రత : డీఎస్పీ

ఒంగోలు(క్రైం) ఫిబ్రవరి10: రైళ్లలో ప్రయాణికులకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తామని నెల్లూరు రైల్వే డీఎస్పీ విజయభాస్కర్ తెలిపారు. సాధారణ తనిఖీలలో భాగంగా శనివారం ఒంగోలు రైల్వే పోలీస్‌స్టేషన్‌ను ఆయ పరిశీలించారు. అనంతరం రైల్వే పోలీసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల సందర్భంగా ముమ్మర తనిఖీలు చేపట్టి నగదు, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఇచ్చే బహుమతులను స్వాధీనం చేసుకోవాలన్నారు. సమావేశంలో రైల్వే సీఐ ఎస్.శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ సీహెచ్.మాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో చోరీ

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి10: ఒంగోలు నగరం ఇందిరమ్మకాలనీలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.2లక్షల విలువైన సొత్తును అపహరించుకెళ్లారు. వివరాలలోకి వెళితే.. ఎం.బీమాబాయి ఇందిరమ్మకాలనీ మూడో లైన్‌లో నివాసం ఉంటున్నారు. ఆమె ఇంటికి తాళం వేసి గత నెల 26న దర్శిలోని త కుమార్తె ఇంటికి వెళ్లారు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగలకొట్టి ఉండటంతో పాటు బీరువా పెకలించి ఉంది. బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు, 50 గ్రాముల బంగారం ఆభరణాలు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై పున్నారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద యువతి వివాహానికి ఆర్థికసాయం

ఒంగోలు (కల్చరల్),ఫిబ్రవరి 10: నగరానికి చెందిన సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ షహనాజ్ మరాఠీపాలెంకు చెందిన నిరుపేద షేక్ షామీనా కుమార్తె నోహిరా వివాహం కోసం శనివారం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నోహిరా తండ్రి అనారోగ్యంతో చనిపోయాడని, తల్లి సంపాదనమీదే కుటుంబం ఆధారపడిందని ఆయన చెప్పారు. ప్రవాస భారతీయుడు తాటిమళ్ల నాగ ఉదయ్‌కిరణ్ సహకారంతో ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, జనసేవ శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు ఎస్ఐగా దేవకుమార్

సంతనూతలపాడు, ఫిబ్రవరి 10: సంతనూతలపాడు ఎస్ఐగా ఎమ్.దేవకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా ఆయన కురిచేడు నుంచి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ అంజనేయులు ఒంగోలు ఎస్పీ ఆఫీసుకు బదిలీ అయ్యారు.

నేటి నుంచి విగ్రహా ప్రతిష్టా మహోత్సవాలు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 10: సంతనూతలపాడులో ఆదివారం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత, చెన్నకేశవస్వామి ఆలయ శిఖర కలశ, కళ్యాణమండప కలశ, శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ మహోత్సవం, శ్రీ శీతాలాంబ(బొడ్డురాయి), గవిడిరాయి ప్రతిష్టా మహోత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇంట్లో అలిగి వచ్చిన
ఇద్దరు బిహార్ బాలికలు

ఒంగోలు రైల్వే స్టేషన్‌లో గుర్తించిన పోలీసులు

కుటుంబ సభ్యులకు సమాచారం ● బాలసదన్‌కు తరలింపు

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి, 10 : ఇంట్లో తల్లిదండ్రులపై అలిగి వచ్చిన ఇద్దరు బిహార్ బాలికలను ఒంగోలు రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు గుర్తించారు. వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. బిహార్ రాష్ట్రం ఆటారి జిల్లాలోని ఖరారి గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్‌లు (16ఏళ్లు) ఇంట్లో అలిగి ఈనెల 7వతేదీన బయటకు వచ్చారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాన్సీ వెళ్లారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. శనివారం ఒంగోలు రైల్వే స్టేషన్‌లో దిగారు. ఈక్రమంలో అనుమానాస్పదంగా ఉన్న వారిని రైల్వే సీఐ ఎస్.శ్రీకాంత్‌బాబు అదుపులోకి తీసుకొని రైల్వే డీఎస్పీ సి.విజయ భాస్కర్ సమక్షంలో విచారించగా అసలు విషయం చెప్పారు. దీంతో వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇద్దరు బాలికలను ఒంగోలులోని బాలసదన్‌కు తరలించారు. తల్లిదండ్రులు వచ్చిన తరువాత వారికి బాలికలను అప్పగిస్తామని సీఐ శ్రీకాంత్ తెలిపారు.

హోమియోతో దీర్ఘకాలిక వ్యాధులు నయం



మాట్లాడుతున్న రామ్‌ప్రసాద్‌జోషి

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 10: అనేక దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో వైద్యం అద్భుతంగా పనిచేస్తుందని బెంగళూరుకు చెందిన ప్రముఖ హోమియో వైద్యులు రామ్‌ప్రసాద్ జోషి పేర్కొన్నారు. శనివారం స్థానిక కేశవస్వామిపేట శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థాన కళ్యాణమండపంలో ఉచిత హోమియో వైద్య శిబిరం, అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లోపతి వైద్యంలో కొన్ని మందుల వల్ల దుష్ప్రభావాలు కలిగే అవకాశం ఉందని, అయితే హోమియో వైద్యంలో అటువంటి అవకాశం లేదన్నారు. ఒంగోలుకు చెందిన హోమియో వైద్యులు డాక్టర్ వినయ్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ పాగోలు మురళి మాట్లాడుతూ కరోనా వైరస్‌కు సైతం హోమియోలో అద్భుతమైన మందులు ఉన్నాయని, ప్రజలలో హోమియో వైద్యం పట్ల పెద్దఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి హోమియో మందులను పంపిణీ చేశారు.

పాకల గ్రామ సచివాలయం ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్, నాయకులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 10 : మండలంలోని పాకల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఒకటవ గ్రామ సచివాలయాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పాలనలో నూతన ఒరవడిని తీసుకొచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. సాయంత్రం పోతయ్యగారిపాలెం, కాంతినగర్, శాంతినగర్, చెల్లమ్మగారిపాలెం, ఎస్సీ కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర వైద్యవిభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నేతలు సామంతుల రవికుమార్‌రెడ్డి, యన్నాబత్తిన చిన్నా, గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, బల్లెల ప్రభాకర్‌రెడ్డి, కేశవరపు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆనందమే ప్రగతికి మార్గం

మాజీ ఎమ్మెల్సీ విఠపు ● ముగిసిన బాలోత్సవం



సభలో ప్రసంగిస్తున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 10: పిల్లలు ఆనందంగా ఉన్నప్పుడే వారు మంచి పౌరులుగా తయారవుతారని, తద్వారా వారు దేశ ప్రగతికి తోడ్పడతారని శాసన మండలి మాజీ సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రెండు రోజులుగా ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న ప్రకాశం బాలోత్సవం ముగింపు సభ శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి అద్భుతంగా బాలోత్సవ్‌ను నిర్వహించిన కమిటీని అభినందించారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని అణచివేయాలని చూడకూడదని మంగమ్మ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఏవీ.పుల్లారావు అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల గ్రేడ్‌లపైనే కాకుండా వారిలోని ప్రతిభపై కూడా దృష్టిపెట్టి వారిని ప్రోత్సహించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త కోదండపాణి చెప్పారు. పీవీఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక మాట్లాడుతూ బాలోత్సవాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను పెద్దసంఖ్యలో భాగస్వాములను చేయాలని కోరారు. అనంతరం పలు పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కె.సుబ్రహ్మణ్యం, ఒ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు, యు.భాస్కర్, బి.తిరుపతయ్య, అబ్దుల్ హై, కె.నరసింహారావు, దామా శ్రీనివాసులు, జి.ఉమామహేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బాలోత్సవం ముగింపు సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

జగన్‌రెడ్డి పాలనలో
జనం అతలాకుతలం



కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి10: జగన్‌రెడ్డి అసమర్థ పరిపాలనలో ప్రజలు పలు సమస్యలతో అతలాకుతలమయ్యారని జనసేన పార్టీ నాయకులు విమర్శించారు. శనివారం ఒంగోలు నగరం రామ్‌నగర్‌లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన స్తంభించి పోయిందని, ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జనసేన సంకీర్ణ కూటమిని గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు మర్రిపూడి ఉదయ్, ఉంగరాల సాయి, మహ్మద్ హనీఫ్, కళ్యాణ్ ముత్యాల, పల్ల ప్రమీల, ఉష, ఉంగరాల వాసు, ఉష, నరేష్ చెన్ను, అనూష, మాధవి పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 10: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధి ఊళ్లపాలెం రోడ్డులో సర్వే నెం.404-1 అనాధికారికంగా వేసిన అక్రమ లేఅవుట్‌లో శనివారం పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. లేఅవుట్ ఏర్పాటుకు ఎటువంటి అనుమతులు లేవని, ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వబోమని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మీరు చేసే తప్పులకు నేనా బాధ్యుడిని..?

డ్వాక్రా రుణాలపై సమగ్ర విచారణ కోరతా..

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎమ్మెల్యే బాలినేని అసహనం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 10 : "ప్రతి వారు నన్ను రోడ్డుమీదకు లాగుతున్నారు. ఏంటీ గోల. మీరు తప్పులు చేస్తే నేను బాధ్యుడినా. నేనే విచారణ చేయమని చెప్తా. వాస్తవాలు వెలుగులోకి వస్తాయి." అని డ్వాక్రా రుణ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఒంగోలులోని మెప్మాలో అధికార పార్టీకి చెందిన కొంతమంది బినామీ పేర్లతో పెద్ద ఎత్తున రుణాలు తీసుకోవడం జిల్లా వ్యాప్తంగా దుమారం రేగింది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి నగరానికి వచ్చిన ఎమ్మెల్యే బాలినేనిని కలిసేందుకు అర్జీలను తీసుకొని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వచ్చారు. బాలినేని వద్ద వారు ఏదో ప్రస్తావించబోగా మండిపడినట్లు సమాచారం. ప్రతి విషయంలో తనను బయటకు లాగుతున్నారని, మీరు చేసే తప్పులకు నేనా బాధ్యుడిని అని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. విచారణ చేస్తే అన్నీ బయటకు వస్తాయి అని అనడంతో ఒక్కసారిగా వారి ముఖాలు మాడిపోయాయి. తాను స్వయంగా సమగ్ర విచారణ చేయాలని జిల్లా అధికారులను కోరతానని చెప్పినట్లు సమాచారం. తాను ఎవరికీ ఏ హానీ తలపెట్టకపోవడం వల్లే తనకు ఈ పరిస్థితి వచ్చిందని బాలినేని అన్నట్లు తెలిసింది. ఈ సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒకరు అక్కడి నుంచి అలిగి వెళ్ళిపోయినట్లు సమాచారం. దీంతో బాలినేని.. మీరు చేసిన తప్పులను పార్టీ మీద రుద్దడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రుణాల విషయంలో ఏమి జరిగిందో తనకు తెలియదని, విచారణ కోరతానని, అప్పుడు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వ్యాఖ్యానించినట్లు తెలుస్తున్నది. ఈ సమయంలో మేయర్ గంగాడ సుజాతపై ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళ దౌర్జన్యం చేసేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉన్న మహిళలు నీవు చేసే తప్పులకు ఒకరిమీదపడి ఏడవటం ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది.

ఎన్నికల సిబ్బందిని త్వరగా నియమించాలి

● ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 10 : ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రత్యేక ఫ్లయింగ్, స్టాటిస్టిక్, ఇతర బృందాలను త్వరగా నియమించి ఈనెలాఖరులోపు వారికి అవసరమైన శిక్షణను పూర్తి చేయాలని ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల నిర్వహణ కోసం చేట్టాల్సిన ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. గత నెలలో ప్రచురించిన ఓటర్ల తుది జాబితా అనంతరం వచ్చిన క్లెయిమ్స్‌ను త్వరగా పరిష్కరించాలన్నారు. ఓట్ల తొలగింపుల కోసం వచ్చిన దరఖాస్తుల మొత్తం ఓట్లలో 0.1 శాతం కంటే ఎక్కువగా ఉంటే తమ అనుమతి తీసుకోవాలన్నారు. క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలను తక్షణమే గుర్తించాలన్నారు లాజిస్టిక్, కమ్యూనికేషన్ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో లేని పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని ఏపీ ఫైబర్ నెట్ నుంచి కనెక్షన్ ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వైపాలెం నియోజకవర్గంలోని పాలుట్ల, చెంచుకాలనీలకు బస్సు వెళ్లే అవకాశం లేనందున కమాండర్ జీపుల్లో పోలింగ్ సామగ్రిని తరలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో ఆర్.శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

సింగరాయకొండ, ఫిబ్రవరి 10 : సింగరాయకొండ నూతన తహసీల్దార్‌గా మద్దిపాడు నుంచి బదిలీపై వచ్చిన భవానీశంకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, డీటీ వెంకటేశ్వరరావు, ఆర్ఐ ప్రవీణ్, సిబ్బంది, పలు గ్రామాల వీఆర్వోలు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.





నేడే అనంతవరం గ్రామ సచివాలయ భవనం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన సచివాలయ భవనం

అనంతవరం(టంగుటూరు) ఫిబ్రవరి 10 : మండలంలోని అనంతవరంలో ఆదివారం నూతన ఇంటిగ్రేటెడ్ సచివాలయ భవనం ప్రారంభోత్సవ జరగనుంది. ఉదయం 11గంటలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ భవనాన్ని ప్రారంభిస్తారు. గ్రామ సచివాలయం భవనం ముఖ ద్వారం వద్దనే ఒకవైపు డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, రెండవ వైపు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలు ప్రతిష్ఠిస్తారు. అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి కావలసిన రూ1.10లక్షల నిధులను స్థానికుడు డాక్టర్ కసుకుర్తి అనిల్‌కుమార్ అందించారు. ఈ రెండు విగ్రహాలు కూడా ఆదివారం నాడే ప్రారంభిస్తారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. ఇందుకు కావలసిన ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తయ్యాయి. అనంతవరం గ్రామ సచివాలయం పరిధిలో వెలగపూడి పంచాయతీ కూడా అంతర్భాగమే. అనంతవరం పంచాయతీలోని తేటుపురం, తాళ్లపాలెం, పసుకుదురు, కేసుపాలెం గ్రామాలతోపాటుగా పక్కనే ఉన్న వెలగపూడి పంచాయతీని కూడా ఇందులోనే కలిపారు. సచివాలయ నిర్మాణానికి రూ1.06కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో గ్రామ సచివాలయ భవనంతో పాటుగా రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, బల్క్‌మిల్క్ సెంటర్‌లు ఉన్నాయి. భవన నిర్మాణ బాధ్యతలను ప్రముఖ వ్యాపారవేత్త అల్లూరి వెంకటసత్యనారాయణరాజు, సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు, స్థానిక వైసీపీ నాయకులు ఉప్పలపాటి నాగరాజు, ఉప్పలపాటి సుబ్బరాజు నిర్వర్తించారు. భవన ప్రారంభోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఏవీఎస్ రాజు, శివరామరాజు కోరారు.

దళిత ద్రోహులు వైసీపీ మాదిగ నాయకులు

టంగుటూరు, ఫిబ్రవరి 10 : దళిత ఉద్ధరణకు రాజ్యాంగం కల్పించిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని భుజానకెత్తుకొని మోస్తున్న మాదిగ నాయకులంతా దళిత ద్రోహులేనని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బక్కా తిరుమలరావు మాదిగ శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణకు మద్దతుగా నిలబడితే మాటమాత్రం కూడా మాట్లాడకుండా దాక్కున్న ఈప్రభుత్వానికి ఎలా మద్దతుగా నిలుస్తున్నారని మాదిగ నాయకులను ఆయన నిలదీశారు. ప్రభుత్వంలో కీలకంగా ఉండి వివిధ స్థాయిలో ఉన్న మాదిగ సామాజిక వర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు వర్గీకరణపై ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. నిజమైన వర్గీకరణ మద్దతుదారులంతా సుప్రీంకోర్టులో జరుగుతున్న వాదనల్లో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.

సమ్మెను జయప్రదం చేయాలి

కొండపి, ఫిబ్రవరి10: ఈనెల 16న జరుగనున్న గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను రైతు, కూలీ, కార్మిక సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని గోగినేనివారిపాలెం, చోడవరం, ముప్పవరం గ్రామాల్లో సమ్మె విజయవంతం కోరుతూ సంఘాల నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేజీ మస్తాన్, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మి, సీఐటీయూ మండల కార్యదర్శి జి.వందనం, నాయకుడు శివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరాహ లక్ష్మీనరసింహ స్వామి ధర్మప్రచార వారోత్సవాలు

సింగరాయకొండ, ఫిబ్రవరి 10 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తరుపున వారం రోజులపాటు నిర్వహించనున్న ధర్మప్రచార వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మంత్రి సురేష్ దేవస్థానంలో ప్రచార రథానికి జెండా ఊపి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం పాకల గ్రామంలో శోభాయాత్రను నిర్వహించారు. రాత్రికి శ్రీరామలింగేశ్వర ఆలయం ఎదుట శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహస్వామికి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణమహోత్సవాన్ని తిలకించారు. అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో పి. కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, సుదర్శనాచార్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు కీర్తిపతాక పీవీ

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 10: తెలుగువారి కీర్తిని, ప్రావీణ్యాన్ని దేశవిదేశాలకు చాటిచెప్పిన రాజకీయ దురంధరుడు మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు అని బ్రాహ్మణ సేవా సంక్షేమ ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. పీవీ.నరసింహారావుకు కేంద్రం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో శనివారం ఒంగోలు నగరం గాంధీనగర్‌లోని సీతారామలింగేశ్వర స్వామి దేవాలయంలో పీవీకి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ రామరాజు మల్లికార్జునశర్మ, శివదేవుని మురళీధర్, సూరపరాజు రాము, పేర్నమిట్ట నరసింహారావు, సంగుబొట్ల వేంకటమల్లికార్జునప్రసాద్, పోగుల దుర్గాప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీచక్ర నవావరణ

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 10: ఆర్యవైశ్యుల కులదేవత శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా స్థానిక అమలనాదునివీధి శ్రీవాసవి అమ్మవారి దేవస్థానంలో శనివారం శ్రీచక్ర నవావరణ అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ తదియారాధన సంఘం ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి క్షీరాభిషేకం, సువాసినీ పూజ, మహిళచే చండి పారాయణ, శ్రీవాసవి కోలాట భజన మండలి ఆధ్వర్యంలో కోలాటం, గుడి ఉత్సవం మొదలైన కార్యక్రమాలు శోభాయమానంగా జరిగాయి. కాగా నగరానికి చెందిన ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి : టీడీపీ

సంతనూతలపాడు, ఫిబ్రవరి 10: శంఖారావం పేరుతో మరికొద్దిరోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ పర్యటన ఉంటుందని, ప్రజలు విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు పేర్కొన్నారు. శనివారం సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైసీపీలో నాయకులు నియంతల్లాగా వ్యవహరిస్తూ ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారని ఆరోపించారు. రాష్ట్రానికి మరికొద్ది రోజుల్లో పేద,మధ్యతరగతి ఆకాంక్షలను నెరవేర్చే చంద్రన్న ప్రభుత్వం రానున్నదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.సురేష్, గోపీ పాల్గొన్నారు.

గాయకులకు మార్గదర్శకుడు ఘంటసాల

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 10: ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గాయకులకు మార్గదర్శకమని పద్మశ్రీ ఘంటసాల కళాపరిషత్ అధ్యక్షులు, గాయకుడు తులసి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా శనివారం రాత్రి ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో కళాపరిషత్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి జరిగింది. ముందుగా ఘంటసాల చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీనియర్ గాయకుడు అప్పిశెట్టి రత్తయ్య మాట్లాడుతూ ఘంటసాల పాడిన పాటలతో ఎంతో మంది కళాకారులు జీవనోపాధి పొందుతున్నారని, తెలుగుజాతి ఉన్నంతవరకు ఆయన పాట పదిలంగా ఉంటుందన్నారు. అనంతరం గాయకులు కోటేశ్వరరావు, తులసి, టీవీ.శేషగిరిరావు, గుర్రం శివప్రసాద్, వై.పూర్ణచంద్రరావు, ఎల్.కరుణాకర్, సోమశిల స్వర్ణలత, మహేశ్వరి తదితరులు పలు సినీ గీతాలతో ప్రేక్షకులను అలరించారు. గాయకులు పి.శివ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, వెన్నూరి నాగేశ్వరరావు సహకారాన్ని అందజేశారు.

నేడు ఘంటసాల వర్ధంతి

కాగా ఆదివారం ఘంటసాల వర్ధంతి సందర్భంగా సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి పాలఅభిషేకం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయకుడు కనకారావు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన గాయకులు, సాంస్కృతిక, కళా సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.



ఒక్క బీసీకైనా రుణం ఇచ్చారా..?

- జయహో బీసీ సభలో అశోక్‌రెడ్డి
- వైసీపీ దుర్మార్గాలపై ఎరిక్షన్‌బాబు ప్రచారం
- నారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరికలు



మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

కంభం (అర్ధవీడు), ఫిబ్రవరి 10 : రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్‌రెడ్డి ఒక్క బీసీకైనా రాయితీపై రుణం ఇచ్చారా..? అని గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం అర్ధవీడు మండలం దొనకొండ గ్రామంలో నిర్వహించిన 'జయహో బీసీ' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి బీసీలను వెన్నుపోటు పొడిచాడన్నారు. ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. బీసీలపై దాడులు చేయించడం, అక్రమ కేసులు పెట్టడం, దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు. నాటి టీడీపీ హయాంలో బీసీల కోసం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశాడని గుర్తుచేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో బీసీ భవనాలను మంజూరు చేసి పనులను ప్రారంభిస్తే వైసీపీ నాయకులు ఎందుకు పూర్తి చేయలేకపోయారో చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలు టీడీపీకి మద్దతుగా నిలవాలన్నారు. తిరిగి బీసీ సంక్షేమానికి బాటలు వేసుకోవాలన్నారు.

వ్యవసాయ కూలీల సమస్యలు తెలుసుకుంటూ..

అర్ధవీడు మండలం దొనకొండ గ్రామంలో జరుగుతున్న 'జయహో బీసీ' కార్యక్రమాన్ని వస్తున్న మాజీఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పొలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలను పరామర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళ కూలీలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో తమలాంటి పేదలకు అన్నీ కష్టాలేనన్నారు. ప్రస్తుతం ఆకాశాన్ని అంటుతున్న ధరలతో ఏమీ కొనలేని పరిస్థితి వచ్చిందన్నారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, పేదవారి కష్టాలన్నీ గట్టెక్కుతాయన్నారు. కార్యక్రమంలో అర్ధవీడు మండల టీడీపీ అధ్యక్షులు బండ్లమూరి ఆంజనేయులుయాదవ్, ప్రధాన కార్యదర్శి కొనతం రంగారెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షులు ఈర్ల యర్రన్న యాదవ్, సర్పంచ్ సిరవెళ్ల ఎస్తేరురాణి, మాజీసర్పంచ్ బండి నారాయణరెడ్డి, యాచవరం సర్పంచ్ వీరయ్య, పాపినేని పల్లె సర్పంచ్ పుల్లారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మండ్ల రంగయ్య, బోయపాటి వెంకటేశ్వర్లు, వియ్యాల నారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ మారెడ్డి రంగారెడ్డి, ఉపాధ్యక్షులు సూరె కృష్ణయ్య, టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

సైకో పాలనను సాగనంపాలి

మార్కాపురం వన్‌టౌన్ : రాష్ట్రంలో సైకో పాలనను సాగనంపి సైకిల్‌ని ఆదరించాలని టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో శనివారం రాత్రి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి రానున్న టీడీపీ ప్రభుత్వం హయంలో అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలు వివరించారు.

టీడీపీ శంఖారావంతోనే వైసీపీ పతనం

ఎర్రగొండపాలెం : వైసీపీ దుర్మార్గాల అంతం టీడీపీ శంఖారావంతోనే ప్రారంభమైందని టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెంలో శనివారం టీడీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో పర్యటించి జగన్‌రెడ్డి దౌర్జన్యాలను ప్రజల్లో ఎండగట్టారన్నారు. ప్రతి నియోజకవర్గంలో రెండుమూడు రోజులు సభలు జరుగుతాయని, ప్రజా సమస్యలు తెలుసుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, మండల నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, చిట్యాల వెంగలరెడ్డి, కంచర్ల సత్యనారాయణగౌడ్, పాలడుగు వెంకటకోటయ్య, టీడీపీ ముఖ్యనాయకులు, క్లస్టరు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

టీడీపీలో 25 కుటుంబాల చేరిక

మార్కాపురం రూరల్ : మండలంలోని గజ్జలకొండ గ్రామం ఎస్సీపాలెం లో మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సమక్షంలో 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కందుల నారాయణరెడ్డితో ఆయన తనయుడు విష్ణుష్ రెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన 25 కుటుంబాలు జమ్మలమూడి బక్కయ్య, శేషం ఇజ్రాయేలు, జమ్మలమూడి సనద్ధకట్టయ్య, జమ్మలమూడి మత్తయ్య తదితరుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలను మోసం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జవ్వాజి రామానుజులరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, గజ్జలకొండ టీడీపీ నాయకులు శనగ నాసర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కందుల నారాయణరెడ్డి

వివాదాస్పద భూమిని పరిశీలించిన సబ్ కలెక్టర్

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 10: పట్టణంలోని రథం బజారులో ఆక్రమణకు గురైన వివాదస్పద స్థలాన్ని శనివారం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులతో కలిసి పరిశీలించారు. పట్టణానికి చెందిన పెరుమాళ్ల మోహన్‌రావుకు చెందిన 359 గజాల భూమి 338-2 సర్వేనంబరులో ఉంది. ఈ స్థలాన్ని నకిలీపత్రాలు సృష్టించి నాదెళ్ల చంద్రమౌళి అనే వ్యక్తి ఆక్రమించారని పెరుమాళ్ల మోహన్‌రావు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. అయినప్పటికీ, సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. దీంతో మరోసారి రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఆ స్థలాన్ని పరిశీలించారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

ఎస్ఐగా కోటయ్య బాధ్యతలు

పొదిలి, ఫిబ్రవరి 10 : పొదిలి నూతన ఎస్ఐగా కోటయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న వెంకటసైదులు ఒంగోలు వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో కోటయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేకదృష్టి సారిస్తానన్నారు. మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని చెప్పారు.



నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి, ఫిబ్రవరి 10 : పొదిలి ఆర్టీసీ డిపో పరిధిలో ఆదివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ జె సుందరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుండి 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పొదిలిడిపో పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, కరిచేడు, దొనకొండ ప్రాంతాల ప్రయాణీకులు తమ విలువైన సలహాలను సూచనలను ఇవ్వాలని ఆయన కోరారు. తమ సలహాలు, సూచనలు ఫిర్యాదులను 9959225700 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తున్న మోదీ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 10: ఐసీడీఎస్ పథకానికి నిధులు ఇవ్వకుండా మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యకర్తల అవగాహన తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. దేశంలోని శిశుమరణాలు తగ్గించేందుకు మహిళల రక్తహీనత, గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే పనిలో అంగన్‌వాడీలు సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో తమ హక్కుల కోసం 42 రోజుల సుదీర్ఘ పోరాటం చేసి ప్రభుత్వం మెడలు వంచిన ఘనత అంగన్‌వాడీలదేనన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డీకేఎం రఫీ, రూబెన్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు వెంకటరత్నం, రమాదేవి, సుబ్బమ్మ, మల్లేశ్వరి, భారతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన గెలుపునకు సహకరించాలి

రాచర్ల, ఫిబ్రవరి 10 : రాష్ట్రస్థాయిలో టీడీపీ, జనసేన ఉమ్మడిగా పోటీ చేస్తుండడంతో ప్రతి ఒక్కరూ జనసేన పార్టీని ఆదరించి గెలిపించాల్సిన అవసరం ఉందని ఆమంచి స్వాములు అన్నారు. శనివారం మండలంలోని జె.పుల్లల చెరువు సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. చినగానిపల్లి, జె.పుల్లల చెరువు గ్రామాలకు చెందిన జనసేన నాయకులను ఆమంచి స్వాములు కలిశారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి చినగానిపల్లె సర్పంచ్ పగడాల రమేష్ ఇంటి వద్దకు వెళ్లి ఆమంచి కార్యకర్తలను కలిశారు. జనసేన మండల అధ్యక్షులు పుట్టా బాలకృష్ణ ఆధ్వర్యంలో అనంపల్లె ఎంపీటీసీ సభ్యుడు గోవిందయ్య, మండలంలోని పలువురు కాపు నాయకులు, పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆమంచిని కలిసి సంఘీభావం తెలిపారు.



స్వాములుకు స్వాగతం పలుకుతున్న నేతలు

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా సరోజిని

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 10: పట్టణానికి చెందిన బీజేపీ నాయకురాలు శాసనాల సరోజినిని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా నియమిస్తూ, బీజేపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఆమెను పలువురు బీజేపీ నాయకులు అభినందించారు.



సరోజినిని అభినందిస్తున్న నాయకులు

పేదలకు సాయం చేయడంలో తృప్తి ఉంది

వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

పొదిలి, ఫిబ్రవరి 10 : పేదలకు సహాయం చేయడంలోనే తృప్తి ఉంటుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. శని వారం స్థానిక పించనర్ల భవనం హబీబుల్లా బేగ్ స్వచ్ఛందసేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంత ఆస్తి, డబ్బు సంపా దించినా, చివరకు మిగిలేది మంచి తనమే అ న్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవరుచు కోవాలన్నారు. ప్రస్తుతం సమాజంలో ఆత్మాభిమా నాలు కనుమరుగౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరిలో ప్రజాసేవ చేయాలనే ఆలోచన రావాలని ఆయన ఆకాంక్షించారు. మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ మన వరకు మనం ఎలా జీవిస్తున్నామనేది ముఖ్యం కాదని తోటివారికి ఎంత వరకు సహాయపడగలుగుతున్నామనేది ముఖ్యమన్నారు. పేదల కోసం చేసే సేవా కార్యక్రమాలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. సీఐ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ పేదలతోపాటు ఇబ్బందులకు గురైన వారికి కూడా సేవచేయాలనే భావన ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పింఛనర్ల సంఘం మండల అధ్యక్షుడు ఏ బాదుల్లా, సంఘ నాయకులు ఏ వీరారెడ్డి, మదార్‌వలి, జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ తారావాణి, జీసీ సుబ్బారావు, పార్థసారధి, లాయర్ షబ్బీర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం

తర్లుపాడు, ఫిబ్రవరి 10: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ప్రారంభించారు. మీర్జపేటలోని సచివాలయాన్ని రైతుభరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్, తర్లుపాడులోని రైతుభరోసాకేంద్రం, మినరల్ వాటర్‌ప్లాంట్, సీసీ రోడ్డును సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతులకు అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందుతున్నాయన్నారు. ఆయన ఇక్కడి నుంచి గిద్దలూరు వైసీపీ ఇన్‌చార్జ్‌గా వెళ్లనున్న నేపథ్యంలో హడావుడిగా వీటి ప్రారంభోత్సవం చేశారు. తర్లుపాడు సచివాలయం అసంపూర్తిగా ఉంది. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. కేవలం ఒక గదికి మాత్రమే ఫ్లోరింగ్ వేశారు. మిగతా గదులకు ఫ్లోరింగ్ వేయలేదు. కార్యక్రమంలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, సర్పంచులు పల్లెపోగు వరాలు, డి.కాశయ్య, దూదేకుల పెద్దమస్తాన్, ఎంపీటీసీ సభ్యులు దేవిరెడ్డి పార్వతి, వన్నెబోయిన అంకమ్మ, వైసీపీ నాయకులు సూరెడ్డి రామసుబ్బారెడ్డి, దేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, షేక్ అక్బర్‌వలి, వెన్నా సత్యనారాయణరెడ్డి, వెలుగు వెంకటేశ్వర్లు, నడికట్టు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న నాగార్జునరెడ్డి

వృద్ధాశ్రమానికి భూమి వితరణ

కొమరోలు, ఫిబ్రవరి 9: మండలంలోని నల్లగుంట్ల గ్రామ పంచాయతీలోని శ్రీ అభయాంజనేయస్వామి గుడి సమీపంలో జయప్రియమ్ ఫౌండేషన్ నిర్మిస్తున్న వృద్ధాశ్రమ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన ఆవుల రామవెన్నూరురెడ్డి, రఘురామిరెడ్డి, రామక్రిష్టారెడ్డిలు 30 సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు ఆధ్వర్యంలో శనివారం భూమిని అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు వెంకటనాయుడు మాట్లాడుతూ రాష్ట్రీయ రహదారి పక్కనే విలువైన స్థలాన్ని అనాథ వృద్ధాశ్రమ నిర్మాణానికి ఇవ్వడం అభినందనీయమన్నారు. జయప్రియమ్ ఫౌండేషన్ సభ్యులు దాతలు ఇచ్చిన స్థలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనాథవృద్ధులకు ఆశ్రయాన్ని కల్పించాలన్నారు. జిల్లాకు సుదూరంలో ఉన్న వెనుకబడిన ప్రాంతంలో ఈ ఫౌండేషన్ ద్వార ఆశ్రమాన్ని నిర్వహస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఆశ్రమ నిర్మాణానికి తాము కూడా పూర్తి సహాయసహకారాలను అందిస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగి నాదేళ్ల వెంగయ్య చౌదరి మాట్లాడుతూ వెనుకపడిన ప్రాంతాల్లో వృద్ధులకు చేయుత నివ్వడం శుభపరిణామమన్నారు. ఆశ్రమ నిర్మాణానికి మండల ప్రజలు సహకరించాలన్నారు. కార్యాక్రమంలో డీలర్ ప్రసాదు, కందుల శింగర్‌రెడ్డి, మేడం భాస్కర్ రెడ్డి, ఇడమకల్లు రమణయ్య, తిమోతి దండు, మందా ప్రసాదు, ఇశ్రాయిల్ పాల్గొన్నారు.



భూమి పట్టా అందజేస్తున్న దాతలు

వైసీపీకి రామచంద్రారెడ్డి రాజీనామా



మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 10: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సీనియర్ నాయకులు డా. ఏలూరి రామచంద్రారెడ్డి ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటించారు. ఈ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డికి తన రాజీనామా లేఖ పంపినట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరనున్నట్లు ఆయన అనుచరులు పేర్కొన్నారు. ఈ మేరకు పురందేశ్వరిని డాక్టర్ ఏలూరి కలిశారు.

తాగు నీటి కోసం ధర్నా

పుల్లలచెరువు, ఫిబ్రవరి 10: మండల కేంద్రమైన పుల్లలచెరువులో తాగునీటి కోసం ప్రజలు రోడ్డెక్కి ధర్నా చేశారు. శనివారం బస్టాండ్ కూడలిలో బస్సులు ఆపివేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి జీవీగురునాధం మాట్లాడుతూ ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి వస్తోందన్నారు. పుల్లలచెరువులో సూమారు 10 వేలకు పైగా జనాభా ఉన్నారని బోర్లలో నీరురాక, ట్యాంకర్ల తోలక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. కొందరు నీటిని డ్రమ్ము రూ.100 పెట్టి కోనుగోలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సిగ్గు తెచ్చుకోని వెంటనే నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

వెలిగొండ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాల్సిందే...!

- ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షులు సుదర్శన్

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 10: వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా ప్రారంభిస్తే అడ్డుకుంటామని ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షులు సుదర్శన్ హెచ్చరించారు. వెలిగొండ ప్రాజెక్టు సమస్యలు పరిష్కరించాలి, మార్కాపురం జిల్లా ప్రకటన చేయాలని ఆమ్ ఆద్మీ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదురు శనివారం రిలే దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంపై నిజానిజాలు తెలియజేయాలన్నారు. అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వెలిగొండ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలన్నారు. మార్కాపురాన్ని నూతన జిల్లాగా ఏర్పాటు చేస్తూ, ప్రకటన చేయాలన్నారు. రిలేదీక్షకు టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, సీపీఎం నాయకులు గుమ్మా బాలనాగయ్య ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్.శ్రీనివాసరావులు సంఘీభావం తెలిపారు.



మాట్లాడుతున్న సుదర్శన్

లభ్యంకాని బాలికల ఆచూకీ

రాచర్ల, ఫిబ్రవరి 10 : రాచర్ల మండలంలో ఇద్దరు మైనర్ బాలికల అదృశ్యంపై ఇంత వరకు జాడ లేకుండాపోయింది. దీంతో బాలికల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. పదిరోజులు దాటినా, బాలికల ఆచూకీ తెలియకపోవడం, ఎటువంటి సమాచారం రాకపోవడంతో విద్యార్థుల పరిస్థితి ఎలా ఉందోనని రోధిస్తున్నారు. జనవరి 29న రాచర్ల జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుకుంటున్న ఓ విద్యార్థిని, అలాగే మోడల్ పాఠశాలలో చదువుకుంటున్న మరో విద్యార్థిని కనిపించకుండా పోయారు. వీరు 8, 9 తరగతులు చదువుతున్నారు. వీరిద్దరు ఆ రోజు పాఠశాలకు వెళ్లి స్వగ్రామమైన రాచర్లఫారానికి తిరిగి రాలేదు. దీంతో ఆ మైనర్ విద్యార్థినుల తల్లిదండ్రులు రాచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.. రాచర్లఫారంకు చెందిన ఓ అనుమానిత వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నారు. గత 29వ తేదిన ఆ ఇద్దరు బాలికలను తీసుకుని కంభం మండలం యర్రబాలెం బస్టాండ్ వద్ద బైక్ మీద దింపినట్లు తెలుసుకున్నారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే తాను అంతవరకు మాత్రమే వదిలానని, అనంతరం వారు ఎక్కడికి వెళ్లింది తెలియద న్నారు. మరో ఇద్దరు అనుమానితుల ఆచూకి కోసం పోలీసులు వెతుకుతున్నారు. అయితే వ్యూహాత్మకంగా బాలికలు వారి వద్ద ఉన్న ఫోన్లను ఇంటి వద్దే ఉంచి వెళ్లారు. దీంతో వారు ఎటువెళ్లారో తెలియక కేసు మిస్టరీగా మారింది. ప్రతిరోజు తల్లిదండ్రులు పోలీసుస్టేషన్ చుట్టూ తిరిగి తమ బిడ్డలు ఏమాయ్యారు అని అడిగి తెలుసుకొని రోధిస్తూ వెళుతున్నారు. ఘటన జరిగి పదిరోజులైన కేసు కొలిక్కి రాకపోవడంతో పోలీసులకు సవాలుగా మారింది.

త్వరలో చేధిస్తాం

మైనరల్ బాలికల అదృశ్యం కేసును త్వరలో చేధిస్తామని గిద్దలూరు సీఐ దాసరి ప్రసాద్ తెలిపారు. ఇప్పటికే రెండు క్రైమ్‌బ్రాంచ్‌ల టీములను ఏర్పాటు చేసి విస్తృతంగా గాలిస్తున్నామన్నారు. తప్పిపోయిన వారి వద్ద ఫోన్లు లేకపోవడంతో సమాచారం ఆలస్యంగా జరుగుతోందన్నారు. అయినప్పటికీ త్వరలోనే కేసును చేధిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. - సీఐ దాసరి ప్రసాద్

అవీ..ఇవీ..

మేడంవారిపల్లి మీదుగా ఆర్టీసీ సర్వీసు

రాచర్ల, ఫిబ్రవరి 10 : మండలంలో మరో ఆర్టీసీ సర్వీసును ఏర్పాటు చేసినట్లు గిద్దలూరు డిపో మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. రోజు మాదిరిగానే గిద్దలూరు నుంచి రంగారెడ్డిపల్లె, మేడంవారిపల్లి, జేబీకేపురం మీదుగా మార్కాపురం వరకు ఆర్టీసీ సర్వీసు ఉంది. దీనికి అదనంగా మరో సర్వీసును శనివారం ప్రారంభించినట్లు డీఎం చంద్రశేఖర్ తెలిపారు. మేడంవారిపల్లి గ్రామానికి చెందిన సామాజిక నాయకుడు బిజ్జం రంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు మరో సర్వీసు ఏర్పాటు చేయాలని రాష్ట్రస్థాయి అధికారులకు విజ్ఞప్తి చేశారు. వారి ఆదేశాల మేరకు ఈ సర్వీసును ఏర్పాటు చేశారు. కంభంలో 8.30 గంటలకు బయలుదేరి గిద్దలూరుకు వస్తుండగా, సాయంత్రం 5గంటలకు గిద్దలూరులో బయలుదేరి ఈ గ్రామాల మీదుగా కంభానికి చేరుతుందన్నారు.

నెలఖరులోగా పన్ను చెల్లించాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 10 : 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను, ఖాళీ స్థలాలపై పన్నులు నెలాఖరులోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు దినాల్లో, ఆదివారం సైతం పన్ను చెల్లింపులకు వీలుగా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలని కోరారు.

కాలువల్లో చెత్తను వేయవద్దు

గిద్దలూరు, ఫిబ్రవరి 10 : ఇళ్లలోని, దుకాణాలలోని చెత్తాచెదారాన్ని రోడ్లపై, మురికినీటి కాలువల్లో వేయవద్దని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ప్రజలను కోరారు. శనివారం ఉదయం పట్టణంలోని పలువీధుల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలోని ప్రజలతో, వ్యాపారులతో కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడారు. చెత్తాచెదారాన్ని ప్రతి రోజు ఉదయం ఇంటి ముందుకు వచ్చే చెత్తరిక్షాలలో మాత్రమే వేయాలని సూచించారు. రిక్షాలలో కాకుండా రోడ్లపై, కాలువల్లో వేయడం వలన మురికినీరు ముందుకు వెళ్లలేక దోమలు వృద్ధి చెందుతాయన్నారు. అటు దుర్వాసన, దోమల బాధను ప్రజలే ఎదుర్కొవలసి వస్తుందన్నారు. పారిశుధ్యం విషయంలో చెత్తరిక్షాలను ఉపయోగించుకోవాలని కమిషనర్ ప్రజలకు సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ టపావలి ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం

గిద్దలూరు, ఫిబ్రవరి 10 : బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు 'పల్లెకుపోదాం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కిసాన్ సమృద్ధి యోజన, జలజీవన్, ఉజ్వల యోజన, విశ్వకర్మ కౌసల్యయోజన, ఆయుష్మాన్‌భవ, తదితర పథకాల వలన కలిగే లబ్ధి గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, ఉపాధ్యక్షులు ఎం.వీ.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

గిరిజన గ్రామాల్లో..

పెద్ద దోర్నాల : మండలంలోని చింతల, మర్రిపాలెం తుమ్మలబైలు గిరిజన గ్రామాల్లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పల్లెకుపోదాం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షుడు గండి వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలకు అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కరోనా సమయం నుంచి ప్రతి నెలా చౌకధరల దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ, రైతులకు ఏటా రూ.6 వేలు పెట్టుబడి సాయం అందిస్తోందన్నారు. చిరు వ్యాపారులకు ముద్రారుణాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి రెడ్డి, లక్ష్మీరెడ్డి, శ్రీను, కాశీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

త్రిపురాంతకం, ఫిబ్రవరి 10: మండలంలోని స్వయం సహాయక సంఘాలకు ఆసరా చెక్కును వైసీపీ నియోజకవర ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం అందజేశారు. స్థానిక ఎంపీడీవో కార్యలయం వద్ద వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 601 గ్రూపులకు సంబంధించి నాలుగో విడతగా విడుదలైన రూ.3.12 కోట్ల విలువైన చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుంద న్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, సర్పంచ్ పి.వి.లక్ష్మి, ఏపీఎం కృపమ్మ, నాయకులు ఆళ్ల ఆంజనేయరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, ఐ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును విడుదల చేస్తున్న చంద్రశేఖర్

169 మందికి కంటి పరీక్షలు

కంభం(అర్ధవీడు), ఫిబ్రవరి 10 : స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్టు, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ముఖపుస్తక మిత్రుల విరాళాలతో శనివారం అర్ధవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నంద్యాల శాంతిరామ్ మెడికల్ కాలేజీకి చెందిన వైద్యులు కంటి పరీక్షలు చేశారరు. ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. 30 మందికి ఆపరేషన్లు అవసరం కాగా 13 మందిని నంద్యాలకు తరలించారు. ట్రస్టు చైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించేందుకు తమ ట్రస్టు పని చేస్తోందన్నారు. ట్రస్టు కోశాధికారి చెన్నకేశవుల సురేష్, లయన్ నూనె సుబ్బారావు, డాక్టర్ అఖిల్, డాక్టర్ దాసు, డాక్టర్ పవన్, డాక్టర్ సల్మాన్‌ఖాన్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఘనంగా ఘంటసాల వర్ధంతి

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 10: మధుర గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సాయిఫంక్షన్ హాల్‌లో బాలబాలికలకు పాటల పోటీలు నిర్వహించారు. 51 మంది పాల్గొనగా వీరందరికీ 24వ తేదీ బహుమతులు అందిస్తామని నిర్వాహకులు చిత్తారి రంగనాయకులు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా రాయపోలు వెంకటేశ్వర్లు, ఎంవీ రమణ, అల్లాభక్షు, జె.వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

పెద్దనాగులవరంలో ఇరువర్గాల ఘర్షణ

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 10: మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో ఇంటి విషయంలో ఇరువర్గాల కుటుంబ సభ్యులు ఘర్షణపడ్డారు. కర్రలతో దాడి చేసుకొన్నారు. దీంతో పలువురికి గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓర్సు చిన్నవెంకటేశ్వర్లు, తురక శ్రీను, ఓర్సు పెద్దవెంకటేశ్వర్లులతో పాటు కొంతమంది కర్రలతో తమ కుటుంబ సభ్యులు తమ్మిశెట్టి వెంకటరమణ, తమ్మిశెట్టి బ్రహ్మయ్య, వెంకట రత్నమ్మ, ఉమామహేశ్వరరావులపై దాడి చేసినట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గడియార స్తంభం వద్ద కుటుంబ సభ్యులతో ధర్నా చేశారు. ఎస్సై అబ్దుల్ రహమాన్, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్‌లు చేరుకొని వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



ధర్నా చేస్తున్న బాధితులు


బియ్యం వాహనాన్ని పట్టుకున్న అధికారులు

81 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

దర్శి, ఫిబ్రవరి 10 : దర్శి పట్టణ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 81 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. పేదల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాఘవ, ఎస్ఐ నాగేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్ రాజంపల్లి వైపు నుంచి దర్శికి తరలిస్తుండగా, దర్శి - కొత్తరెడ్డిపాలెం మధ్యలో సాగర్ కాలువ వద్ద వాహనంలో తరలిస్తున్న 81 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సరుకును ప్రభుత్వ గొడౌన్‌కు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

నేడు ఉగ్ర పర్యటన

పామూరు, ఫిబ్రవరి 10 : మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదివారం పామూరు మండలంలో పర్యటించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

అవస్థల ఆసరా..!

- చంటి బిడ్డలతో చెట్ల కింద మహిళల పడిగాపులు
- సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం
- కుర్చీలు లేక ఇబ్బందులు
- మంచినీటి కోసం వెతుకులాట
- పత్తాలేని ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి, ఫిబ్రవరి 10 : ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం డ్వాక్రామ మహిళలను అవస్థలకు గురి చేసింది. ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో శనివారం నాల్గో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం మెప్మా, వైకేపీ ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ కార్యక్రమానికి స్వయం సహాయక సంఘాల మహిళలు రావాల్సిందేనని ఆయా శాఖల అధికారులు హుకుం జారీ చేశారు. చేసేది లేక మహిళలు కనిగిరి మండలంలోని వివిధ గ్రామాల నుంచి, పట్టణంలోని 20 వార్డుల నుంచి కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ శాఖల అధికారులు సౌకర్యాలు కల్పించకపోవడంతో మహిళలు నానా అవస్థలు పడ్డారు. దాహం తీర్చుకోడానికి మంచి నీటి వసతిని కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో మహిళలు బూతుల పురాణం ఎత్తుకున్నారు. మరోపక్క కుర్చీలు లేక మహిళలు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమానికి వచ్చిన రాజకీయ నాయకులు కుర్చీలు తెప్పించాలని అధికారులకు చెప్పడంతో చేసేది లేక అధికారులు ఆటోలో కొన్ని కుర్చీలను తెప్పించారు. కుర్చీల కోసం ఒకరిపై ఒకరు ఎగబడాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో కార్యక్రమం రసాబాసగా జరిగింది. చాలామంది మహిళలు కూర్చునేందుకు అవకాశం లేక ఎండలో రేకుల షెడ్డుల కిందే కూర్చొన్నారు. చంటి బిడ్డలను తీసుకు వచ్చిన తల్లులు తమ బిడ్డలకు మంచినీటి కోసం వెదుకులాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.


చెక్కును అందజేస్తున్న అధికారులు, నాయకులు

హాజరుకాని ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన మూడు విడతల ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాలు ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ చేతులు మీదుగా జరిగాయి. ఎన్నికల వరకు పదవీకాలం ఉన్నప్పటికీ వైసీపీ ఇన్‌చార్జిగా దద్దాలను నియమించినప్పటి నుంచీ ఎమ్మెల్యే బుర్రా పత్తాలేకుండా పోయారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రొటోకాల్ పాటించి ఆయన హాజరు కావల్సి ఉండగా, ఆయన శనివారం ఆసరా కార్యక్రమానికి రాలేదు. దీతో కొత్త ఇన్‌చార్జికి ఊతమిచ్చినట్లయిది. కనిగిరి నియోజకవర్గంలో ఆసరా నాల్గవ విడత పంపిణీ కార్యక్రమానికి అన్ని మండలాల్లో ఇంచార్జి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం జరిగింది. వెలిగండ్ల జడ్పీటీసీ సభ్యుడు గుంటక తిరుపతి రెడ్డి, కనిగిరి జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి, పీడీసీసీబీ ఛైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి కనుసన్నలలో కార్యక్రమం సాగడం విశేషం. సీఎస్ పురంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో ఎంపీపీ మూడమంచు గైర్హాజరయ్యారు. చాలా చోట్ల ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ ప్రసంగించే సమయంలో కుర్చీల నుంచి లేచి మహిళలు వెళ్లిపోయారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో వైసీపీ పరిస్థితి ఇలా మారిందని ప్రజలు ఒకరినొకరు చెప్పుకుంటున్నారు.


కుర్చీలు లేకపోవడంతో రేకుల షెడ్ కింద కూర్చున్న మహిళలు


మాట్లాడుతున్న మీగడ

అంగన్‌వాడీలు పోరాటాలకు స్ఫూర్తి

యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మీగడ

కనిగిరి, ఫిబ్రవరి 10: అంగన్‌వాడీ కార్యకర్తలు పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచారని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సుందరయ్య భవనంలో శనివారం అంగన్‌వాడీల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించినా అలుపెరగని ఉద్యమంతో అంగన్‌వాడీలు నిలిచి హక్కును సాధించుకున్నారన్నారు. అంగన్‌వాడీలకు తల్లిదండ్రులు, గర్భిణులు మద్దతుగా నిలవడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీసీకేశవరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కల్పన, సీఐటీయూ నాయకులు రాయళ్ల మాలకొండయ్య, మహాలక్ష్మీ, రాధా, సీత, రజిని, రామసుబ్బులు, ఎల్లమ్మ, మహిళా సంఘం నాయకులు ప్రసన్న, కుమారి పాల్గొన్నారు.

రేపు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

పీసీపల్లి, ఫిబ్రవరి 10 : తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఈనెల నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కనిగిరి నియోజకవర్గ, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. సోమవారం సాయంత్రం 3గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

వ్యాయామంతో గుండె జబ్బులు దూరం

పామూరు, ఫిబ్రవరి 10 : రోజూ నడక, వ్యాయామం చేయడం ద్వారా గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చని ఒంగోలు వెంకటరమణ నర్సింగ్ హోం గెండె వైద్య నిపుణుడు కే శ్రీధర్‌బాబు సూచించారు. గద్దె ఏడుకొండలు హస్పిటల్ (అశ్విని ఆసుపత్రి)లో గుండె వైద్యం, గుండె జబ్బుల నివారణ చర్యలు అనే అంశంపై రోగులకు అవగాహన కార్యక్రమం డాక్టర్ గద్దె ఏడుకొండలు అధ్యక్షతన శనివారం జరిగింది. కాలంతో పాటు పరుగులు తీస్తూ మానసిక ఒత్తిడికి గురవుతూ గుండె పోటుతో మృతి చెందుతున్నవారి సంఖ్య ఇటీవల ఎక్కువైందని డాక్టర్ శ్రీధర్‌బాబు తెలిపారు. ఒత్తిడికి దూరంగా, మద్యం, ధూమపానానికి బానిసలు కావొద్దన్నారు. మంచి ఆహారం, వ్యాయామంతో ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఛాతిలో నొప్పి, బరువుగా ఉండడం, చెమటలు పట్టడం, ఎడమచేతివైపు నొప్పి రావడం, తలతిరగడం, ఆయాసం, వీపులో నొప్పి, చిన్న పిల్లలకు గోళ్ల నీలంగా మారడం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే గుండె వైద్యుడిని సంప్రదించాలని కోరారు. ఈ శిబిరంలో సుమారు 50 మందికి తక్కువ ఖర్చుతో వైద్య సేవలందించారు.


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీధర్



ప్రతిజ్ఞ చేస్తున్న యూనియన్ నాయకులు

మెగా డీఎస్సీని నిర్వహించాలి

పామూరు, ఫిబ్రవరి 10 : మెగా డీఎస్సీని నిర్వహించడంతోపాటు అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలని ఎస్టీయూ అధ్యక్షుడు వై.రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. వివేకా కాలేజీలో ఎస్టీయూ మండల కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను సిద్ధం చేయించాలన్నారు. అనంతరం ఎస్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి టీ వెంకటేశ్వరరెడ్డి, ఎన్నికల పరిశీలికుడు జీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షునిగా జయరామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం. హరనాథరెడ్డి, మల్లికార్జునరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్. లక్ష్మీరెడ్డి, మహిళా కార్యదర్శిగా ఎన్.నీరజ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా బీ వెంగళరెడ్డి, వై.రామచంద్రారెడ్డి, ఎస్.సుజాత, బోడ వెంకటేశ్వర్లు, జీ సుధాకర్‌రావు, డీ మాలకొండారెడ్డి, మైనారిటీ కన్వీనర్‌గా షేక్ ఖాదర్‌బాషా, ఎన్నుకొన్నారు. సమావేశంలో జీ రవీంద్రబాబు, మాల్యాద్రి, నాగయ్య, రవీంద్ర, జనార్దనరావు పాల్గొన్నారు.


హరనాథరెడ్డి, మల్లికార్జున

కనిగిరి నుంచి అరుణాచలానికి బస్సు

పామూరు, ఫిబ్రవరి 10 : మాఘ పౌర్ణమి సందర్భంగా కనిగిరి నుంచి అరుణాచలానికి బస్సు 22వ తేదీ (గురువారం రాత్రి) బయలుదేరుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ బీ శ్రీమన్నారాయణ తెలిపారు. కనిగిరి డిపో నుంచి గురువారం బయలుదేరే ఈ బస్సు శుక్రవారం కాణిపాకం, తిరుపతి, కంచి దేవాలయాల మీదుగా శనివారం వేకువజామున 2 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అక్కడ ఉదయం నుంచి గిరి ప్రదర్శన అనంతరం తిరుగు ప్రయాణంలో గోల్డెన్ టెంపుల్, శ్రీకాళహస్తి దేవస్థానాలను దర్శించుకొని ఈనెల 25వ తేదీ మధ్యాహ్నానికి కనిగిరికి చేరుకుంటుందని వివరించారు. రూ.2,200 టికెట్ ధర నిర్ణయించామని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ కోరారు.

16న గ్రామీణ బంద్


సమావేశంలో మాట్లాడుతున్న మౌలాలి

పామూరు, ఫిబ్రవరి 10 : బీజేపీ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న సంయుక్త కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపులో భాగంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మౌలాలి పిలుపునిచ్చారు. జీవైఆర్ భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బంద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ సంస్థలకు మోదీ ఊడిగం చేస్తూ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉపాధి కింద 200 రోజులు పనులు కల్పించి కనీసం వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు మాల్యాద్రి, అల్లాబక్ష్, మహదేవయ్య ఏఐటీయూసీ నాయకులు సుబ్బారావు, ప్రభాకర్, వెంకటరెడ్డి, నరసింహారావు, పీ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

20లోపు ఫీజు చెల్లించాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 10 : జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 20వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి ఉత్తీర్ణులైన వారు డ్రాయింగ్, టైలరింగ్, హ్యాండ్ లూమ్ లోయర్ గ్రేడ్ పరీక్షలకు అర్హులు, లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణులైన వారు హయ్యర్ గ్రేడ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అర్హులు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్‌కు రూ.100, హయ్యర్ గ్రేడ్‌కు రూ.150, హ్యాండ్‌లూమ్, వీవింగ్ లోయర్‌కు రూ.150, హయ్యర్‌కు రూ.200, టైలరింగ్ ఎంబ్రాయిడరీ లోయర్‌కు రూ.150, హయ్యర్‌కు రూ.200 పరీక్షల ఫీజు చెల్లించాలి. రూ.50 రుసుంతో ఈనెల 29 వరకు, రూ.75 రుసుంతో మార్చి 6వతేదీ వరకు చెల్లించవచ్చు. మార్చి 7న నామినల్ రూల్స్‌ను డీఈవో కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాల కోసం ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఏఎన్‌యూ డిగ్రీ ఫలితాలు విడుదల

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 10 : ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డిగ్రీ మూడవ సెమిస్టర్ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఎం, బీఏవోఎల్, బీహెచ్ఎం పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఫలితాలను యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్ విడుదల చేసి వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈనెల 26లోపు రీ వాల్యువేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి తెలిపారు. ఒక్కొక్క సబ్జెక్టు జవాబుపత్రం రివాల్యువేషన్‌కు రూ.1240, పర్సనల్ వెరిఫికేషన్ జవాబుపత్రం కోసం రూ.1700 ఫీజు చెల్లించాలని ఆమె సూచించారు.

జగన్‌రెడ్డి అరాచకాలకు చెల్లు

- మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర
- వైసీపీని వీడి ఆయన సమక్షంలో 15 కుటుంబాల చేరిక

కనిగిరి, ఫిబ్రవరి 10: జగన్‌రెడ్డి అరాచకాలకు ఇక చెల్లు పడనుంచి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టినయాత్ర ప్రజల్లో చైతన్యం నింపిందన్నారు. అదేవిధంగా వైసీపీ అరాచకాలకు వ్యతిరేకంగా లోకేష్ సమరశంఖారావం పూరించనున్నారన్నారు. జగన్‌రెడ్డి దౌర్జన్యాలను ప్రజలకు తెలియ చేసేందుకు ప్రతి రోజు మూడు నియోజకవర్గాలను పర్యటించేందుకు సిద్ధమవుతున్నారన్నారు. రానున్న 40 రోజుల్లో 120 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో లోకేష్ పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంతో ప్రజలు మరింత చేరువవుతారన్నారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. జగన్‌రెడ్డి దుశ్చర్యతోనే వైసీపీపై ప్రజా వ్యతిరేకత మరింత ఎక్కువైందన్నారు. అక్రమ అరెస్టులకు టీడీపీ బెదరబోదన్నారు. సమావేశంలో శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, రాచమల్ల శ్రీనివాసులురెడ్డిచ, తమ్మినేని వెంకటరెడ్డి, బుల్లా బాలబాబు, అహ్మద్, గుడిపాటి ఖాదర్, నంబులు కొండయ్య, చెన్నయ్య ఇలియాజ్, కాసుల శ్రీరాం, ఏనుగు శ్రీనివాసులు, అచ్చాల రవి, మూలె బ్రహ్మారెడ్డి, రిజ్వాన్, షరీఫ్ తెలుగు మహిళలు కరణం అరుణ, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, అమ్ములమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర

కనిగిరికి పరిశ్రమలు తీసుకొస్తా

కనిగిరి ప్రాంతానికి ఫార్మా కంపెనీతో పాటు పరిశ్రమలూ తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని పాతూరు బొడ్డురాయి వీధిలో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రాన్ని జగన్ దోచుకుంటే, కనిగిరిలో సహజ సంపదను వైసీపీ నేతలు దోచుకునే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని కనిగిరిని చూసి బాధతో విమర్శించాల్సి వస్తోందన్నారు. ఇటీవల ఇక్కడకు వచ్చిన మాజీ సీఎం చంద్రబాబు దృష్టికి ఈ ప్రాంత ప్రధాన సమస్యలను చెప్పడంతోపాటు కచ్చితమైన హామీని తీసుకున్నానన్నారు. తాను గెలిచాక సమస్యల పరిష్కారం తప్ప మరో పని ఉండదన్నారు. ఇక్కడి నుంచి వలసలు తగ్గాలంటే పరిశ్రమలు రావాలన్నారు. కులం, మతం అంటూ అభ్యర్థులను ఎన్నుకొని అభివృద్ధికి అవరోధంగా మారొద్దన్నారు. పనిచేసే స్థానిక నాయకుడినే ఎన్నుకోవాలన్నారు. తాను ఎమ్మెల్యేగా చేసిన కాలంలో చేసిన అభివృద్ధికి సాక్ష్యాలు, వాటి ఫలాలు ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బొడ్డురాయి స్థానంలో దేవాలయం నిర్మిస్తామని, ఈ ప్రాంత వాసులకు శ్మశానవాటిక ఏర్పాటు చేయిస్తామని ఉగ్ర హామీ ఇచ్చారు.


చేరికల అనంతరం జరిగిన సభలో మాట్లాడుతున్న ఉగ్ర

వైసీపీని వీడిన 15 కుటుంబాలు

వైసీపీని వీడి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో పాతూరుకు చెందిన 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి డాక్టర్ ఉగ్ర పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాతూరులో పర్యటించిన ఉగ్రకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. పూలతో, మేళతాళాల నడుమ ఆయన ఘన స్వాగతం పలికారు. ఈ సమయంలో డాక్టర్ ఉగ్ర ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సమస్యలను ప్రధానంగా ఉగ్ర ఎదుట పాతూరు వాసులు ప్రస్తావించారు. ఎన్నికల అనంతరం మంచినీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని ఉగ్ర హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అప్పుడే అధినేత చంద్రబాబు వద్ద సమస్యల పరిష్కారానికి, నిధులు రాబట్టేందుకు వీలుంటుందన్నారు. ఆయన వెంకట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో చీర్ల నాగార్జునయాదవ్, చింతం బాలకృష్ణయాదవ్, చింతం కిరణ్‌కుమార్ యాదవ్, చీర్ల హరికృష్ణయాదవ్, పాశం వెంకటరావుయాదవ్, చెన్నుబోయిన దీన్‌దయాళ్‌యాదవ్, పాశం నాగేంద్రయాదవ్, ముడియం శివయాదవ్, షేక్ నాయబా, దిబ్బమడుగు భరత్‌కుమార్‌యాదవ్, పఠాన్ ఖాదర్‌ఖాన్, మస్తాన్, దగ్గు సాయిరాం, నూలక బార్గవ్, దుగ్గిలి పవన్‌కుమార్ కుటుంబాలు టీడీపీలో చేరాయి.

పీసీపల్లిలో ఎస్ఈబీ నిఘా

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పీసీపల్లి, ఫిబ్రవరి 10 : పీసీపల్లిలోని ప్రభుత్వ మద్యం షాపులపై ఎస్ఈబీ అధికారులు నిఘా పెట్టారు. నెలరోజుల వ్యవధిలో మద్యం షాపులో పనిచేస్తున్న ఇద్దరు సూపర్‌వైజర్‌లు అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తూ ఎస్ఈబీ అధికారులకు పట్టుబడ్డారు. దీనిపై కేసులు నమోదుచేసి నిందితులను రిమాండ్‌కు తరలించినా సేల్స్‌మేన్‌లు, సూపర్‌వైజర్‌లలో ఎటువంటి మార్పు రాలేదు. తిరిగి యథావిధిగా ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై అదనంగా నగదును వసూల చేస్తూ బెల్టు దుకాణాలకు బాటిళ్లను తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. శనివారం ఆంధ్రజ్యోతిలో మేమింతే..మారమంతే..రెచ్చిపోతున్న మద్యం మాఫియా అనే కథనం ప్రచురిచితమైంది. దీనిపై స్పందించిన ఎస్ఈబీ అధికారుల ఆదేశాలతో సిబ్బంది ఉదయం 5గంటలకే పీసీపల్లి చేరుకుని బెల్టుషాపు నిర్వాహకుల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. రాత్రి వరకు పీసీపల్లి వైన్‌షాప్‌నకు సమీపంలోనే ఉండి మద్యం కొనేవారిపై నిఘా ఉంచారు.


మద్యం దుకాణానికి సమీపంలో మఫ్టీలో గస్తీ నిర్వహిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

దర్శి సీఐ షేక్ షమీముల్లా

ముండ్లమూరు, ఫిబ్రవరి 10 : మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను గుర్తించి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని దర్శి సీఐ షేక్ షమీ ముల్లా అన్నారు. ఆయన శనివారం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ వెంకట కృష్ణయ్య, సిబ్బందితో సమావేశం అయ్యారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఏగ్రామంలోనైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో గొడవ జరిగిన గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని సిబ్బందికి సూచించారు. అనుమతి లేకుండా ఇసుకను తరలించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బెల్టు షాపులు లేకుండా దాడులు చేపట్టాలని ఎస్ఐని ఆదేశించారు. నోటిఫికేషన్ విడుదలైన వెంటనే జిల్లా సరిహద్దు గ్రామాలైన శంకరాపురం, పెదఉల్లగల్లు వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి రోజు విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేయాలన్నారు. మండలంలో రౌడీషీటర్ల కదలికలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి వారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. మండలంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.


ఎస్ఐతో మాట్లాడుతున్న సీఐ షమీముల్లా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలో పోలవరం, పసుపుగల్లులో పోలింగ్ కేంద్రాలను సీఐ పరిశీలించారు. ఓటర్లు ఓటు హక్కును ప్రశాంతంగా, సౌకర్యవంతంగా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం ఉండాలన్నారు. ఆయనతోపాటు ఎస్ఐ వెంకట కృష్ణయ్య, ఏఎస్ఐ బీ పవన్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 10: ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 9,11 తేదీల్లో ఖాళీ సీట్లు, భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు నిర్వహించారు. డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలు, రామనగర్, వీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతికి, నవోదయలో 11వ తరగతికి పరీక్ష జరిగింది.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
3
ఆదివారం 11 ఫిబ్రవరి 2024





నిధులు ఎలా..?

తిరునాళ్ళ ఏర్పాట్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. తిరునాళ్ళకు ప్రభుత్వం ప్రత్యేక పండుగ హోదా కల్పించింది. గత ఐదేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు మాత్రమే రూ.10 వేలు నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంటోంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఏటా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు విడుదల చేసేవారు. తిరునాళ్లకు దాదాపు రూ.1.50 కోట్ల ప్రభుత్వం బకాయి ఉంది. మళ్ళీ తిరునాళ్ళ వస్తున్నా ప్రభుత్వం నుంచి ఈ నిధుల్లో రూపాయి కూడా విడుదల కాలేదు. ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీలకు తిరునాళ్ళ సందర్భంగా జరిగే ఏర్పాట్లకు నిధులు విడుదల చేయాలి. ఆయా శాఖల అధికారులు ఏర్పాట్ల కోసం నిధులు సమకూర్చుకోవటంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా జరిగే సమీక్షా సమావేశాల్లో నిధుల సమస్యలను ప్రస్తావిస్తున్నా దీనికి శాశ్వత పరిష్కారం లభించటం లేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు తిరునాళ్ళ ఏర్పాట్ల పై దృష్టి సారించాలి.

పనిచేయని మోటార్లు..

కొండ దిగువన చెరువుల్లో నీరు అడుగంటింది. దీంతో బోర్ల నీటిపైనే దేవస్థానం ఆధారపడాల్సి ఉంది. కొండ దిగువన తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రెండు బోర్లు నిర్మించి వీటికి మోటార్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువన సంపు నిర్మించి బోర్ల నీటిని పంపి అక్కడ నుంచి కొండపైకి పంపింగ్ చేసేవారు. ఈ విధానాన్ని కూడా దేవస్థానం అటకెక్కించింది. ఈ బోర్లకు మోటార్లు కూడా పనిచేయడంలేదు. ఒక బోరును నిరుపయోగంగా వదిలేశారు. ఇటీవల ఓ దాత మోటారు విరాళంగా ఇవ్వడంతో దాంతో నీటిని కొండపైకి సరఫరా చేస్తున్నారు. రెండు బోర్లు, వాటికి రెండు మోటార్లు సిద్ధం చేయకుంటే తిరునాళ్ల రోజున నీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఒక వేళ చిలకలూరిపేట మేజర్‌కు నీరు విడుదల చేయకపోతే భక్తుల స్నానాలకు నీటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. నీటికోసం ముందస్తుగా ఇప్పటినుంచే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై తక్షణమే దృష్టి సారించాలి. లేకుంటే తిరునాళ్ల రోజున భక్తులు నీటి కష్టాలను ఎదుర్కోక తప్పదు. దేవస్థాన అధికారులు, ఆర్ డబ్ల్యుఎస్, జలవనరుల శాఖ అధికారుల మధ్య నీటి సరఫరాలో సమన్వయం అవసరం.

తిరునాళ్ల ఏర్పాట్లు.. ఊసేది?

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో మహా శివరాత్రి పర్వదినాన జరిగే తిరునాళ్ళ దేశ ప్రసిద్ధి. వచ్చేనెల 8న తిరునాళ్ళ జరగనుంది. ఏకాదశి రోజున తిరునాళ్ళ మహోత్సవాలు ప్రారంభ మవుతాయి. ఇంకా సమయం 25 రోజులే ఉంది. అయినా అధికారులు తిరునాళ్ళ ఏర్పాట్ల ఊసే ఎత్తటం లేదు. నేటి వరకు ఏర్పాట్ల పై సమీక్షలు నిర్వహించ లేదు. ఈ తిరునాళ్ళకు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించినా ఏటా నిధులు విడుదల చేయటం లేదు. దీంతో దాతల విరాళాల పైనే వివిధ శాఖలు ఏర్పాట్ల కోసం ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

- కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్ల మాటెత్తని యంత్రాంగం
- 25 రోజుల్లో త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ళ మహోత్సవాలు
- రాష్ట్ర పండుగ హోదా కల్పించినా నిధులు విడుదల కాని వైనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్ప కొండ తిరునాళ్ళ గడువు సమీపిస్తోంది. అయినా సంబంధిత శాఖ లు ఏఏ ఏర్పాట్లు చేయాలనే అంశంపై స్పష్టత రాలేదు. పోలీసు, దేవాదాయ, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, అగ్నిమాపక, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యం, అటవీ, రెవెన్యూ తదితర శాఖలు తిరు నాళ్ళ ఏర్పాట్లలో కీలక పాత్ర పోషిం చాల్సి ఉంది. తాగు నీరు, పారిశుధ్యం, యాత్రికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. కొండ దిగువన, కొండ ఎగువన కోటయ్య స్వామి సన్నిధిన విస్తృత ఏర్పాట్లు చేయాలి. లక్షలాది మంది భక్తులు సులువుగా స్వామివారిని దర్శించు కొనేందుకు క్యూలైన్‌లు ఏర్పాటు చేయాలి. కొండకు వేలాది వాహనాలు తరలి వస్తాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పెట్లూరివారిపాలెం, అవిశాయపాలెం రహదారుల్లో వాహనాల రాకపోకలు ఉంటాయి. ఈ రహదారులకు అవ సరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలి. ఏటా తిరునాళ్ళ సందర్భంగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపటంలో అధికారులు విఫల మవుతున్నారు.

పొంచి ఉన్న నీటిగండం..

తిరునాళ్ళకు తరలి వచ్చే యాత్రికుల కోసం తాగు నీటి వసతి కల్పించాలి. ఈ దిశగా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాల్సి ఉండగా ఇందుకు జరుగుతున్న ప్రయత్నాలు లేవు. ఈ ఏడాది నీటి గండం పొంచి ఉంది. ఏటా చిలకలూరిపేట మేజర్‌కు సాగర్ నీటిని సరఫరా చేస్తారు. ఈ ఏడాది ఆ పరిస్థితులు కానరావడంలేదు. జలాశయాల్లో నీటి నిల్వలు నిండుకోవడంతో కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే సాగర్ నుంచి నీటి విడుదల చేస్తున్నారు. డ్యాంల నిర్వహణ కేఆర్ఎంబీ చేతుల్లో ఉంది. సాగర్ నుంచి తిరునాళ్ల కోసం నీటిని విడుదల చేయాలంటే ఖచ్చితంగా రివర్ బోర్డు అనుమతి తీసుకోవాల్సిందే. తాగు నీటి అవసరాలకు నీటిని విడుదల చేసే షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించారు. ఏప్రిల్ నెలలో తాగు నీటి అవసరాల కోసం సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తారు. తిరునాళ్ళకు నీటి కోసం కేఆర్ఎంబీ అనుమతి ముందుగానే తీసుకోవాల్సి ఉంది. ఈ అంశం లో సంబంధిత అధికారులు లేఖలు పంపాలి. ముందస్తు అనుమతి తీసుకోకుంటే తిరునాళ్ల జరిగే మార్చి 8 కల్లా నీరు వచ్చే పరిస్థితి ఉండదు. యంత్రాంగం వెను వెంటనే అప్రమత్తం కావాల్సి ఉంది.



తిరునాళ్ల తర్వాత రండి!

- పాత ఈవోనే కొనసాగుతారు
- కోటప్పకొండ ఏసీకి అధికార పార్టీ నేత హుకుం
- జాయినింగ్ రిపోర్టు ఇచ్చినా విధులు చేపట్టనివ్వలేదు
- చేరకుండా తామే అడ్డుకున్నామంటూ వైసీపీ నేత ప్రచారం



ఆ సీట్లో కూర్చోవద్దు.. తిరునాళ్ల తర్వాత రండి.. అప్పటివరకు పాత ఈవోనే కొనసాగుతారంటూ అధికార పార్టీ నేత ఏసీకి హుకుం జారీ చేశారు. నందివెలుగు గ్రూప్ దేవాలయాల ఈవోగా పనిచేస్తున్న నల్లకాలువ శ్రీనివాస రెడ్డి ప్రమోషన్‌పై కోటప్పకొండ దేవస్థానం ఏసీగా నియమితులయ్యారు. ఆయన శుక్రవారం జాయినింగ్ రిపోర్టును దేవస్థాన కార్యాలయంలో అందజేశారు. అయితే అయన విధులు చేపట్టకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకున్నారు. శనివారం కూడా దేవస్థానానికి శ్రీనివాసరెడ్డి వచ్చారు. విధులు చేపట్టవద్దని సదరు నేతలు అడ్డుకోవడంతో అయన కంగుతిన్నారు. చేసేదేమి లేక తన సీట్లో కూర్చోకుండానే వెనుదిరిగారు. కోటప్పకొండలో చక్రం తిప్పుతున్న వైసీపీ నేత ఏసీగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరిస్తే తన అక్రమాలు సాగవని ఏసీని విధుల్లో చేరకుండా అడ్డుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇన్‌ఛార్జ్ ఈవోగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏసీగా ఎస్.శ్రీనివాసరెడ్డి జాయినింగ్ రిపోర్టు ఇచ్చినా నిబంధనలకు విరుద్ధంగా ఈవోను కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోటప్పకొండ తిరునాళ్ల మార్చి 8న జరగనుంది. తిరునాళ్ల పూర్తయ్యేవరకు ఏసీని విధుల్లో చేరకుండా అడ్డుకుంటే తన అక్రమాలకు అడ్డంకి ఉండదనే ఉద్దేశ్యంతోనే ఏసీని విధుల్లో చేరనివ్వడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం కోటప్పకొండలో కూడా అధికార పార్టీ నేతల మితిమీరిన జోక్యం పెరగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరునాళ్ల వరకు ఏసీ శ్రీనివాసరెడ్డి విధుల్లో చేరనిచ్చేది లేదని సదరు నేతలు గొప్పగా ప్రచారం చేసుకుండటం గమనార్హం. తిరునాళ్ల కొనుగోళ్లలో అక్రమాలకు ఇక అడ్డంకి లేకుండా పోతుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



సీఆర్‌జెడ్ పరిధిలో చేపడుతున్న నిర్మాణాలు

రిసార్ట్ ముందు తీరంలో పూర్తి స్థాయిలో చదును చేసిన దృశ్యం

తీరం.. పరాధీనం

- సీఆర్‌జెడ్ పరిధిలో అక్రమ నిర్మాణాలు
- బీచ్ వ్యూ పేరుతో మడచెట్లు తొలగింపు
- నిబంధనలు పట్టని రిసార్ట్స్ నిర్వాహకులు
- క్యాంప్ ఫైర్ పేరిట మందు, చిందు, విందు

చీరాల, ఫిబ్రవరి 10: అధికారుల నిర్లక్ష్యంతో తీరం పరాధీనం అవుతోంది. ప్రశ్నించేవారు లేకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. తీరం వెంట రక్షణగా ఉండాల్సిన మడచెట్లు కనుమరుగవుతున్నాయి. తీరంలో రాత్రి వేళల్లో క్యాంప్ ఫైర్ పేరుతో మందు, చిందు, విందులకు తలుపులు బార్లా తెరిచారు. సీఆర్‌జెడ్, రెవెన్యూ, ఫారెస్ట్, ఔడా, పోలీస్ తదితర శాఖల అధికారులు చేపట్టాల్సిన చర్యలు నామ మాత్రంగా కూడా ఉండటం లేదనే విమర్శలున్నాయి. చీరాల నియోజకవర్గ పరిధిలో ఆహ్లాదం, ఆటవిడుపు కోసం వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం తదితర ప్రాంతాలు టూరిజంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఆ ప్రాంతాల్లోని రిసార్ట్ నిర్వాహకులు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సీఆర్‌జెడ్(కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్) పరిధిలో ఎలాంటి శాశ్వత కట్టడాలు(పైన శ్లాబు వేస్తూ) నిర్మించకూడదు. అయితే కొందరు సీఆర్‌జెడ్ పరిధిలో శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. బీచ్ వ్యూ పేరుతో పర్యాటకులను ఆకర్షించేందుకు మడచెట్లను తొలగిస్తున్నారు. మత్స్యకారులకు వేట నిషేధిత సమయంలో జీవనోపాధి కోసం తీరం వెంట ఉన్న అటవీశాఖ భూములను కేటాయించారు. లీజు పేరుతో ఖరీదు కట్టి రిసార్ట్ నిర్వాహకులు ఆయా స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నారు. కాల గమనంలో రిసార్ట్ ఒకటి తర్వాత ఒకటిగా వెలు

లీజు పేరుతో స్థలాలు స్వాధీనం

స్తున్నాయి. పర్యాటకులను ఆకర్షించేందుకు పోటీపడి వనరులు, వసతులు సమకూరుస్తున్నారు. అందులో కొందరు నిబంధనలను అతిక్రమిస్తున్నారు. రాత్రి వేళల్లో క్యాంప్ ఫైర్ల పేరుతో తీరంలో ఓపెన్ బార్లను తలపిస్తూ, నిప్పుల నెగడుల మధ్య టేబుల్స్ వేసి మద్యం తాగేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్న, చిన్న ఫంక్షన్లు, పార్టీల పేరుతో అర్ధరాత్రి వరకు మందు, చిందు, విందులతో పలుచోట్ల గానాబజానాలు బహిరంగంగా జరుగుతున్నాయి. రిసార్ట్స్‌ల్లో ఏ ఒక్కరికి కూడా పూర్తిస్థాయిలో అనుమతులు లేవని సమాచారం. అయితే కొన్నింటికి మాత్రం పాక్షిక అనుమతులు ఉన్నట్లు సమాచారం. వాస్తవానికి రెవెన్యూ, ఫారెస్ట్, సీఆర్‌జెడ్, ఔడా, పోలీస్ అనుమతులు తప్పనిసరి. అందులో ఆయా శాఖలకు సంబంధించి అప్పుడప్పుడు మొక్కుబడిగా నోటీసులు ఇవ్వటం తప్పించి క్షేత్రస్థాయిలో నిబంధనలను అమలు పరచడంలో విఫల మవుతున్నారు. అదేమని ఎవరన్నా అడిగితే తమకు ప్రాక్టికల్ ప్రాబ్లమ్స్ చాలా ఉంటాయి.. అర్థం చేసుకోండని అంటున్నారు.



తీరంలో చెట్లను కొట్టివేయటంతో ఖాళీగా ఉన్న ప్రదేశం

అపశ్రుతులు.. ప్రమాదాలు

తీరంలో నానాటికీ అపశ్రుతులు పెరుగుతున్నాయి. ప్రధానంగా పర్యాటకులు సముద్ర స్నానాలకు దిగినపుడు కొన్ని సందర్భాల్లో అలల్లో చిక్కుకుని మృత్యువాత పడుతున్నారు. దీనికి సంబంధించి అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెప్తున్నా ప్రమాదాలు జరగటం మాత్రం ఆగటం లేదు.

అమ్మకానికి ఊర చెరువు

- తాజాగా మరో రెండు ఎకరాల్లో ప్లాట్లు
- చెరువు కట్టను జరిపి మరీ ఆక్రమణలు
- అధికారుల బదిలీతో అమ్మకాలు వేగవంతం
- అధికారమే పెట్టుబడిగా వైసీపీ నేతల ఆక్రమణలు

- ఇప్పటికే 35 ఎకరాల ఆక్రమణ



ఊరచెరువును ఆక్రమించి ఇళ్ల స్థలాలుగా మారుస్తున్న ప్రాంతం

అద్దంకి, ఫిబ్రవరి 10: అధికారం ఉంది.. అడిగేవారు లేరు.. వైసీపీ నేతలు చెలరేగిపోతున్నారు. ఏకంగా చెరువులోనే పాగా వేసేశారు. దీంతో అద్దంకి పట్టణంలో అంతర్భాగమైన ఉత్తర అద్దంకి రెవెన్యూ 95 సర్వే నెంబరులోని ఊర చెరువు ఆక్రమణలతో కుదించుకుపోయింది. అయినా అధికార పార్టీ నేతలు ఈ చెరువును మరింతగా ఆక్రమించేశారు. దీంతో సుమారు 125 ఎకరాల విస్తీర్ణంలోని ఊరచెరువు నానాటికీ కనుమరుగవుతోంది. మూడు దశాబ్దాల క్రితం నుంచి పలు సందర్భాలలో సుమారు 35 ఎకరాల వరకు చెరువు ఆక్రమణకు గురై ఏకంగా పెద్దకాలనీ ఏర్పడింది. 20వ వార్డులో 90 శాతం గృహాలు చెరువును ఆక్రమించి ఉన్నవే అంటే ఆశ్చర్యం కాదు. అవకాశం వచ్చిన ప్రతిసారి ఆక్రమణదారులు కొంతమేర చెరువును ఆక్రమించడం సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది. ఊరచెరువు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి గత ఏడాది నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఎన్టీఆర్ కాలనీ వైపు ఆక్రమణలు పోను మిగిలిన భాగంలో కట్ట ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే, కట్ట ఏర్పాటు సమయంలోనే స్థానిక వైసీపీ నేతలు చక్రం తిప్పి సుమారు 2 ఎకరాల వరకు వదిలేసి కాలనీకి దూరంగా కట్ట వేయించారు.



ఆక్రమించిన భూమిలో ఏర్పాటు చేసిన హద్దురాళ్లు

అప్పట్లోనే దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చినా అధికారులు పట్టించుకోలేదు. కట్టను వంకరగా తిప్పి తాము ఆక్రమించిన స్థలాన్ని వదిలేసి నిర్మాణం చేయిస్తున్నారు. కట్టను దూరంగా వేయించడంతో ప్రస్తుతం ఆక్రమణలకు మరింత సులువుగా మారింది. ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ అధికారుల బదిలీతో ఆక్రమణదారులు ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్మకాలు చేపట్టడం వేగవంతం చేశారు. కొత్త అధికారులు కుదుటపడే లోపే అమ్మకాల పనిని చక్కబెట్టుకునే పనిలో వైసీపీ నేతలు నిమగ్నమయ్యారు. అయితే, మొత్తం ఒకేసారి ప్లాట్లుగా వేస్తే అలజడి వస్తుందని డబ్బులు ఇచ్చిన వ్యక్తులకు ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేస్తున్నారు. ఒక్కో ప్లాటును రెండు నుంచి మూడు సెంట్లుగా వేసి రూ.రెండున్నర లక్షల నుంచి రూ.4 లక్షల చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. ఆక్రమిత భూమి ద్వారా సుమారు రెండున్నర కోట్ల నుంచి మూడు కోట్ల రూపాయలు సొమ్ము చేసుకునే పనిలో సదరు నేత నిమగ్నమయ్యారన్న విమర్శలున్నాయి. చెరువు భూమి ఆక్రమించి ప్లాట్లుగా వేసి అమ్మకాలు చేస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి.

చర్యలు చేపడతాం

ఊరచెరువులో ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందిని పంపించి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. - షేక్ మహబూబ్ సుభాని, తహసీల్దార్

జగనన్న ప్లాట్.. రూ.50 వేలు

చేతులు మారిన రూ.50 లక్షలు?

- వేటపాలెం తహసీల్దారు కార్యాలయంలో పైరవీలు
- స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు పలువురు సిద్ధం

వేటపాలెం(చీరాల), ఫిబవరి 10: ప్రతీ పనికో రేటు.. పైసలు ఇస్తేనే పనులు.. వేటపాలెం తహసీల్దార్ కార్యాలయంలో పైరవీకారుల రాజ్యం నడుస్తుందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రూ.50 వేలు ఇస్తే జగనన్న కాలనీల్లో నివేశన స్థల పట్టా పొందవచ్చనే సారాంశంతో ఓ ఆడియో తాజాగా సోషల్ మీడియాలో హల్‌చల్ అవుతోంది. ఆ ఆడియోలో ధనుంజయ్ అనే వ్యక్తి అవతలి వ్యక్తితో మాట్లాడుతూ గతంలో రూ.20 వేలు చెప్పారు.. తర్వాత రూ.30 వేలు అన్నారు.. ఇప్పుడు ఏకంగా రూ.50 వేలు అంటున్నారు. ధర ఏమైనా తగ్గుతుందా అని అడగటం, అవతలి వ్యక్తి అందరం పంచుకోవాలి... అధికారికే రూ.30 వేలు ఇవ్వాలి.. కాబట్టి ధర తగ్గదని చెప్పడం జరిగింది. ఈ ఆడియోపై మండల పరిధిలో జోరుగా చర్చ నడుస్తోంది. ఇదిలా ఉంటే జనన సర్టిఫికెట్లకు సంబంధించి కూడా డబ్బు వసూలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని కొణిజేటి చేనేతపురి, కొణిజేటినగర్, జగనన్న కాలనీల్లో కొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఓ మధ్యవర్తి ద్వారా ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకునేందుకు రెవెన్యూ యంత్రాంగంలో కొందరు పావులు కదిపారు. ఒక్కో పట్టాకు రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని అబ్దుల్ కలామ్‌కాలనీలో కూడా నగదు తీసుకుని పలువురికి పట్టాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. వంద పట్టాలకు సుమారు రూ.50 లక్షలు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో కొందరు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లుతెలిసింది.

జనన సర్టిఫికెట్లకూ వసూళ్లు

జనన సర్టిఫికెట్ లేనివారు అది కావాలంటే ఓ మధ్యవర్తిని ఆశ్రయిస్తే పని పూర్తి అవుతుంది. అతడు తాను వసూలు చేసిన నగదును ఏ సీటుకు ఎంతివ్వాలో అంతిచ్చి సర్టిఫికెట్‌ను దరఖాస్తుదారులకు అందజేస్తున్నట్లు కార్యాలయానికి వచ్చేవారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఉన్నతాధికారులు తహసీల్దార్ కార్యాలయంపై దృష్టి సారించి విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు అంటున్నారు.

ఎస్ఎస్ ట్యాంకులో 20 అడుగుల నీరు

బాపట్ల, ఫిబ్రవరి 10: డెడ్‌స్టోరేజికి చేరిన బాపట్ల పట్టణ సమ్మర్‌స్టోరేజి(ఎస్ఎస్) ట్యాంక్‌ను ఎట్టకేలకు 20 అడుగుల నీటితో నింపారు. నాలుగు రోజులుగా రాత్రి పగలు 17 ఇంజన్లతో పీటీ చానల్ కాల్వ నీటిని ఎస్ఎస్ ట్యాంక్‌లోకి తరలిస్తున్నారు. దీంతో 24 అడుగుల సామర్థ్యం కలిగిన చెరువులో 20 అడుగుల వరకు నీటిని నింపారు. ఇంకా నీటిని పంపింగ్ చేస్తున్నారు. అయినా రోజుమార్చి రోజు మాత్రమే పట్టణ వాసులకు తాగునీటిని సరఫరా చేయగలమని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. రోజుమార్చి రోజు వచ్చే నీరు చాలక పట్టణవాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది నవంబరులో కాల్వలకు నీరు వచ్చినప్పుడు చెరువును నింపారు. ఆ తర్వాత నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని నీరు విడుదల చేయకపోవడంతో చెరువులో నీరు అడుగంటి తాగునీటి సమస్య తలెత్తింది. ప్రస్తుతం నింపిన నీటితో మూడు నెలలు తాగునీటి అవసరాలు తీర్చుకోవచ్చు. ఏప్రిల్‌లో నీరు రాకపోతే పరిస్థితి ఏమిటని అధికారులు ఆలోచనలో పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న నీటిని రోజు మార్చి రోజు సరఫరా చేయాలని ఆలోచన చేస్తున్నారు. ఏప్రిల్‌లో మరోసారి కాల్వలకు నీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు హామీ ఇస్తే ప్రతిరోజు తాగునీటిని సరఫరా చేస్తామని, లేకుంటే రోజుమార్చి రోజు నీటిని అందిస్తామని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్ల వారు డబ్బులు పోసుకుంటున్నారు. క్యాన్ వాటర్‌కి గిరాకీ పెరిగింది.



ట్యాంక్‌లో నీటి పరిమాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కె.రామచంద్రారెడ్డి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

మెప్మాలో రుణ దోపిడీపై విచారించాలి

కలెక్టర్‌కు టీడీపీ నాయకుల వినతి

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 10 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో జరిగిన రుణ దోపిడీపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కలెక్టర్ దినేష్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు శనివారం వినతిపత్రం సమర్పించారు. కొందరు వైసీపీ నాయకులు మెప్మాలో బోగస్ గ్రూపులను సృష్టించి బ్యాంకులను బురిడీ కొట్టించి రూ.కోట్లు బొక్కేశారని వారు ఆరోపించారు. అధికార పెత్తనంతో మెప్మా ఉద్యోగులపై ఒత్తిడి పెంచి ఈ వ్యవహారానికి పాల్పడినట్లు తెలుస్తున్నదన్నారు. అవినీతి జరిగినట్లు మేయర్ గంగాడ సుజాత కూడా మీడియా ముందే ఒప్పుకున్నారని వారు వివరించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిధులను స్వాహా చేసిన వైసీపీ నాయకులతోపాటు వారికి సహకరించిన ఆర్పీలు, సీవోలు, ఇతర ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ పరిశీలించి విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎద్దు శశికాంత్ భూషణ్, మదన్, పెళ్లూరు చినవెంకటేశ్వర్లు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అనిశ్చితికి తెర!

ఎస్పీగా రేపు బాధ్యతలు స్వీకరించనున్న పరమేశ్వరరెడ్డి

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 10 : జిల్లా ఎస్పీ ఎవరు అన్న విషయంలో పది రోజులుగా నెలకొన్న అనిశ్చితికి తెరపడింది. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పరమేశ్వరరెడ్డి ఎస్పీగా సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ పనిచేస్తున్న మలికగర్గ్‌ను తిరుపతికి, అక్కడ పనిచేస్తున్న పరమేశ్వరరెడ్డిని మన జిల్లాకు బదిలీ చేస్తూ కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే అధికార పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడం, ఇతరత్రా కారణాలతో వీరి బదిలీ తాత్కాలికంగా నిలిచిపోయింది. అదేసమయంలో వారం క్రితం ఏర్పాటు చేసిన ఎస్పీ మలికగర్గ్‌కు వీ డ్కోలు కార్యక్రమం కూడా వాయిదా పడింది. అంతలోనే శాసనసభ సమావేశాలు ప్రారంభం కావడంతో ఎవరి స్థానాల్లో వారు ఉండిపోయారు. అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం ఎస్పీలను మరోచోటకు బదిలీ చేయాలంటే ఈసీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. దీంతో ముందుగా ఇచ్చిన ఉత్తర్వులనే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఇక్కడ ఎస్పీగా పరమేశ్వరరెడ్డి, తిరుపతి ఎస్పీగా మలికగర్గ్ సోమవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

పది మంది ఎస్సైలకు అటాచ్‌మెంట్

ఎస్పీ మలికగర్గ్ ఉత్తర్వులు

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 10 : జిల్లాలో ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న పది మంది ఎస్సైలకు అటాచ్‌మెంట్‌లు ఇస్తూ ఎస్పీ మలికగర్గ్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎం.దేవకుమార్‌ను సంతనూతలపాడు, ఎం.అనితను అర్ధవీడు, జి.కోటయ్యను పొదిలి, బి.ప్రేమకుమార్‌ను సి.ఎస్.పురం ఎస్సైలుగా నియమించారు. పి.నాగేశ్వరరావు, బి.బాలునాయక్, టి.వెంకటేశ్వరరావులను సీసీఎస్, ఆర్.ఎం.విజయకుమార్‌ను ఒంగోలు ట్రాఫిక్, సిహెచ్.రాజ్యలక్ష్మి, పి.వెంకటేశ్వర్లులను దిశ పోలీసు స్టేషన్‌లకు బదిలీ చేశారు.

జగన్‌రెడ్డి అరాచకాలకు చెల్లు

- మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర
- వైసీపీని వీడి ఆయన సమక్షంలో 15 కుటుంబాల చేరిక

కనిగిరి, ఫిబ్రవరి 10: జగన్‌రెడ్డి అరాచకాల కు ఇక చెల్లు పడనుంచి మాజీ ఎమ్మెల్యే, టీ డీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారె డ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యువగళం పే రుతో నారా లోకేష్ చేపట్టిన యాత్ర ప్రజల్లో చై తన్యం నింపిందన్నారు. అదేవిధంగా వైసీపీ అ రాచకాలకు వ్యతిరేకంగా లోకేష్ సమరశంఖారావం పూరించనున్నారన్నారు. జగన్‌రెడ్డి దౌర్జన్యాలను ప్రజలకు తెలియ చేసేందుకు ప్రతి రోజు మూడు నియోజకవర్గాలను పర్యటించేందుకు సిద్ధమవుతున్నారన్నారు. రానున్న 40 రోజుల్లో 120 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో లోకేష్ పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంతో ప్రజలు మరింత చేరువవుతారన్నారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. జగన్‌రెడ్డి దుశ్చర్యతోనే వైసీపీపై ప్రజా వ్యతి రేకత మరింత ఎక్కువైందన్నారు. అక్రమ అరెస్టులకు టీడీపీ బెదరబోదన్నారు. సమావేశంలో శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, రాచమల్ల శ్రీనివాసులురెడ్డిచ, తమ్మినేని వెంకటరెడ్డి, బుల్లా బాలబాబు, అహ్మద్, గుడిపాటి ఖాదర్, నంబులు కొండయ్య, చెన్నయ్య ఇలియాజ్, కాసుల శ్రీ రాం, ఏనుగు శ్రీనివాసులు, అచ్చాల రవి, మూ లె బ్రహ్మారెడ్డి, రిజ్వాన్, షరీఫ్ తెలుగు మహిళలు కరణం అరుణ, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, అమ్ములమ్మ పాల్గొన్నారు.

కనిగిరికి పరిశ్రమలు తీసుకొస్తా

కనిగిరి ప్రాంతానికి ఫార్మా కంపెనీతో పాటు పరిశ్రమలూ తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని పాతూరు బొడ్డురాయి వీధిలో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రాన్ని జగన్ దోచుకుంటే, కనిగిరిలో సహజ సంపదను వైసీపీ నేతలు దోచుకునే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం చంద్రబాబు దృష్టికి ఈ ప్రాంత ప్రధాన సమస్యలను చెప్పడంతోపాటు కచ్చితమైన హామీని తీసుకున్నానన్నారు. తాను గెలిచాక సమస్యల పరిష్కారం తప్ప మరో పని ఉండదన్నారు. కులం, మతం అంటూ అభ్యర్థులను ఎన్నుకొని అభివృద్ధికి అవరోధంగా మారొద్దన్నారు. పనిచేసే స్థానిక నాయకుడినే ఎన్నుకోవాలన్నారు. తాను ఎమ్మెల్యేగా చేసిన కాలంలో చేసిన అభివృద్ధికి సాక్ష్యాలు, వాటి ఫలాలు ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బొడ్డురాయి స్థానంలో దేవాలయం నిర్మిస్తామ ని, ఈ ప్రాంత వాసులకు శ్మశానవాటిక ఏర్పాటు చేయిస్తామని ఉగ్ర హామీ ఇచ్చారు.

వైసీపీని వీడిన 15 కుటుంబాలు

వైసీపీని వీడి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో పాతూరుకు చెందిన 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వా రికి డాక్టర్ ఉగ్ర పార్టీ కం డువాలు వేసి సాదరంగా ఆ హ్వానించారు. ఈ సంద ర్భంగా పాతూరులో పర్యటించిన ఉగ్రకు స్థానికులు బ్రహ్మారథం పట్టారు. పూలతో, మేళతాళాల నడుమ ఆయన ఘన స్వాగతం పలికారు. ఈ సమయంలో డాక్టర్ ఉగ్ర ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సమస్యలను ప్రధానంగా ఉగ్ర ఎదుట పాతూరు వా సులు ప్రస్తావించారు. ఎన్నికల అనంతరం మంచినీటి సమస్యను పూ ర్తిగా పరిష్కరిస్తామని ఉగ్ర హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అప్పుడే అధినేత చంద్రబాబు వద్ద సమస్యల పరిష్కారానికి, నిధులు రాబట్టేందుకు వీలుంటుందన్నారు. ఆయన వెంకట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో చీర్ల నాగార్జునయాదవ్, చింతం బాలకృష్ణయాదవ్, చింతం కిరణ్‌కుమార్ యాదవ్, చీర్ల హ రికృష్ణయాదవ్, పాశం వెంకటరావుయాదవ్, చెన్నుబోయిన దీన్‌దయాళ్‌యాదవ్, పాశం నా గేంద్రయాదవ్, ముడియం శివయాదవ్, షేక్ నాయబా, దిబ్బమడుగు భరత్‌కుమార్‌యాదవ్, పఠాన్ ఖాదర్‌ఖాన్, మస్తాన్, దగ్గు సా యిరాం, నూలక బార్గవ్, దుగ్గిలి పవన్‌కుమార్ కుటుంబాలు టీడీపీలో చేరాయి.


చేరికల అనంతరం జరిగిన సభలో మాట్లాడుతున్న ఉగ్ర

రూ.కోట్లకు 'టెండర్'



- ఒంగోలులో వైసీపీ నేతల పన్నాగం
- ఇళ్ల పట్టాలకు ఎంపిక చేసిన భూముల చదును పేరుతో భారీగా స్వాహాకు ప్రయత్నం
- టెండర్లు ఖరారు కాకుండానే పనులు వేగవంతం
- ఇక్కడి వారిని కాదని తెలంగాణ కంపెనీకి కట్టబెట్టేందుకు ఉత్సాహం
- అప్పులతో చేసే పనులు తమకు, ఆదాయం వచ్చే వాటికి వేరొకరా.. అంటున్న స్థానిక కాంట్రాక్టర్లు
- పనులు దక్కుతాయని ఆశించి భంగపడిన కార్పొరేటర్లు

ఒంగోలులో పేదలకు ఇళ్ల పట్టాల కోసం కేటాయించిన భూముల అభివృద్ధి పేరుతో భారీగా నిధులు బొక్కేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. రూ.కోట్లు కొల్లగొట్టేందుకు పావులు కదుపుతున్నారు. అర్హత లేని కంపెనీలతో టెండర్లు వేయించి మొక్కుబడిగా పనులు పూర్తి చేయించే పనిలో నిమగ్నమయ్యారు. నిబంధనల మేరకు టెండర్లు ఖరారైన తర్వాతనే పనులు చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ పూర్తికాకుండానే ఆగమేఘాల మీద పనులు చేపట్టడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు కొందరు అభ్యంతరం తెలిపినా వైసీపీ నేతలు పట్టించుకోకుండా 'చెప్పింది చేయండి' అంటూ హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఓ అధికారిని బదిలీ చేయించేందుకు కూడా రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. మొత్తం మీద ఈ వ్యవహారంపై అధికారులు నోరుమెదపలేకపోతుండగా, తమకు తలా ఒకపని అయినా కేటాయిస్తారని భావించిన వైసీపీ కార్పొరేటర్లకు ఆశాభంగం ఎదురైంది.

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 10 : ఒంగోలులో 25వేల మందికి నివేశన స్థల పట్టాలు ఇచ్చేందుకు ఎన్.అగ్రహారం, చినమల్లేశ్వరపురం, వెంగముక్కపాలెం వద్ద 435 ఎకరాల భూమిని ఇటీవల ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందుకోసం రూ.126.34 కోట్లు వెచ్చించింది. ఆ భూముల్లో హద్దురాళ్లు, రోడ్ల ఏర్పాటు, క్వారీ రబ్బిష్‌తో చదును, జంగిల్ క్లియరెన్స్ తదితరాలకు సంబంధించి 12 పనులకు సుమారు రూ.21.33 కోట్లు మంజూరు చేసింది. దీనికి వారం క్రితం టెండర్లు పిలిచారు. అయితే జంగిల్ క్లియరెన్స్, హద్దురాళ్ల ఏర్పాటు పనులకు ఇంతవరకూ ఒక్క టెండర్ కూడా దాఖలు కాలేదు. క్వారీ రబ్బిష్ తోలకం, రోడ్ల ఏర్పా టు, కల్వర్టులు తదితరాలకు సంబంధించిన పది పనులకు మూడు కంపెనీలతో వైసీపీ నాయకులు టెండర్లు వేయించినట్లు సమాచారం. అందులో తెలంగాణకు చెందిన ఒక కంపెనీకి పనులు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. మిగిలిన రెండు కంపెనీలతో డమ్మీలుగా వేయించినట్లు తెలుస్తోంది. రివర్స్ టెండరు ప్రకారం ఒకరికి పనులు కేటాయించడానికి లేదు. కనీసం ఇద్దరికి అర్హత ఉండాలి. అయితే ఇక్కడ వైసీపీ పెద్దలు వారికి కూడా అర్హత ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. దీంతో చేసేదేమీ లేక ఇక్కడి అధికారులు ఆ ఫైల్‌ను ఎస్ఈ ఆమోదం కోసం పంపగా తిరస్కరించిన ట్లు తెలిసింది. దీంతో కొద్దిరోజుల క్రితం రెండోసారి టెండర్లు ఆహ్వానించారు. ఇప్పటి వరకూ అవి ఖరారు కాలేదు.

తెలంగాణ కంపెనీతో లోపాయికారీ ఒప్పందం

నేరుగా పనులు చేపడితే ప్రజల్లో విమర్శలు వచ్చే అవకాశం ఉన్నందున. తమకు అనుకూలమైన తెలంగాణ కంపెనీతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్న వైసీపీ నేతలు వారిచేత ఇక్కడ టెండర్ వేయించారు. దీంతోపాటు మరో రెండు డమ్మీ కంపెనీలను కూడా రంగంలోకి దించి ఎలాగైనా పనులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. క్వాలిటీ కంట్రోల్‌తో సంబంధం లేని క్వారీ రబ్బిష్ తోలకం, రోడ్ల ఏర్పాటు, జంగిల్ క్లియరెన్స్, హద్దురాళ్లు వేయడం వంటి పనులన్నీ కూడా లాభం వచ్చేవే. వాస్తవానికి క్వారీ రబ్బిష్ క్యూబిక్ మీటర్‌కు కాంట్రాక్టర్‌కు రూ.400 ఖర్చు అవుతుండగా, ఇక్కడ మాత్రం క్యూబిక్ మీటర్‌కు వెయ్యి రూపాయలకు పైనే కోట్ చేసినట్లు సమాచారం. పనులన్నీ ఒకటిన్నర నెలలోనే పూర్తి చేసి బిల్లులు దక్కించుకోవాలన్న వ్యూహంతో వైసీపీ నేతలు ముందుకు సాగుతున్నారు.

అధికారులపైన ఒత్తిడి

అందిన సమాచారం మేరకు రూ.22 కోట్లకు పనులు ప్రతిపాదించగా అందులో సగం వరకూ లాభం చేకూరుతుంది. దీంతో టెండర్లు ఖరారు కాకుండానే పనులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీనిపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల ఉల్లంఘనపై అభ్యంతరం తెలిపిన అధికారులపైనా ఒత్తిడి పెరగడమేకాకుండా వారిని మార్చేసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్లు సమాచారం.

ఇక్కడి కాంట్రాక్టర్‌లను కాదని పొరుగు రాష్ట్రం వారికి

గతంలో కార్పొరేషన్ పరిధిలో ఏ అభివృద్ధి పనిచేసినా ఇక్కడి కాంట్రాక్టర్లను అవకాశం ఉండేది. కొద్ది నెలల క్రితం బిల్లులు పెండింగ్ ఉండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ససేమిరా అన్నారు. దీంతో అటు అధికారులు, ఇటు పాలకులు వారితో సమావేశం ఏర్పాటు చేసి మరీ పనులు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే చేపట్టిన పనులకు సుమారు రూ.25 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్ ఉన్నాయి. అయితే జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ పనులకు సంబంధించి మాత్రం ప్రభుత్వం ముందుగానే నిధులు విడుదల చేసింది. అవి పూర్తి చేసిన వెంటనే డబ్బులు వస్తాయి. దీంతో ఒంగోలుకు చెందిన కాంట్రాక్టర్లను కాదని, తెలంగాణలోని తమకు అనుకూలమైన వారికి టెండరు దక్కించేందుకు పాలకులు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్థానిక కాంట్రాక్టర్లలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. అప్పులతో చేసే పనులకు తమను ఉపయోగించుకుని, లాభాలు వచ్చే వాటికి నేరుగా అధికార పార్టీ పెద్దలే బినామీలతో చేయడం ఎంతవరకు సబబు అని వాపోతున్నారు.

గుర్రుగా ఉన్న వైసీపీ కార్పొరేటర్లు

పేదలకు పట్టాల పంపిణీ కోసం ప్రతిపాదించిన భూముల అభివృద్ధి పనుల్లో తమకి ఎంతోకొంత న్యాయం జరుగుతుందని అధికార పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు ఆశించారు. తలా ఒక పని కేటాయిస్తారు. నిధులకు దిగుల్లేదు. ఒక్కొక్కరికి లక్షల్లోనే లాభాలు వస్తాయని సంతోషించారు. అయితే ఆపనులు ఇక్కడ ఎవరికీ కాకుండా పొరుగు రాష్ట్రానికి చెందిన కంపెనీకి కట్టబెట్టేలా పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకోవడంపై పలువురు గుర్రుగా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల విజయవంతం కోసం అన్నీ తామే భుజాన వేసుకుని చేస్తుంటే పేదల పట్టాల పనుల్లో తమకు తీవ్ర అన్యాయం చేశారని కొంత మంది కార్పొరేటర్లు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులను వివరణ కోరగా వారెవ్వరూ సమాధానం ఇవ్వలేదు.

ఎన్నికల ప్రచారంలా ఆసరా చెక్కుల పంపిణీ

- కచ్చితంగా హాజరు కావాలని డ్వాక్రా సభ్యులపై ఒత్తిడి
- లేకుంటే ఖాతాల్లో నగదు పడదని బెదిరింపు
- నేతలు ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన మహిళలు


కార్యక్రమం మధ్యలో వెళ్లిపోతున్న మహిళలను ఆపుతున్న సీసీలు, వీవోఏలు

పీసీపల్లి, ఫిబ్రవరి 10 : పీసీపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీ వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలా సాగింది. ఏపీఎం సత్యానందం ఆధ్వర్యంలో 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీని నిర్వహించారు. డ్వాక్రా మహిళలు భారీగా తరలిరావాలంటూ రెండు రోజులుగా వీవోఏల ద్వారా ఇంటింటికీ తిరిగి చెప్పించారు. అయినా పలుగ్రామాల్లోని మహిళలు ఆసక్తి చూపలేదు. దీంతో కార్యక్రమానికి రాని వారి ఖాతాల్లో ఆసరా నగదు జమకాదంటూ ప్రచారం చేయించారు. శనివారం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అధికారులతోపాటు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం కొనసాగినంతసేపు వైసీపీ పార్టీని, ముఖ్యమంత్రిని పొగడ్తల ముంచెత్తారు. వారి మాటలు విని విసిగివేసారిన మహిళలు ఇది ప్రభుత్వ కార్యక్రమమా లేక పార్టీ కార్యక్రమమా అంటూ చర్చించుకున్నారు. కొంతమంది మహిళలు కార్యక్రమం పూర్తికాకముందే వెనుదిరిగి వెళ్లడంతో సీసీలు, వీవోఏలు బతిమలాడి వారిని కూర్చోపెట్టారు. కొందరు మాత్రం వెళ్లిపోయారు. వీవోఏలు ఒత్తిడి తెచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో మహిళలు రాకపోవడంతో టెంట్‌కింద వేసిన కుర్చీలు ఖాళీగా కనిపించాయి.

బుర్రా వర్గీయులు దూరం

కనిగిరి ఎమ్మెల్యే బుర్రాను తప్పించి నియోజకవర్గ ఇన్‌చార్జిగా దద్దాలకు బాధ్యతలు అప్పగించడంపై అసంతృప్తితో ఉన్న మధుసూదన్ వర్గీయులు పలువురు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరు కాలేదు. మురుగుమ్మి, అలవలపాడు, గుదేవారిపాలెం ఎంపీటీసీ సభ్యులతోపాటు మండల సచివాలయ కన్వీనర్, వ్యవసాయ సలహా సంఘం సభ్యులు, పలు గ్రామాలకు చెందిన మరికొంతమంది వైసీపీ నాయకులు గైర్హాజరయ్యారు. వైసీపీ మండల అధ్యక్షుడు వీరికి ఫోన్లు చేసి ఆహ్వానించినా వేరే పనులు ఉన్న కారణంగా కార్యక్రమానికి రాలేకపోతున్నామని చెప్పినట్లు తెలిసింది.


కనిగిరిలో కూర్చునే అవకాశం లేక చెట్ల కింద నిల్చున్న వృద్ధులు, మహిళలు

కనిగిరిలో డ్వాక్రా మహిళల అవస్థలు

కనిగిరి : ఆసరా చెక్కుల పం పిణీ కా ర్యక్రమం డ్వాక్రా మమహిళలను అవస్థలకు గురి చేసింది. ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో శనివారం నాల్గో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి స్వ యం సహాయక సంఘాల మహిళలు రావాల్సిందేనని మెప్మా, వైకేపీ అధికారులు హుకుం జారీ చేశారు. చేసేది లేక కనిగిరి మండలంలో ని వివిధ గ్రామాల నుంచి, పట్టణంలోని 20 వార్డుల నుంచి మహిళలు హాజరయ్యారు. అ యితే అధికారులు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవ్వడంతో చంటి పిల్లలతో సహా వచ్చిన మహిళలు ఇబ్బందులు పడ్డారు. కాగా కా ర్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం హాజరుకావల్సిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ హాజరుకాలేదు. పార్టీ ఇన్‌చార్జి మార్పుతో ఆయన పత్తాలేకుండా పోతున్నారు.


మద్యం దుకాణానికి సమీపంలో మఫ్టీలో గస్తీ నిర్వహిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

పీసీపల్లిలో ఎస్ఈబీ నిఘా

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పీసీపల్లి, ఫిబ్రవరి 10 : పీసీపల్లిలోని ప్రభుత్వ మద్యం షాపులపై ఎస్ఈబీ అధికారులు నిఘా పెట్టారు. నెలరోజుల వ్యవధిలో మద్యం షాపులో పనిచేస్తున్న ఇద్దరు సూపర్‌వైజర్‌లు అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తూ ఎస్ఈబీ అధికారులకు పట్టుబడ్డారు. దీనిపై కేసులు న మోదుచేసి నిందితులను రిమాండ్‌కు తరలించినా సేల్స్‌మేన్‌లు, సూపర్‌వైజర్‌లలో ఎటువంటి మార్పు రాలేదు. తిరిగి యథావిధిగా ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై అదనంగా నగదును వసూల చేస్తూ బెల్టు దుకాణా లకు బాటిళ్లను తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. శనివారం ఆంధ్రజ్యోతిలో మేమింతే..మారమంతే..రెచ్చిపోతున్న మద్యం మాఫియా అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎస్ఈబీ అధికా రుల ఆ దేశాలతో సిబ్బంది ఉదయం 5గంటలకే పీసీపల్లి చేరుకుని బెల్టుషాపు నిర్వాహకుల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. రాత్రి వరకు పీసీపల్లి వైన్‌షాప్‌నకు సమీపంలోనే ఉండి మద్యం కొనేవారిపై నిఘా ఉంచారు.

కనిగిరి నుంచి అరుణాచలానికి బస్సు

పామూరు, ఫిబ్రవరి 10 : మాఘ పౌర్ణమి సందర్భంగా కనిగిరి నుంచి అరుణాచలానికి బస్సు 22వ తేదీ (గురువారం రాత్రి) బయలుదేరుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ బీ శ్రీమన్నారాయణ తెలిపారు. కనిగిరి డిపో నుంచి గురువారం బయలుదేరే ఈ బస్సు శుక్రవారం కాణిపాకం, తిరుపతి, కంచి దేవాలయాల మీదుగా శనివారం వేకువజామున 2 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అక్కడ ఉదయం నుంచి గిరి ప్రదర్శన అనంతరం తిరుగు ప్రయాణంలో గోల్డెన్ టెంపుల్, శ్రీకాళహస్తి దేవస్థానాలను దర్శించుకొని ఈనెల 25వ తేదీ మధ్యాహ్నానికి కనిగిరికి చేరుకుంటుందని వివరించారు. రూ.2,200 టికెట్ ధర నిర్ణయించామని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ కోరారు.

ఆర్థిక సంఘం నిధులపై ఆంక్షలు

- పంచాయతీల ఖాతాల్లో నగదు ఉన్నా డ్రా చేసుకోలేని పరిస్థితి
- బిల్లులకు ట్రెజరీల్లో లభించని ఆమోదం
- పాలకవర్గాల్లో ఆందోళన
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై సర్పంచ్‌ల ఆగ్రహం



ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 10 : గ్రామ పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధుల వినియోగంపైనా ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీంతో పాలకవర్గాలు పనులు చేయలేని దుస్థితి ఏర్పడింది. ఫిబ్రవరిలోనే ట్రెజరీల్లో బిల్లులపై ఫ్రీజింగ్ విధించడంతో ఈపరిస్థితి నెలకొంది. ఇప్పటికే అనేక గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు వివిధ రకాల అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక సంఘం నిధులపైనా ఆంక్షలు విధించడంపై సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత నెలలో రూ.38కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల

కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని గ్రామ పంచాయతీలకు గత నెలలో సుమారు రూ.38 కోట్లకుపైగా ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. వాటితో ఇప్పటి వరకూ జరిగిన పనులకు బిల్లులు మంజూరు చేయడంతోపాటు అత్యవసర పనులు చేపట్టే అవకాశం ఉంది. అయితే ఈఏడాది మార్చి ఆఖరుతో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆర్థిక సంవత్సరం ముగింపులో ప్రభుత్వం అన్ని రకాల బిల్లులపై ఆంక్షలు విధించడం సర్వసాధారణం. కానీ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుంచే ఉద్యోగుల జీతాల బిల్లులు మినహా ఇతర అన్నింటిపై ఆంక్షలు విధించింది. పంచాయతీ సమావేశంలో తీర్మానం చేసిన బిల్లులకు కూడా ట్రెజరీ ల్లో ఆమోదం లభించకపోవడంతో పాలకవర్గాల్లో ఆందోళన నెలకొంది.

అత్యవసర పనులూ చేయలేని పరిస్థితి

సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తుండటం, వేసవి తరుముకొస్తుండటంతో ఏదైనా అత్యవసర పనులు చేసుకొనేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు సమాంతరంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి పాలకవర్గాలను నిర్వీర్యం చేసింది. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను కూడా లాగేసుకుంటోంది. దీన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు ఆందోళలు చేపట్టినా పట్టించుకోలేదు. ఇదే సమయంలో పంచాయతీలకు వచ్చిన నిధులను కూడా డ్రా చేసుకోకుండా ఆంక్షలు విధించడంపై పాలకవర్గాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రానున్న రోజుల్లో మరోసారి ఉద్యమించేందుకు సర్పంచ్‌లు సిద్ధమవుతున్నారు.

81 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


బియ్యం వాహనాన్ని పట్టుకున్న అధికారులు

దర్శి, ఫిబ్రవరి 10 : దర్శి పట్టణ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 81 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. పేదల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రా ఘవ, ఎస్ఐ నాగేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ త హసీల్దార్ అశోక్‌కుమార్ రాజంపల్లి వైపు నుంచి దర్శికి త రలిస్తుండగా, దర్శి - కొత్తరెడ్డిపాలెం మధ్యలో సాగర్ కా లువ వద్ద వాహనంలో తరలిస్తున్న 81 బస్తాల రేషన్ బి య్యాన్ని పట్టుకున్నారు. సరుకును ప్రభుత్వ గొడౌన్‌కు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

గడియార స్తంభం నిర్మాణం ఎప్పుడో..!

» రూ.22 లక్షలతో టెండర్

» పనులు ప్రారంభించని కాంట్రాక్టర్

చీరాల, ఫిబ్రవరి 10: గడియార స్తంభం నిర్మాణ పనులు ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు. గడియార స్తంభం అనేది చీరాలకు ఒక ల్యాండ్ మార్క్. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సెంటర్లో గడియార స్తంభం లేదు. ఒకటికి రెండు పర్యాయాలు ఉన్నవాటిని తొలగించారు. ఆతరువాత నూతనంగా నిర్మిస్తామన్న గడియార స్తంభం నిర్మాణం మాటలకే పరిమితమైంది. మధ్యలో ఐటీసీ వారు తాము నిర్మిస్తామని చెప్పిన మాటలకు కూడా ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో వారు వెనక్కు తగ్గారు. టెండరు పొందిన కాంట్రాక్టరు పనులు చేపట్టంలో జా ప్యం చేస్తున్నారు. దీనిపై పురప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చీరాల, పేరాల గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా చేపట్టిన మొదటి చర్యను అప్పట్లో ఆ రెండు గ్రామాల ప్రజలు తిరస్కరించారు. ఆక్రమంలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో పన్నులు భారం మోయలేమని పురబహిష్కరణ పిలుపుమేరకు అందరూ గ్రామాలను విడిచివెళ్లారు. ఈక్రమంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం కూడా తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. ఆతరువాత జరిగిన పరిణామాల క్రమంలో చీరాల మున్సిపాలిటీగా ప్రకటించారు. ఈనేపథ్యంలో మొదటి మున్సిపల్ ఛైర్మన్ అన్నదాత నాగేంద్రుడు హయాంలో చీరాల, పేరాల మధ్యఉన్న పొలిమేర రోడ్డు కూడలిలో భారీ గడియార స్తంభాన్ని నిర్మించారు. సమీపంలో టౌన్‌హాల్ ఉండేది. అప్పట్లో ప్రజలు టౌన్‌హాల్‌లో జరిగే కార్యక్రమాలను వీక్షించేందుకు, రేడియో ప్రసారాలు వినేందుకు, ఐటీసీ కంపెనీలో కార్మికులు తాము విధులకు హాజరయ్యే సమయాన్ని తెలుసుకునేందుకు గడియార స్తంభంలోని గడియారం సూచించే సమయాన్ని అనుసరించేవారు. తరువాత కాలంలో పట్టణ జనాభా పెరిగింది. మారిన కాలానికి అనుగుణంగా వాచీలు వచ్చాయి. ఈక్రమంలో గడియార స్తంభంలో సూచించే సమయం మీద ఆధారపడేవారి సంఖ్య తగ్గింది.

అయితే, గడియార స్తంభం సెంటర్, గడియార స్తంభం అనే ల్యాండ్ మార్క్(కొండగుర్తు) జనాల్లో అప్పటికి, ఇప్పటికి ఉంది. తొలిసారిగా ఏర్పాటుచేసిన గడియార స్తంభాన్ని సుమారు దశాబ్దన్నర క్రితం తొలగించారు. కొన్ని సంవత్సరాలు తరువాత రూ.14 లక్షలతో మరో గడియార స్తంభాన్ని (పాత గడియార స్తంభంకన్నా ఎత్తు తక్కువ) నిర్మించారు. అయితే, అందులో ఉన్న నాలుగు గడియారాలు ఏరోజు సరైన సమయాన్ని చూపేవికావు. తరువాత దాన్ని కూడా తొలగించారు. ఆప్రాంతంలో ఉన్న పాతమున్సిపల్ కాంప్లెక్స్‌ను తొలగించి, కొత్త కాంప్లెక్స్ నిర్మాణం చేసిన తరువాత ఆ కాంప్లెక్స్‌పై గడియార స్తంభం ఏర్పాటుచేస్తామని చెప్పారు. అది జరిగి కూడా సంవత్సరాలు గడుస్తోంది. సదరు కాంప్లెక్స్ నిర్మాణం బాలరిష్టాలు దాటి ఎట్టకేలకు ప్రారంభమైంది. అయితే, గడియార స్తంభం నిర్మాణం మాత్రం జరగలేదు.

ఈక్రమంలో ఐఎల్‌టీడీ, ఐటీసీ కంపెనీ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏదో ఒక ఐకాన్ ఉండేవిధంగా ఆలోచనచేసి, అందుకు గడియార స్తంభం నిర్మాణం చేపడితే బాగుంటుందని పాలకులు, అధికారులను సంప్రదించారు. ఆతరువాత వారికి ఏ ఆటంకం ఏర్పడిందో ఏమో వెనకడుగు వేశారు. దీంతో మున్సిపల్ పరంగా నిర్మాణం చేపట్టేందుకు టెండరు ప్రక్రియ పూర్తిచేశారు. రూ.22 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేయాలని భావించారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ సదరు పనులు ప్రారంభించలేదు. మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సదరు గడియా స్తంభం నిర్మాణం పనులు ప్రారంభించి నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని పురప్రజలు కోరుతున్నారు.



పాత గడియార స్తంభం(ఫైల్)

వైసీపీ అరాచకాలపై లోకేష్ శంఖారావం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



అద్దంకి, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా, వారు సాగిస్తున్న దారుణాలకు గట్టిగా సమాధానం చెప్పేలా.. అన్ని వర్గాలకు అండగా నిలిచేలా ఆదివారం నుంచి లోకేష్ పూరించే నాదమే శంఖారావం అని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈమేరకు శనివారం ఆయన ఓప్రకటన విడుదల చేశారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటించని నియోజకవర్గాలలో శంఖారావం ద్వారా పర్యటిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు టీడీపీ శంఖారావం శ్రీకారం చుట్టిందన్నారు. రాబోయే 40 రోజులలో నారా లోకేష్ 120 నియోజకవర్గాలలో పర్యటించనున్నారన్నారు. శంఖారావం ద్వారా టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక చేపట్టబోయే పథకాలను వివరిస్తారని చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు శంఖారావం సభలను విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు.

నేటి పర్యటన వివరాలు

అద్దంకి, ఫిబ్రవరి 10: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు బల్లికురవ, 10.30కి ముక్తేశ్వరం, 11 గంటలకు అద్దంకి పట్టణంలోని 7వ వార్డు, మధ్యాహ్నం 12 గంటలకు ఒంగోలులలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

యోగ గురువు శేషారెడ్డి దంపతులకు సత్కారం

అద్దంకి, ఫిబ్రవరి 10: తోటి వారికి సహాయం చేయటం కనీస బాధ్యతగా భావించిన రోజు అందరూ సంతోషంగా ఉంటారని యోగా గురువు శేషారెడ్డి అన్నారు. అద్దంకి పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో గత రెండు దశాబ్దాలుగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా యోగ శిక్షణ ఇస్తున్న రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి శేషారెడ్డి, అంజమ్మ దంపతులను శనివారం శిష్య బృందం ఘనంగా సన్మానించారు. అంజమ్మ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో మన్నం త్రిమూర్తులు, చుండూరి మురళీసుధాకర్, డాక్టర్ సుధాకర్, చాగంటి వేణుగోపాల్‌రెడ్డి, అత్తులూరి రమేష్, ఆలూరి వెంకటరావు, మంగమూరు సుబ్బారావు, గార్లపాటి ఆదినారాయణ, శేషారావు, మారుతీ, రమేష్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలి



మఠాధిపతి వీరకుమార స్వామిని సత్కరిస్తున్న భక్తులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 10: నేటి సమాజంలో అందరూ సుఖశాంతులతో జీవించాలని ఈశ్వరీదేవి పీఠ మఠాధిపతులు వీరకుమారస్వాములు అన్నారు. శనివారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక కాకానిపాలెంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈశ్వరిదేవి పీఠం ఏర్పాటుచేసి 108 మంది మహిళలచే సామూహిక కుంకుమార్చన జరిపారు. వీరబ్రహ్మేంద్రస్వామి వారి కాలజ్ఞాన వచనాలను ప్రచారం కల్పించిన జగన్మాత ఈశ్వరిదేవి అమ్మవారు అని అన్నారు. ప్రకాశం జిల్లాలో బొల్లాపల్లి, రాచర్ల, కొత్తపట్నం, ముప్పవరం తదితర ప్రాంతాలల్లో ఎక్కువగా పర్యటించారన్నారు. ప్రస్తుతం అమ్మవారి పీఠంతో పర్యటిస్తూ వారి కావ్యాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా వీరకుమార స్వామిని కమిటీ సభ్యులు, భక్తులు ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజిని, దేవస్థాన ధర్మకర్త ఉండవల్లి కృష్ణారావు, అనంతు వెంకటసుబ్బారావు, పొన్నపల్లి బ్రహ్మానంద, చెన్నుపల్లి శ్రీనివాసచారి, రవికుమార్, వీరయ్య, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

చినగంజాం, ఫిబ్రవరి 10: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో-2 కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు ఎం.దేవదత్తం అన్నారు. మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2023-2024 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ, పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రణాళిక ప్రకారం చదవాలని ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ వి.ఉదయభాస్కర్, ఉపాధ్యాయులు డి.నారాయణరెడ్డి, బి.నాగేశ్వరరావు, ఎ.వీరాచారి, ఎస్.రమణమూర్తి, షేక్ సుభాని బాషా, జి.హవీలదేవి, పీడీ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు

చినగంజాం, ఫిబ్రవరి 10: పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. ఆలయ ప్రతిష్ఠను పురస్కరించుకొని రాత్రి 7 గంటల నుండి వేదపండితులు దంపతులచే విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండదీపారాధన, అంకురారోపణం తదితర పూజలు, హోమాలు నిర్వహించారు. శనివారం నుంచి బుధవారం వరకు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు లక్ష్మీనరసింహస్వామి భక్తులు తెలిపారు. ఈనెల 14న లక్ష్మీనరసింహస్వామి, శిఖర గరుడ ఆళ్వార్ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

పంగులూరు, ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తే ఈనెల 16న దేశవ్యాప్తంగాగా జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. పంగులూరులోని రోటరీ భవనంలో శనివారం ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రతిఏటా కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని చెప్పారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 6400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, రాయిణి కృష్ణకుమారి, వినోద్‌బాబు, మల్లారెడ్డి, సునందబాబు, వీరవల్లి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు ఎస్ఐగా రమేష్ బాధ్యతల స్వీకరణ

పర్చూరు, ఫిబ్రవరి 10 పర్చూరు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నిజాంపట్నం ఎస్సైగా విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సాధారణ బదిలీపై పర్చూరు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన రవిశంకర్‌రెడ్డి బాపట్ల ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతనంగా విధులు చేపట్టిన ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కారంచేడు ఎస్ఐగా సురేష్

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 10: కారంచేడు ఎస్సైగా కె.సురేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సాధారణ బదిలీల్లో భాగంగా చినగంజాం ఎస్సైగా విధులు నిర్వహిస్తూ కారంచేడు బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు ఈసందర్భంగా ఎస్సై తెలిపారు.

ఆసరా చెక్కుల పంపిణీనా.. వైసీపీ బహిరంగ సభా!

» అధికారులు, వైసీపీ నేతల తీరుపై

స్వయం సహాయక సంఘాల సభ్యుల విమర్శ



ఆసరా చెక్కుల పంపిణీ సభ స్టేజి మొత్తం నిండిఉన్న వైసీపీ రంగుల బెలూన్‌లు

అద్దంకి, ఫిబ్రవరి 10: స్వయం సహాయక సంఘాలకు ఆసరా చెక్కుల పంపిణీ కాస్తా వైసీపీ బహిరంగసభను తలపించేలా నిర్వహించటం విమర్శలకు తావిస్తుంది. అద్దంకి పట్టణంలోని శ్రీప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం అద్దంకి మండలం పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత సంబరాల కార్యక్రమం నిర్వహించారు. అయితే, సభ ఆవరణ అలంకరణ తో పాటు, స్టేజ్ మొత్తం వైసీపీ రంగులను పోలిన బెలూన్‌లు, టెంట్ సైడ్‌వాల్స్‌తో తయారు చేశారు. ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా వైసీపీ పార్టీ కార్యక్రమంలో నిర్వహించటం పట్ల పలువురు స్వయం సహాయక సంఘాల సభ్యులు విమర్శిస్తున్నారు. అదే సమయంలో ప్రసంగాలు కూడా వైసీపీ నేతల పొగడ్తలతో కొనసాగటం పట్ల కూడా విమర్శిస్తున్నారు. సభకు హాజరైన వారిలో అధికారులు, ప్రజాప్రతినిధుల కంటే వైసీపీ నేతలే అధిక సంఖ్యలో ఉండటం విశేషం. పేరుకే స్వయం సహాయక సంఘాల సమావేశం కాని నిర్వహణ తీరు మొత్తం వైసీపీ ప్రచారంలా సాగిందన్న విమర్శలు వస్తున్నాయి. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి హాజరై ఆసరా చెక్కులు పంపిణీ చేశారు.

ఎంపీడీవో సత్యనారాయణ, ఏరియా కోఆర్డినేటర్ రవి, ఏపీఎం కోటేశ్వరరావు, ఎంపీపీ అవివన జ్యోతి, జడ్పీటీసీ జ్యోతి వెంకటరత్నం, వైసీపీ నేతలు జ్యోతి హనుమంతరావు, గుజ్జుల జగన్మోహనరెడ్డి, అవిసన ప్రభాకర రెడ్డి, మాకినేని శ్రీనివాసరావు, జజ్జర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



ప్రమాదస్థలంలో ఉన్న లారీ, ధ్వంసమైన కారు, మృతి చెందిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి

అద్దంకి, ఫిబ్రవరి 10: ఆగి ఉన్న లారీని వెనుకనుంచి కారు ఢీ కొనటంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇస్కా శ్రావణ్‌కుమార్‌రెడ్డి(33) అక్కడకక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా జలదంకికి చెందిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇంకా వివాహం కాకపోవటంతో స్వగ్రామంలో ఉన్న తల్లి సుశీలను తీసుకువెళ్లేందుకు జలదంకి వెళుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో శింగరకొండ, అద్దంకి మధ్యలో నామ్ రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో కారు బెలూన్‌లు ఓపెన్ అయినా శ్రావణ్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పొగమంచు దట్టంగా ఉండటం, ఆగిఉన్న లారీ సిగ్నల్ లైట్లు వేయకపోవటంతో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. తల్లి సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేశారు.

జానపద కళలను రక్షించుకోవాలి



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఫణీంద్రబాబు, తదితరులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 10: మన సంస్కృతిలో జానపద కళలు ప్రధాన భాగమని, ఆచార వ్యవహారాలకు అద్దంలాంటి వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు డాక్టర్ సీహెచ్ ఫణీంద్రబాబు అన్నారు. శనివారం పట్టణంలోని గీతామందిర్‌లో జానపద కళాపీఠం ఆధ్వర్యంలో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన జానపదాలు-జ్ఞాన పదాలు అనే గ్రంథావిష్కరణ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యు.దేవపాలన అధ్యక్షతన జరిగింది.

ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఫణీంద్రబాబు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంతరించిపోతున్న ప్రాచీన కళలు నేటి తరానికి తెలియకుండా పోతున్నాయని అన్నారు. కొన్ని కళలు ఇప్పిటికే అంతరించిపోయాయని చెప్పారు. నాటి కళలు, కళల పేర్లను, పదాలను నేటి యువత మరిచిపోవడంతో పాటు ఆనందాన్ని కోల్పోయి, వినోదాన్ని కొత్త కోణంలో చూస్తున్నారన్నారు. తద్వారా ఆనందాన్ని కోల్పోయి అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. అలాంటి వాటిని తెలియజేసే ఈ గ్రంథం కళాపీఠం ప్రచురణగా రావడం పీఠానికి గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం జానపద కళలను కాపాడే ప్రయత్నాలు చేయాల్సి ఉందన్నారు. ఈసందర్భంగా గ్రంథ రచయిత జ్యోతి చంద్రమౌళిని వివిధ ప్రజాసంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో గోరంట్ల లక్ష్మీనారాయణ, అన్నమనేని వెంకట్రావు, గాడేపల్లి దివాకర్‌దత్తు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఎంఈవో వీరాంజనేయులు, పీసీహెచ్ కోటయ్య, జ్యోతి రమేష్‌బాబు, శ్రావణ్‌కుమార్, మన్నం త్రిమూర్తులు, శ్రీమన్నారయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇళ్ల పట్టాలు రద్దుచేయాలి

» సీపీఎం నాయకుడు కొండయ్య డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కొండయ్య

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 10: మండల పరిధిలోని సిలోన్ కాలనీలో 27 మందికి రిటైర్డ్ తహసీల్దార్ అశోక్‌వర్ధన్ డబ్బు తీసుకుని అక్రమంగా పట్టాలు ఇచ్చారని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకుడు కొండయ్య డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఇచ్చిన రిటైర్డ్ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ తహసీల్దార్ ఉద్యోగ విరమణకు కొద్దిరోజుల ముందు సిలోన్ కాలనీలో 27 మందికి అక్రమంగా పట్టాలు ఇచ్చారని, వాటిని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ రహస్యంగా పంపిణీ చేశారని కొండయ్య ఆరోపించారు. ఇదెక్కడి న్యాయమని తాము ప్రశ్నిస్తున్నామన్నారు. వాస్తవానికి సదరు స్థలాల విషయం కోర్టులో ఉందని, గతంలో పనిచేసిన తహసీల్దార్ ఆ 27 మందికి ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చారని చెప్పారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి ఇటీవల రిటైర్ అయిన తహసీల్దార్ వారికి సిలోన్ కాలనీలో పట్టాలు ఇచ్చారన్నారు. వాటిని రహస్యంగా పంపిణీ చేయటం మోసపూరిత ధోరణికి దర్పణం పడుతుందని కొండయ్య వివరించారు. గతంలో సదరు విషయాన్ని ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. వెంటనే చర్యలు చేపట్టి కాలనీవాసులకు న్యాయం చేయకపోతే సోమవారం నుంచి చీరాల ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు కాలనీవాసులు, సీపీఎం బాధ్యులు పాల్గొన్నారు.

ఎండీయూ విధానాన్ని రద్దుచేయాలి

» రేషన్ డీలర్లతో సరుకులు పంపిణీ చేయించాలి

» అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు



మాట్లాడుతున్న లీలా మాధవరావు

అద్దంకి, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ విధానాన్ని రద్దుచేసి రేషన్ సరుకుల పంపిణీ డీలర్లకు అప్పగించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు అన్నారు. అద్దంకి నియోజకవర్గ రేషన్‌డీలర్ల సమావేశం శనివారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులో చిన్ని శాంతయ్య భవనంలో జరిగింది. ఈసందర్భంగా మాధవరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వలే డీలర్లకు గౌరవ వేతనంతో పాటు కమీషన్ ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంత డీలర్లకు రూ.7500, పట్టణాల్లో రూ.10 వేలు గౌరవ వేతనంతో పాటు బియ్యం పంపిణీకి కమీ షన్ ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం కల్పించిన బీమా సౌకర్యం, మృతిచెం దిన డీలర్ల మట్టి ఖర్చులకు రూ.15 వేలు, హెల్త్ కార్డులు, డీలర్ల సంక్షేమ నిధి ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్లను కార్మికులు గా పరిగణించి కార్మిక వేతన చట్టం ప్రకారం గ్రామాలలో షాపు నిర్వహణ ఖర్చులు పోను రూ.18,500, పట్టణాలలో రూ.25 వేల ఆదాయం కల్పించాలన్నారు. సమావేశంలో పిన్నింటి గోపికృష్ణ, భాస్కరరావు, నాగేశ్వరరావు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

చీరాలటౌన్, ఫిబ్రవరి 10: ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం పొందవచ్చునని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యామల పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది రక్తదానం చేశారు. ఈసందర్భంగా శ్యామల మాట్లాడుతూ అజాగ్రత్త, అతివేగంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి

బల్లికురవ, ఫిబ్రవరి 10: మండలంలోని వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం అర్ధరాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనటంతో షేక్ మదర్ (71) అనే వృద్ధుడు మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం లాం గ్రామానికి చెందిన షేక్ మదర్, అల్లాభక్షు వేమరవం వద్ద బాతుడు రాళ్లు కొట్టేందుకు బైకుపై వచ్చారు. వేమరవం వైపు వెళ్లే కట్టప్ప అనేవ్యక్తి ఎదురుగా బైకుపై వచ్చి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో తీవ్రగాయాలైన మదర్, అల్లాభక్షును 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మదర్ మృతి చెందాడు. వైద్యశాల నుంచి ఫిర్యాదు మేరకు బల్లికురవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పంగులూరులో ఉచిత కంటి వైద్యశిబిరం

పంగులూరు, ఫిబ్రవరి 10: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరణం హనుమంతరావు, షేక్ కాలేషావలి తెలిపారు. పంగులూరులోని రోటరీక్లబ్ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు పరీక్షలు ప్రారంభిస్తారని తెలిపారు. గుంటూరుకు చెందిన శంకర్ కంటి వైద్యశాల డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ వీరరాఘవయ్య కోరారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆసరా లబ్ధిదారుల ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలరాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్

చీరాల, ఫిబ్రవరి 10: ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరాం అన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెం బాయ్స్ హైస్కూల్లో శనివారం 4వ విడత ఆసరా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బలరాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ హాజరయ్యారు. మండల పరిధిలోని 1565 పొదుపు సంఘాలకు సంబంధించి రూ.13,69,69,518 చెక్కును సంఘాల ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, గవిని శ్రీనివాసరావు, ఆసాది అంకాళరెడ్డి, మల్లెల లలితా రాజశేఖర్, బండారు శివపార్వతి, నల్లబోతుల రాజ్‌కుమార్, బుర్ల సాంబశివరావు, బోయిన కేశవులు, బ్రిటా శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, ఏపీఎం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండకు తరలివెళ్లిన దీక్షధారులు

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 10: పెనుగొండలో ఆదివారం జరిగే శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవానికి వాసవి మాలధరించిన భక్తులు శనివారం పెనుగొండకు తరలివెళ్లారు. ముందుగా వేటపాలెంలో మాలధారులు ఇరుముడులతో నగరోత్సవం నిర్వహించారు. నగరోత్సవంలో భక్తులు మాలధారులకు నీటితో వార్లుపోసి, కొబ్బరికాయలు కొట్టి సాగనంపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

చీరాల, ఫిబ్రవరి 10: చదువుతో పాటు ఆట, పాటలు అవసరమేనని జిల్లా పవర్ లిఫ్టింగ్ అండ్ టెన్నికాయిట్ అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ తాడివలస దేవరాజ్ అన్నారు. ఆల్ఫస్ ఇంటర్నేషన్ స్కూల్లో శనివారం నిర్వహించిన స్పోర్ట్ మీట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మంజునాథ్, పీఈటీలు మమత, శ్రీకాంత్, ఏవో పాలేటి విజయభాస్కర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

చినగంజాం, ఫిబ్రవరి 10: మండలంలోని సోపిరాల గ్రామంలో గల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ ఐదవ వార్షికోత్సవ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7గంటలకు హోమం, 9గంటలకు అభిషేకాల కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. గురుస్వాములు స్వామికి పడిపూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం నైవేద్యం, హారతి ఇచ్చారు. భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

మార్టూరు, ఫిబ్రవరి 10: ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధిస్తే కోరుకున్న లక్ష్యాన్ని సాధించడానికి తొలి అడుగు వేసినట్లవుతుందని శ్రీనివాస విద్యాసంస్థల ఛైర్మన్ వీరగంధం శ్రీనివాసరావు అన్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తేనే కోరుకున్న లక్ష్యాన్ని పొందగలుగుతారని చెప్పారు. శనివారం మార్టూరులోని రాయల్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. సభకు కళాశాల ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి అధ్యక్షత వహించారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఇండియన్ రెవెన్యూ సర్వీసులో శిక్షణ పొందుతున్న వీరగంధం లక్ష్మీసుజిత మాట్లాడుతూ మొక్కుబడిగా విద్యను కొనసాగిస్తే లక్ష్యాన్ని సాధించలేరన్నారు. ఇంటర్ తర్వాత ఉన్నత స్థానానికి, కోరుకున్న స్థాయికి చేరాలంటే అన్నివిధాలుగా సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాలన్నారు. కష్టపడుతూ ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, అశోక్ పుట్టా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు ఎస్ఐగా మల్లికార్జునరావు

ఇంకొల్లు, ఫిబ్రవరి 10: ఇంకొల్లు ఎస్సైగా ఎస్.మల్లికార్జునరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై నాయబ్‌రసూల్ బదిలీ కాగా, అయన స్థానంలో ప్రకాశం జిల్లా తాలూకా పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్.మల్లికార్జునరావు నియమితులయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని నూతన ఎస్సై మల్లికార్జునరావు తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

బల్లికురవ, ఫిబ్రవరి 10: మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీ శివారు రామాంజనేయపురం గ్రామంలో కుంచాల గోపీచంద్ అనే యువకుడు శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అందిన సమాచారం మేరకు.. తల్లి మందలించటంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి 108లో నర్సరావుపేటలో వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన దుర్గాభవాని




దుర్గాభవానీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), ఫిబ్రవరి 10: హైజంప్ జాతీయస్థాయి పోటీలకు చీరాల మండలం ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కొండేపి దుర్గా భవాని ఎంపికైంది. కడవకుదురులో అండర్ - 16 విభాగంలో పాల్గొన్న భవాని ప్రతిభచూపి ఈనెల 16 నుంచి 18 వరకు గుజరాత్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని హసేరా, పీడీ రోజ్‌హెల్మా, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడాకారుడికి చేయూత

చీరాలటౌన్, ఫిబ్రవరి 10: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలలో మెడల్ సాధించిన చీరాల క్రీడాకారుడు దేవరకొండ ప్రేమ్‌సాగర్‌కు టీడీపీ నాయకుడు ఐఆర్ఎస్ దగ్గుమళ్ల ప్రసాదరావు తోడ్పాటు అందిస్తున్నాడు. ఐదేళ్లపాటు ప్రేమ్‌కు స్పాన్సర్‌షిప్ అందిస్తున్నట్లు శనివారం సంబంధిత పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ప్రేమ్ మాట్లాడుతూ క్రీడల్లో ఎంతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్న సమయంలో మంచి అవకాశం వచ్చిందన్నారు. తప్పక వినియోగించుకుని మంచి పేరు తీసుకువస్తానని చెప్పారు.



మృత్యుశకటంలా దూసుకువచ్చిన ఐరన్ లోడ్ లారీ ఏడుగురిని బలిగొంది. 26 మందిని ఆసుపత్రి పాలు చేసింది. కావలి పట్టణం ముసునూరు టోల్‌గేట్ సమీపంలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజాము 2.15 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ఘటన ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. పోలీసులు, క్షతగాత్రుల కథనం మేరకు..



బోల్తాపడిన ఆవులు తరలిస్తున్న లారీ

మృత్యు శకటం!

- బీభత్సం సృష్టించిన ఐరన్‌లోడ్ లారీ
- మొదట లారీని, ఆ తర్వాత బస్సును ఢీకొని...
- ఏడుగురు మృత్యువాత.. 26 మందికి గాయాలు
- డ్రైవర్ నిద్రమత్తు.. మితిమీరిన వేగమే కారణం
- అర్ధరాత్రి మిన్నంటిన ఆర్తనాదాలు
- ముసునూరు టోల్‌ప్లాజా వద్ద ఘోర ప్రమాదం



ప్రమాదానికి కారణమైన ఐరన్‌లోడు లారీ



లారీ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన బస్సు ముందుభాగం

కావలి/కావలి రూరల్, ఫిబ్రవరి 10 : హైదరాబాదు నుంచి ఆవుల లోడుతో ఓ లారీ తిరుపతి జిల్లా నాయుడుపేటకు శుక్రవారం రాత్రి బయలుదేరింది. అలాగే ఐరన్ లోడుతో జార్ఖండ్ నుంచి చెన్నైకు మరో లారీ (14 చక్రాలు) వస్తోంది. ఇక చెన్నైలో 42 మంది ప్రయాణికులతో శుక్రవారం రాత్రి హైదరాబాదుకు ఓ ట్రావెల్ బస్సు బయలుదేరింది. తెల్లవారు జామున ముసునూరు టోల్‌గేట్ వద్దకు వచ్చే సరికి ఐరన్‌లోడ్ లారీ డ్రైవర్ వేణు నిద్రమత్తే ఈ ప్రమాదానికి కారణమని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. హైవేపై ముందు వెళుతున్న ఆవుల లోడ్ లారీని ఓవర్ టేక్ చేయబోయి దానిని ఢీకొట్టాడు. ఆ తర్వాత లారీని అదుపు చేయలేక హైవే డివైడర్‌ను దాటి అవతల వైపు ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టారు.

● శ్రమించిన పోలీసులు, హైవే సిబ్బంది

ప్రమాదం జరిగిన వెంటనే కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ, సీఐలు శ్రీనివాసరావు, రాజేష్, నాగభూషణం తమ సిబ్బందితోపాటు హైవే సిబ్బంది, టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్ తదితరులు ఘటనా స్థలికి చేరుకున్నారు. భారీ క్రేన్‌లు, జేసీబీల సహాయంతో నుజ్జునుజ్జయిన లారీ, బస్సులలో ఇరుక్కున్న వారిని అతికష్టం మీద బయటకు తీశారు.

● బస్సు డ్రైవర్ అప్రమత్తత

మృత్యుశకటంలా దూసుకొస్తున్న భారీ లారీని పసిగట్టిన బస్సు డ్రైవర్ మునుస్వామి తంబిరాన్ చకచక్యంగా వ్యవహరించారు. ఈ ఘటనకు ముందే బస్సు డ్రైవరు టోల్‌ప్లాజా దాటిన తర్వాత కొద్దిసేపు ఆపి తిరిగి బయలు దేరాడు. సరిగ్గా రెండు, మూడు నిమిషాల వ్యవధిలోనే దూసుకొస్తున్న లారీని గమనించాడు. దానిని తప్పించేందుకు రహదారి అంచువరకు బస్సును తిప్పడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు కూడా వేగంగా వచ్చి ఎదురెదురుగా ఢీకొని ఉంటే ఊహించని రీతిలో పెను ప్రమాదమే జరిగి ఉండేది.

మృతులు వీరే..



లారీ క్లీనర్ పటేల్ దీపక్, తంబిస్వామి, రూప, అంజు సురేష్

తమిళనాడులోని కాంచీపురానికి చెందిన బస్సు డ్రైవరు మునుస్వామి తంబిరాన్ (36), నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెనుబర్తికి చెందిన ఐరన్‌లోడ్ లారీ డ్రైవర్ సొంటి వేణు (23), హైదరాబాదుకు చెందిన పశువుల లారీ క్లీనర్ పటేల్ దీపక్ (29), బస్సులోని ప్రయాణి కులు పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన అంజూరు సురేష్ (33), కృష్ణా జిల్లా నాగాయలంక ఏసుపురానికి చెందిన కొప్పాడి తంబిస్వామి (30), హైదరాబాదుకు చెందిన అటల్ రూప (39), గుర్తు తెలియని ప్రయాణికుడు (25) ఉన్నారు.



ఐరన్‌లారీలో ఇరుక్కున్న డ్రైవర్ వేణు మృతదేహం

● స్తంభించిన ట్రాఫిక్

జాతీయ రహదారికి ఇరువైపులా రెండు లారీలు, బస్సు అడ్డుగా ఉండిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో వాహనాల్లో వస్తున్న వారు ట్రాఫిక్ ఎందుకు ఆగిందో అర్థంకాక ఇబ్బందులు పడ్డారు. ఆవుల లారీని ఢీకొట్టిన మార్గంలో ఆ లారీ హైవే దిగి కింద బోల్తాపడటంతో ఆ మార్గంలో పోలీసులు వాహనాలను నడిపించారు. ఆ తర్వాత భారీ క్రేన్‌ల సహాయంతో లారీ, బస్సును తొలగించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ఉదయం 10 గంటల వరకు సమయం పట్టింది.



హైవేపై ఆగిపోయిన వాహనాలు

● వివిధ ప్రాంతాలకు క్షతగాత్రులు

ఈ ప్రమాదంలో సుమారు 26 మంది వరకు గాయపడ్డారు. 108 వాహనాలు, ప్రైవేటు అంబులెన్స్‌ల ద్వారా క్షతగాత్రులను వివిధ ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తరలించారు. కావలి ఏరియా వైద్యశాలకు ఏడుగురిని, నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ఒకరిని, కావలిలోని రెండు ప్రైవేటు ఆసుపత్రులకు 13 మందిని, ఒంగోలులోని కిమ్స్ ఆసుపత్రికి ఇద్దరిని, నెల్లూరులోని కిమ్స్, అపోలో ఆసుపత్రులకు ముగ్గురిని తరలించారు.

● ఘటనాస్థలి పరిశీలన

హైవేపై ఘటన జరిగిన ప్రాంతాన్ని, కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీ సౌజన్య, జేసీ ఆదర్శ రాజేంద్రన్, ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి, డీటీసీ బి చందర్, కావలి రవాణా అధికారి సుధాకర్ రెడ్డి, కావలి ఆర్డీవో శీనా నాయక్ తదితరులు పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

డీఎంహెచ్‌వో పరామర్శ

నెల్లూరు (వైద్యం) : బస్సు ప్రమాద బాధితులను డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య శనివారం పరామర్శించారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన ఆయన కిమ్స్, మెడికవర్, అపోలో ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వీరికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు.



క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తూ..



ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రులు



ఏరియా వైద్యశాలలో ఎస్పీ, జేసీ, ఆర్డీవో



ఆవులకు మేత వేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థి

ఓ విద్యార్థి ఔదార్యం

కావలి రూరల్ : ఈ ప్రమాదంలో లారీలో ఉన్న ఓ ఆవు మృతి చెందగా, మిగిలిన మూడు ఆవులు, నాలుగు దూడలు ఆకలితో అలమటించాయి. అక్కడకు చేరుకున్న విట్స్ కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థి మాదాల జనార్దన్ ఆ మూగజీవాలను గుర్తించాడు. వెంటనే తన తండ్రి వెంకటేశ్వర్లుకు విషయం చెప్పి ట్రాక్టర్‌లో మేత, నీరు తెప్పించి వాటి ఆకలి తీర్చాడు. అంతేగాక ఈ విషయాన్ని పశుసంవర్ధక శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాడు. వెంటనే వారు స్పందించి పశువులకు వైద్యసేవలు అందించారు. అనంతరం పశువులను మరో లారీలో నాయుడుపేటలోని గోశాలకు తరలించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

నెల్లూరు (విద్య): ఇంటర్మీడియట్ ప్రయోగ (ప్రాక్టికల్స్) పరీక్షల నిర్వహణకు ఇంటర్‌బోర్డు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే ఈ నెల 5వ తేదీ నుంచి ఒకేషనల్ విద్యార్థులకు ప్రారంభమైన ప్రాక్టికల్స్ 20వ తేదీ వరకు జరగనున్నాయి. జనరల్ సైన్స్ విద్యార్థులకు ఆదివారం నుంచి రెండు దశల్లో ప్రాక్టికల్స్ పరీక్షలను సీసీ కెమెరాల నీడలో నిర్వహిస్తున్నారు. ఎంపీసీ విభాగంలో 16,567 మంది, బైపీసీ విభాగంలో 2822 మంది మొత్తం 19,567 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరవుతున్నారు. కొత్త జిల్లా ప్రాతిపదికన 128 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐవో ఎ.శ్రీనివాసులు తెలిపారు.

● సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

ఈ ఏడాది ఎన్నడూ జరగని రీతిలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేలా సన్నాహాలు చేశామని, కార్పొరేట్‌లకు కళ్లెం వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అవకతవకలు జరిగినా, ల్యాబ్‌ల నిర్వహణ సరిగా లేకున్నా కఠినంగా వ్యవహరిస్తామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని ఆర్‌ఐఓ హెచ్చరించారు. పరీక్షల పేరుతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థుల వద్ద నుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతూ అవాస్తవాలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత యాజమాన్యాలపై ప్రత్యేక దృష్టి సారించి బోర్డు నిబంధనలకు అనుణంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది ప్రాక్టికల్ పరీక్ష పూర్తయిన వెంటనే ఎప్పటికప్పుడు మార్కులను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ)ని నియమించారు. అలాగే 400 మంది ఎగ్జామినర్‌లు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్స్, హైపవర్ కమిటీ, డీఈసీ సభ్యులను నియమించినట్లు తెలిపారు. విద్యార్థుల వారి సమస్యలను ఫోన్ 0861-2320312 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

కర్లపాళెం వాసుల దీక్ష విరమణ

- మహీధరరెడ్డికి మారిటైమ్ బోర్డు సీఈవో ఫోన్
- 14లోగా సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ



కర్లపాలెం గ్రామస్థులతో కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరి, పోర్టు అథారిటీ అధికారులు

గుడ్లూరు/కందుకూరు, ఫిబ్రవరి 10: తమ సమస్యలు పరిష్కరించాలని, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ రామాయపట్నం పోర్టు నిర్వాసిత కర్లపాలెం గ్రామస్థులకు శనివారం కూడా దీక్షల్లో పాల్గొన్నారు. ఈ దీక్షలకు వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు సంఘీభావం ప్రకటించారు. మూడురోజులుగా ఎమ్మెల్యే మహీధరరెడ్డి దీక్షలో పాల్గొంటుండగా, శనివారం భవిష్యత్తు ఆందోళనలపై చర్చించారు. అయితే మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్‌కుమార్ ఎమ్మెల్యేకు ఫోన్‌చేశారు. సమస్యలన్నీ బుధవారంలోగా పరిష్కరిస్తామని, కర్లపాలెం గ్రామం, సాలిపేట ఎస్టీ కాలనీవాసులకు ఒక్కో కుటుంబానికి రూ. 9.91 లక్షల చొప్పున ఆర్‌ఆర్ ప్యాకేజీ తక్షణం జమచేయటమేకాక, వారి ప్రస్తుత నివాసాలకు చెల్లించాల్సిన నష్టపరిహారం కూడా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కర్లపాలెం పునరావాస కాలనీకి అవసరమైన భూసేకరణ కూడా త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటామని, 18 ఏళ్లు నిండిన వారిని కూడా మరో కుటుంబంగా గుర్తించి వారికి కూడా ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు.

● నేటి నుంచి వివరాల సేకరణ

ఆదివారం నుంచే లబ్ధిదారుల వివరాలు సేకరణ ప్రారంభించి సోమవారం నగదు జమలు ప్రారంభిస్తామని, బుధవారంలోగా మొత్తం ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రవీణ్‌కుమార్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను విరమించాలని కర్లపాలెం గ్రామస్థులు నిర్ణయించారు. రాత్రి 8 గంటల సమయంలో సబ్ కలెక్టరు జి. విద్యాధరి, పోర్టు అధికారులు దీక్షా శిబిరం వద్దకు చేరుకుని మీ హామీలన్నీ నెరువేరుతాయి, దీక్షలను విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారుల విజ్ఞప్తి, ఎమ్మెల్యే సూచన మేరకు దీక్షలను కర్లపాలెం గ్రామస్థులు విరమించారు. అక్కడ దీక్షల కోసం వేసిన షామియానాలను, కుర్చీలను తొలగించారు.

● హామీలు నెరవేర్చకుంటే మళ్లీ దీక్షలు

సీఈవో ప్రవీణ్‌కుమార్, సబ్ కలెక్టరు విద్యాధరి ఇచ్చిన హామీమేరకు బుధవారంలోగా సమస్య పరిష్కారం కాకుంటే తిరిగి ఆందోళనకు సిద్ధపడాలని నిర్ణయించినట్లు తెలిసింది. కాగా శనివారం దీక్షలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఎంఎల్ నాయకులు నాంచార్లు, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు చిన్ని రాజగోపాల్, సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, నూతలపాటి వెంకటేశ్వర్లు, జీవీ. కుమార్, గుడ్లూరు ఎంపీపీ పులి రమేష్, పరిసర గ్రామాల సర్పంచులు శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, సుబ్బరామయ్య, జెల్లి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నా కలుద్దాం.. తర్వాత చూద్దాంలే!

- ఎమ్మెల్యేను కలిసేందుకు పెంచలయ్య విశ్వ ప్రయత్నం
- బిజీగా ఉన్నా తర్వాత మాట్లాడదామన్న మహీధర్ రెడ్డి
- ఉత్కంఠ రేపుతున్న కందుకూరు రాజకీయం

కందుకూరు, ఫిబ్రవరి 10 : కందుకూరు నియోజకవర్గ రాజకీయాల్లో గందరగోళం, ఉత్కంఠ కొనసాగుతోంది. మూడు వారాలుగా అధికార వైసీపీలో నెలకొంటున్న పరిణామాలు ఆ పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది. అలాగే ఎమ్మెల్యే మహీధరరెడ్డి వ్యవహారశైలి కూడా మరింత గందరగోళ పరుస్తోంది. ఇటీవల సీఎం జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్న ఆదిశంకర విద్యాసంస్థల ఛైర్మన్ వంకి పెంచలయ్య ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కలిసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం ఆయన మహీధర రెడ్డిని కలిసేందుకు కందుకూరు వస్తున్నట్లు ఫోన్ చేయగా 'మీకెందుకు అంత శ్రమ నేనే ఓ కార్యక్రమం కోసం రాజుపాలెంలోని సాయిబాబా గుడి వద్దకు వస్తున్నాను. అక్కడకు రండి కలుద్దామని బదులు ఇచ్చినట్లు తెలిసింది. తీరా పెంచలయ్య అక్కడకు వెళ్లి వేచి ఉండగా మామిడి రైతుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఎమ్మెల్యే అక్కడ ఆగకుండా నేరుగా వెళ్లిపోయారు. కొద్దిసేపటికి విషయం తెలుసుకున్న పెంచలయ్య తిరిగి ఎమ్మెల్యేకు ఫోన్ చేయగా 'అమావాస్య పూట ఏం మాట్లాడతారులే ఈరోజు, రేపు మంచిరోజులు కాదు. తర్వాత చూద్దాం' అని చెప్పినట్లు తెలిసింది. తనకు నాలుగైదు రోజులు బిజీ కార్యక్రమాలు ఉన్నాయని, ఆ తర్వాత మాట్లాడదామని కూడా మహీధరరెడ్డి వ్యాఖ్యానించినట్లు సమాచారం. అయితే, వైసీపీ అధినేత జగన్ ఇంతకుముందు కందుకూరు అభ్యర్థులుగా సూచించిన బొట్ల రామారావు యాదవ్, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌లు విఫలమైనట్లే పెంచలయ్య కూడా విఫలమవుతారన్న అభిప్రాయమూ లేకపోలేదు. బుర్రా మధుసూదన్ ఇక్కడి పరిస్థితులు తెలుసు కనుక అసలు పోటీకే ముందుకు రాకపోగా బొట్ల రామారావు ఉత్సాహం చూపినా పార్టీ నిర్ధేశించిన లక్ష్యాలను ఆయన చేరుకోలేకపోవటంతో పక్కనపెట్టినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో పెంచలయ్య మాత్రం అభ్యర్థిగా ఖరారయ్యే వరకు ప్రయాణం కొనసాగుతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మహీధరరెడ్డి కూడా అదే ఆలోచనతో ముందుకు సాగుతూ తన సత్తా చాటే విధానంలో అడుగులు వేస్తున్నారు.

దేవదాయ శాఖలో

బదిలీలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 10 : దేవదాయ ధర్మాదాయ శాఖలో జిల్లాలో పలు ఆలయాల ఈవోలకు పదోన్నతులు కల్పిస్తూ బదిలీ చేశారు. రాపూరు మండలం పెంచలకోన లక్ష్మీ నృసింహస్వామి ఆలయ ఈవోగా ఉన్న కోవూరు జనార్దన్‌రెడ్డికి ముందస్తు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి జొన్నవాడ కామాక్షితాయి సమేత మల్లి కార్జున స్వామి ఆలయానికి బదిలీ చేశారు. అక్కడ ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు నిర్వ హిస్తున్న వీ.గిరికృష్ణను వేదగిరి క్షేత్రానికి పరిమితం చేశారు. అలాగే నెల్లూరు నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయ ఈవోగా పనిచేస్తున్న డబ్బుగుంట వెంకటేశ్వర్లుకు ముందస్తు సహాయ కమిషనర్‌గా పదోన్నతి ఇచ్చి తిరుపతి జిల్లా సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయా నికి బదిలీ చేశారు. అలాగే రాయలసీమ జిల్లాలకు ఆర్‌జేసీగా ఉన్న కేవీ సాగర్ బాబుకు డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి పెంచలకోన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి బదిలీ చేశా రు. ఆయన శనివారం కోన ఆలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ట్రాఫిక్ చక్రబంధంలో ఆత్మకూరు

పార్కింగ్ స్థలాలు లేక వాహనదారుల అవస్థలు


సోమశిల రోడ్డు సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్

ఆత్మకూరు, ఫిబ్రవరి 10: ట్రాఫిక్ చక్రబంధంలో ఆత్మకూరు పట్టణం చిక్కుకుంది. వాహనదారులు, పాదచారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సమస్య మరింత జఠిలమవుతోంది. దుకాణాలు, హోటళ్ల ఎదురుగా వాహనాలు నిలుపుకునేందుకు స్థలం లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిలుపుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసు సిబ్బంది కొరతతో నియంత్రణ కష్టమవుతోంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులు, తోపుడు బండ్లు రహదారిపైనే ఉంచుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

విస్తరణకు నోచుకోని రహదారి

ఆత్మకూరు పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు నాలుగురోడ్ల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి సోమశిలరోడ్డు సెంటర్ వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. సోమశిలరోడ్డు సెంటర్ నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలకు ఎదురుగా కొనుగోలుదారులు వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. రహదారి పైనే ద్విచక్ర వాహనాలు నిలపడం వలన కాలినడకన వెళ్ళే పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

పోలీసుస్టేషన్ ఆవరణే పార్కింగ్

కొండారెడ్డి హాస్పిటల్ సెంటర్‌లోని దుకాణాలకు, హోటళ్ళకు వచ్చేవారు తమ వాహనాలను దుకాణాల ఎదుట నిలుపుతున్నారు. అక్కడా చోటు చాలక పోవడంతో ఏకంగా పోలీసుస్టేషన్ ఆవరణలోనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి : సీఐ

పట్టణంలో పార్కింగ్ స్థలం లేకపోవడంతో పాటు ద్విచక్ర వాహనాలు, ఆటోల వలన ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టిసారిస్తున్నామని సీఐ జి వేణు పేర్కొన్నారు. ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ప్రత్యేక వాహనంలో తిరుగుతూ రహదారిపై వాహనాలు నిలపకుండా చూస్తున్నారు. కానిస్టేబుళ్ళు, హోంగార్డులను ఏర్పాటుచేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాం. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రజలు, ద్విచక్ర వాహనదారులు సహకరించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష


పరీక్ష గదుల వివరాలను చూసుకుంటున్న విద్యార్థులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 10: స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ఈ పరీక్షకు 282 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 161 మంది హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా బాల కేశవులు, అబ్జర్వర్‌గా రవికృష్ణ వ్యవహరించారు.

ఘనంగా గంధ మహోత్సవం

అనంతసాగరం, ఫిబ్రవరి 10: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ యూసూఫ్ అలిషా ఖాదరీ గంధ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలతో దర్గాను సుందరంగా అలంకరించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. దర్గాలో అన్నదానం ఏర్పాటుచేశారు. సయ్యద్ షాహాజి అలిషాఖాదరి పర్యవేక్షణలో వేడుకలు ఘనంగా జరిగాయి.

ఏపీటీఎఫ్ కార్యాలయానికి కంప్యూటర్ వితరణ


కంప్యూటర్ వితరణ చేస్తున్న అంకిరెడ్డి

వింజమూరు, ఫిబ్రవరి 10 : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ వింజమూరు ప్రాంతీయ కార్యాలయానికి స్థానికుడు అయిన దాదిబత్తిన అంకిరెడ్డి కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా వింజమూరు మండల శాఖ ప్రధాన కార్యదర్శి పి కొండారెడ్డి అంకిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఆర్‌జేసీ జూనియర్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బొందల బలరామిరెడ్డి, జిల్లా కౌన్సిలర్ మల్లికార్జున, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి నారాయణ ధర్మపురి, ఎం శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్, పోరుసు రామయ్య, అధ్యక్షులు మోహన్‌రెడ్డి, బసిరెడ్డి, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల ప్రారంభం

ఏఎస్ పేట, ఫిబ్రవరి 10: సంగం-కలిగిరి రహదారి పునరుద్ధరణ పనులను శనివారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఏఎస్ పేట మండలం అక్బరాబాదు గ్రామం వద్ద ప్రారంభించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మేకపాటి అభినవ్‌రెడ్డి, రెండు నియోజకవర్గాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 10: స్థానిక ఎస్టీ కాలనీలో టీడీపీ కార్యకర్త జానకం బుజ్జమ్మ మృతిచెందడంతో టీడీపీ నాయకులు, కాకర్ల ట్రస్టు అధినేత కాకర్ల సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్, మన ఫౌండేషన్ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డిలు తమ ప్రతినిధులచే మట్టిఖర్చులకు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కిరణ్, జల్సాయాదవ్, హరీష్, టీడీపీ నాయకులు పావులూరి అక్కమ్మ, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : ఈఎస్


మాట్లాడుతున్న ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 10: త్వరలో జరగనున్న ఎన్నికల దృష్ట్యా రిటైల్, ఔట్‌లెట్ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే సూపర్‌వైజర్లు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె నాగమల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయ గిరి, వరికుంటపాడు, మర్రిపాడు, దుత్త లూరు మండలాల్లో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఎలాంటి రాజకీయ వత్తిళ్లకు, ప్రలోభాలకు గురి కావద్దన్నారు. ప్రతి వ్యక్తికి మూడు సీసాల మద్యం మాత్రమే విక్రయించాలన్నారు. దుకాణాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. దుకాణాల్లో సిబ్బంది ఎలాంటి అవకతవకలకు పాల్పడినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వీరాంజనేయులు, ఎస్ఐ పీర్‌హుస్సేన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకే శంఖారావం : బొల్లినేని

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన శంఖారావం అని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం పేరుతో పర్యటించి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలకు తెలియచేస్తారన్నారు. వైసీపీ పాలనలో నిరుద్యోగ సమస్య అధికమై యువత ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్నిరకాల ధరలు పెరిగిపోవడంతో పేదల జీవనం దుర్భరంగా మారిందన్నారు. మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుతో యువగళం పాదయాత్ర ఉత్తరాంధ్రలో కొనసాగించేందుకు ఇబ్బందులు తలెత్తాయన్నారు. శంఖారావం ద్వారా కార్యకర్తలు, ప్రజలకు లోకేష్ మరింత చేరువకానున్నారని ఆయన తెలిపారు.

భౌతిక దాడులకు పాల్పడితే ఊరుకోం : బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న బుజ్జిరెడ్డి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 10: బీజేపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని, తగిన బుద్ధి చెబుతామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఇటీవల సీతారామ పురం మండలం బసినేనిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ నాయకుడు ముడమాల రమేష్‌రెడ్డి అనర్హులకు సంక్షేమ పథకాలు అందించడం ఏమిటని అధికారులను ప్రశ్నించారన్నారు. దీనిపై ఆ మండల వైసీపీ కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి రమేష్‌రెడ్డికి ఫోన్‌చేసి అసభ్యకర పదజాలంతో దుర్భాషలాడడం దారుణమన్నారు. అలాగే అతని అనుచరులు ప్రధాని నరేంద్రమోదీ ఫొటోలు, బీజేపీ క్యాలెండర్లు, కరపత్రాలను తగలబెట్టడం పిరికిపంద చర్య అన్నారు. అధికారం ఉందనే అహంకారంతో వైసీపీ నాయకులు రెచ్చిపోతున్నారని, అధికారం కోల్పోయే సమయం దగ్గరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆవుల రోశయ్యయాదవ్, సయ్యద్ షాబ్‌జాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసిన బండారు

వింజమూరు, ఫిబ్రవరి 10 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను మంగళగిరిలోని పార్టీ కార్యాల యంలో వింజమూరు మండల జనసేన అధ్యక్షుడు బండారు సత్యనారాయణ మంగళవారం ఉదయగిరి నియోజకవర్గ సీని యర్ నాయకుడు కాశిరెడ్డి ఆధ్వ ర్యంలో మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించుకున్నారు. ముఖ్యంగా సాగునీరు లేక ప్రజలు వలసలు వెళుతున్నారని తెలిపారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉదయగిరిపై ప్రత్యేక దృష్టి సాధిస్తామని పవన్‌కల్యాణ్ తెలిపారు. అదేవిధంగా టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఎవరికి టికెట్ వచ్చినా శక్తివంచన లేకుండా విజయానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని బుక్‌లెట్ రూపంలో పవన్‌కల్యాణ్‌కు చూపించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరు రవీంద్ర, సీతారాంపురం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉదయగిరి కన్వీనర్ సురేందర్‌రెడ్డి, వెలుగోటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మార్కెట్ వీధి


కుళ్లిన కూరగాయలు రోడ్డుపై పోసిన వ్యాపారులు

ఉదయగిరి, ఫిబ్రవరి 10: పట్టణంలోని కూరగాయల మార్కెట్ వీధి దుర్గంధం వెదజల్లుతోంది. మార్కెట్‌లో కుళ్లిన కూరగాయలు, వ్యర్థాలను వ్యాపారులు వీధిలో పడే స్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో చుట్టుపక్కల నివాసాల వారు అసౌకర్యానికి లోనవుతున్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణ లోపంతో తాగునీటి పథకాల నిర్వీర్యం

● కోటి రూపాయల ప్రజాధనం నిరుపయోగం

సీతారామపురం, ఫిబ్రవరి 10: మండలంలోని ప్రజలకు సురక్షిత తాగునీరు అందించటానికి ఏర్పాటుచేసిన తాగునీటి పథకాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. గత తెలుగుదేశం ప్రభుత్వం సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించడానికి ఎన్టీఆర్ సుజల పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేసింది. ఈ పథకంలో భాగంగా జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతమైన సీతారామపురం మండలానికి దాదాపు కోటి రూపాయలకు పైగా వెచ్చించి రంగనాయుడుపల్లి వద్ద వాటర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. నీటి కోసం ఈప్రాంతంలో నాలుగు బోర్లు వేశారు. 30వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్‌ట్యాంక్ నిర్మించారు. రంగనాయుడుపల్లి నుండి మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు నీటి సరఫరా చేసేందుకు మినీ స్టోరేజ్ ట్యాంక్‌లను కూడా ఏర్పాటుచేసి రెండు రూపాయలకు 20 లీటర్ల శుద్ధ జలం సరఫరాకు శ్రీకారం చుట్టారు. దీంతో పేదలందరికీ ఎంతో ప్రయోజనం కలుగుతుందనుకున్నారు. కానీ పనులు చివరి దశలో ఉండగా 2019వ సంవత్సరంలో సార్వత్రిక ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడం వలన ఈ పథకం ఆగిపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులకు నిధులు సమకూర్చకపోవడం, చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కోటి రూపాయలు పైగా ప్రజాధనం నిరుపయోగం అయింది. సీతారామపురం మండలంలో అధిక శాతం నీటిఎద్దడి ఉండటం, నీరు లభించే కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరైడ్ వాటర్ ఉండడంతో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చలేకపోవడంతో మండల ప్రజలు ప్రైవేట్ వ్యక్తులు నడిపించే వాటర్ ప్లాంట్‌లపై ఆధారపడవలసి వస్తోంది. వేసవి కాలం వస్తుందంటే మండల ప్రజల తాగునీటి కష్టాలు అధికమవుతున్నాయి. సుజల పథకానికి నిధులు సమకూర్చి ప్రజలకు మంచి నీరు అందిస్తే గత టీడీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అధికార వైసీపీ ప్రజలకు మంచి చేసే ఈ పథకాన్ని నీరుగార్చిందని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ ప్రాంత నీటి కష్టాలు తీరుస్తుందేమోనని ప్రజలు ఆశాభావాన్ని వ్యక్తపరుస్తున్నారు.


రంగనాయుడుపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న వాటర్ స్టోరేజ్ ట్యాంకు


సీతారామపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న మినీ స్టోరేజ్ ట్యాంకు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మాలకొండ డీసీకి ఘన సన్మానం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 10: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఏసీగా పనిచేస్తున్న కేబీ శ్రీనివాసరావుకు డిప్యూటీ కమిషనర్(డీసీ)గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా శనివారం ఆయన్ను పలువురు ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు పదోన్నతి లభించినా మాలకొండలోనే నియమించినట్లు తెలిపారు. ఇక్కడే బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఇంటూరి భారతి, పరిటాల వీరాస్వామి, ఇంటూరి హరిబాబు, అనుమోల వెంకటేశ్వర్లు, అనుమోల వెంకటస్వామి, కండ్లగుంట మాలకొండయ్య పాల్గొన్నారు.

● నృసింహుడి సేవలో వంకి పెంచలయ్య

మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం తిరుపతి జిల్లా గూడూరు ఆదిశంకర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య యాదవ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు, గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆయన వెంట ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

● స్వామివారి ఆదాయం రూ. 6,45,196

లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 6,45,196 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 5,300, కుంకుమార్చన ద్వారా రూ. 20,840, వివాహాల ద్వారా రూ. 1000, తలనీలాల ద్వారా రూ. 23,925, వాహనపూజల ద్వారా రూ. 2,760, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,60,500, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 1,440, రూము అద్దెల ద్వారా రూ. 22,200, కవర్ల ద్వారా రూ. 4,200, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,64,430, అన్నదానం ద్వారా రూ. 2,24,501, విరాళాల ద్వారా రూ. 14,100 ఆదాయం ఆయన వివరించారు.


మాలకొండలో డీసీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న జడ్పీటీసీ దంపతులు


స్వామివారి దర్శనానంతరం ఆలయం వెలుపలికి వస్తున్న వంకి పెంచలయ్య

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అద్దంకి : ఆగి ఉన్న లారీని వెనుకనుంచి కారు ఢీకొనడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇస్కా శ్రావణ్‌కుమార్ రెడ్డి (33) అక్కడకక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా జలదంకికి చెందిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఆయన అవివాహితుడు. స్వగ్రామంలో ఉన్న తల్లి సుశీలను తీసుకువెళ్లేందుకు జలదంకికి కారులో వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో బాపట్ల జిల్లా శింగరకొండ, అద్దంకి మధ్య నామ్ రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో కారు బెలూన్‌లు ఓపెన్ అయినా శ్రావణ్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పొగమంచు దట్టంగా ఉండటం, ఆగిఉన్న లారీ సిగ్నల్ లైట్లు వేయకపోవడంతో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. తల్లి సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జగన్ అరాచకాలపై లోకేష్ శంఖారావం

కావలి, ఫిబ్రవరి10: జగన్‌రెడ్డి అరాచకాలపై యువనేత నారాలోకేష్ ప్ర కటించిన యుద్ధానికి నాందే శంఖారావమని కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని ఆయన నివాసంలో శనివారం సా యంత్రం విలేకరులతో మాట్లాడారు. శంఖారావంలో జగన్‌రెడ్డి అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజలకు తెలియచేస్తూ వారికి లోకేష్ భరోసా ఇవ్వను న్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తలు నారా లోకేష్‌తో నేరుగా తమ అభిప్రాయం పంచుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పమిడి రవికుమార్ చౌదరి, మన్నవ రవిచంద్ర, గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతి బాబూరావ పాల్గొన్నారు.

● కావ్యను కలిసిన మత్స్యకారులు

బోగోలు మండలం చెన్నారాయునిపాలెం, తాటిచెట్లపాలెం,కొత్తూరు, పాత పాలెం, యల్లాయపాలెంకు చెందిన మత్స్యకారులు, మత్స్యకార సంఘ నాయ కులు ముసునూరులోని ఆయన నివాసంలో క్రిష్ణారెడ్డిని కలిసి మద్దతు తెలి పారు. ఇటీవల కావలి ఎమ్మెల్యేకు తాటిచెట్లపాలెంలో ఎదురైన చేదు అనుభ వాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

● వైసీపీ నేతల చేరిక

కావలి మాజీ కౌన్సిలర్ షేక్ షాహిరాబేగం, ఆమె భర్త ఖమర్‌బాబు శనివారం టీడీపీలో చేరారు. వారికి క్రిష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానిం చారు. మరికొందరు నాయకులు టీడీపీలో చేరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయండి : ఎంపీపీ

కొండాపురం, ఫిబ్రవరి10: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేయాలని ఎంపీపీ బొడ్డు అనూరాధ అధికారులను కోరారు. శనివారం ఆమె అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో సుజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మూడునెలల్లో జరిగిన అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. గుడవళ్లూరు సర్పంచి బీ.మాచెర్ల మాట్లాడుతూ జలజీవన్ పథకానికి పంచాయతీబోరును జతచేయడంతో అందరికీ నీరందడంలేదని చెప్పగా, ఉప్పలూరు సర్పంచి కొండలరావు తమ గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు పూర్తయినా 40 శాతం మందికి కూడా నీరందడంలేదని తెలిపారు. ఈ పథకానికి సంబంధించి తమ గ్రామాల్లో విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీ కోటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, ఎంఈవో-2 ఆనందరావు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం యువకుడికి డాక్టరేట్


శ్రీనాథ్‌ను సన్మానిస్తున్న సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు

వలేటివారిపాలెం : గ్రామానికి చెందిన యువకుడు నలగట్ల శ్రీనాథ్‌కు డాక్టరేట్ లభించింది. శ్రీనాథ్ సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగంలో ఐదేళ్ల విశేష సేవలు అందించినందుకు అమెరికా సంస్థ ప్రముఖ యూనివర్సిటీ హోప్‌థియోలాజికల్ ఆధ్వర్యంలో డాక్టరేట్ ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాజు గాన సభలో యూనివర్సిటీ ఈ డాక్టరేట్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుల భరణం కృష్ణమోహన్, హైకోర్టు రిటైర్డు జడ్జి వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై మహీధర్‌రెడ్డిది కపట ప్రేమ : మిరియం

ఉలవపాడు : రామాయపట్నం పోర్టు నిర్వాసితులను అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి బీసీలపై ఉన్నది కపటప్రేమేనని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పిస్తే ఓర్వలేని ఎమ్మెల్యే పోర్టు నిర్వాసిత బాధితులను అడ్డుపెట్టుకొని కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపినప్పుడు దీక్ష చేయని ఎమ్మెల్యే కందుకూరును వైసీపీ బీసీలకు కేటాయించే సరికి పోర్టు నిర్వాసితులు గుర్తొచ్చి తాను నిరాహార దీక్షకు దిగుతానని చెప్పడం కుటిల రాజకీయలకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే దీక్ష చేపట్టిన మరుక్షణం తాను కూడా నిరాహార దీక్ష చేపడతానని శ్రీనివాసులు పేర్కొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి


వరిపైరును పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి అబ్రహం లింకన్ తదితరులు

లింగసముద్రం : వరిపైరులో తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి అబ్రహం లింకన్ చెప్పారు.శనివారం ఆయన మండలంలోని మొగిలిచెర్లలో వరిపైరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మలిరెడ్డి చిన చెన్నయ్య పొలంలోని వరిపైరును పరిశీలించి, సూపర్ చెక్ చేశారు తెగుళ్లను గుర్తించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు టీ దీప, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా



మాట్లాడుతున్న మహీధర్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 10: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు సైతం మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. త్వరలో రామాయపట్నం పోర్టు ప్రాంతంలో ప్రారంభంకానున్న ఇండోసోల్ సోలార్ పవర్ మాడ్యులర్స్ కంపెనీలో పదివేల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే 750 మందిని ఎంపిక చేసుకుని ట్రైనింగ్ ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారని ఎమ్మెల్యే వివరించారు.

కోడికత్తి శ్రీనుపై దాడి జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత !


నిరసన తెలుపుతున్న దళితులు

అల్లూరు, ఫిబ్రవరి 10 : కోడికత్తి శ్రీనుపై ఏదైనా దాడి జరిగితే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి అన్నారు. శనివారం అల్లూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోడికత్తి శ్రీనుపై ఏ క్షణమైనా దాడి జరిగే అవకాశాలున్నాయన్నారు. దళితుల ద్వారానే అతడిని హత్య చేసేందుకు ప్రభుత్వం వెనుకాడదనే అనుమానం తమకు కలుగుతోందన్నారు. శ్రీనుకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

సర్వర్ పని చేయక అవస్థలు


సచివాలయంలో వేచి ఉన్న లబ్ధిదారులు

బిట్రగుంట, ఫిబ్రవరి 10: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో పేదలందరికి ఇళ్ల రిజిస్ట్రేషన్లకు శనివారం సర్వర్ పనిచేయక లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది అవస్థలు పడ్డారు. పంచాయతీలో 210 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారిలో పదిమంది అనర్హులు, 195 మందికి నాలుగు రోజులుగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా 90 మందికి మాత్రమే పూర్తి చేశారు. తండ్రి, భర్త పేర్లలో తప్పులు ఉండటంతో రెండు, మృతి చెందిన లబ్ధిదారులు ఇద్దరు, ఫింగర్ ప్రింట్ రాక ఒకటి పెండింగ్‌లో ఉన్నాయని కార్యదర్శులు మహబూబ్ బాషా, చైతన్య తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. సర్వర్ సక్రమంగా పనిచేయక పోవడంతో లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరగలేకపోతున్నారు.

మెట్ట రైతు కష్టాలు తీరేనా ?

● సాగునీటికి కష్టాలు పడుతున్నవైనం ● ఒక్క తడికి రూ.10వేల ఖర్చు

కొండాపురం, ఫిబ్రవరి10: మండలంలోని రైతులు సాగు చేసిన మెట్టపైర్లను బతికించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేల అడుగుల దూరం నుంచి నీటిని తరలించి పంటలను కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పంటలు సాగుచేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

● మిరప, పొగాకు రైతులకు తప్పని కష్టాలు

మండల పరిధిలోని సాయిపేట, నేకునాంపేట, రేణమాల, గుడవళ్లూరు, కొమ్మి, సత్యవోలు, పార్లపల్లి, శెట్టిపాలెం, గొట్టిగుండాల తదితర గ్రామాల్లో మిరప, పొగాకు పంటలను సాగు చేశారు. వర్షాభావం కారణంగా పొగాకు పంటకు ఒక్క తడి వేస్తే సరిపోతున్నా ఈ ఒక్క తడిని వేయాలంటే ఎకరానికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. వేల అడుగుల దూరం నుంచి రెండు చోట్ల ఇంజన్‌లు ఏర్పాటుచేసి టార్పాలిన్ పట్టలు పరచి రెండు రోజుల పాటు నీరు వేయాల్సి వస్తున్నది. అలాగే మిరప సాగుచేసిన రైతులు నాలుగయిదు తడులు నీరు వేయాల్సి వస్తుంది. ఒక్క తడికి రూ. 10 వేలు ఖర్చవుతుండగా 5 తడులు వేయాలంటే రూ. 50 వేలు ఖర్చవుతుంది. ఈ క్రమంలో పెట్టుబడులు అధికమవుతుండగా గిట్టుబాటు ధర దక్కకపోతే నష్టపోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.


ప్లాస్టిక్ పైపులతో నీటిని తరలిస్తున్న రైతులు


సాగులో ఉన్న మిరప

నీటి తడులకే ఎక్కువ ఖర్చు



కౌలుకు తీసుకొని రెండెకరాల మిరప సాగుచేశా. నీరు అందుబాటులో లేకపోవడంతో దూరం నుంచి నీరు తరలించాల్సి వస్తుంది. ఎకరానికి నీటి తడికి రూ. 10 వేలు ఖర్చవుతుంది. రాళ్లపాడు రిజర్వాయరు నుంచి కాలువకు నీరు విడుదల చేసినట్లయితే ఎకరానికి రూ.1000 ఖర్చవుతుంది. - మక్కెన రమణయ్య, వెల్లటూరివారిపాలెం